ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ
epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

మహబూబ్‌నగర్ : fb.com/vaartha Digital

Published from Mahabubnagar, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

14-1-2026 బుధవారం సంపుటి: 31 సంచిక: 344 పేజీలు: 10+4 వెల: 6.50

19న బిజెపి జాతీయ అధ్యక్షుని ఎన్నిక 3
గ్రీన్‌లాండ్ స్వాధీనానికి ప్రతినిధుల సభలో బిల్లు 7




## శవాల గుట్టలు!

### ఇరాన్‌లో పెట్రేగిన హింసాకాండ

**రెండువేల మందికిపైగా మరణించారంటున్న మానవహక్కుల సంస్థలు**

**స్తంభించిన ప్రజారవాణా.. చేతులెత్తేసిన భద్రతాబలగాలు**

**ఖమేనీ ప్రాణాలకు ముప్పు? రష్యా వెళ్లేందుకు ఏర్పాట్లు**

**ఇరాన్ విడిచి వెళ్లాలని తమ పౌరులను అప్రమత్తం చేసిన అమెరికా.. టెహ్రాన్‌పై దాడికి సిద్ధంగా యుఎస్**



**లండన్ / వాషింగ్టన్, జనవరి 13:** ఇరాన్‌లో ఆర్థిక సంక్షోభంతో మొదలైన అల్లర్లు, నిరసనలు మిన్నంటాయి. ఓ వైపు ప్రభుత్వానికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా పలు నగరాల్లో నిరసనలు కొనసాగుతున్నాయి. తాజాగా ప్రభుత్వానికి అనుకూలంగా ర్యాలీలు, ఆందోళనలు మొదలయ్యాయి. రెండు వారాలుగా కొనసాగుతున్న హింసాకాండ మరింత పెరిగిపోయింది. నిరసనకారులను అదుపు చేయడంలో అటు పోలీసులు, ఇటు భద్రత బలగాలు చేతులెత్తేశారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నిరసనలు పెరిగిన నేపథ్యంలో ఇంటర్నెట్ సేవలు బంద్ అయ్యాయి. అంతేగాక విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో నగరాలు, పట్టణాలలో అంధకారం నెలకొంది. నిత్యావసర వస్తువులు దొరకడం లేదని సామాన్యులు గగ్గోలు పెడుతున్నారు. మరోవైపు ప్రజారవాణా పూర్తిగా ఆగిపోయింది. తాజా పరిణామాలతో ఆందోళనకారులను భద్రతా బలగాలు అదుపు చేయలేక పోతున్నారు. అటు అంతర్జాతీయ మీడియాలో ఇరాన్‌లో ప్రధాన నగరాల్లోని రహదారుల్లో శవాలు గుట్టలుగా పడి ఉన్నాయంటూ ఫొటోలతో కథనాలు వెలువడ్డాయి. గత మూడు రోజుల వ్యవధిలో రెండు వేల మందికి పైగా నిరసనకారులు, ఆందోళనకారులు ప్రాణాలు కోల్పోయారని మానవ హక్కుల సంస్థలు చెబుతున్నాయి. అయితే, ఇరాన్ అధికార యంత్రాంగం మాత్రం ఐదారు వందల మంది మాత్రమే చనిపోయారని పేర్కొంటున్నారు. ఇదిలా ఉండగా, ప్రస్తుతం దేశంలో నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ ప్రాణాలకు ముప్పు ఉన్నట్లు >>2



సికింద్రాబాద్ పెరేడ్‌గ్రౌండ్‌లో కైట్ ఫెస్టివల్‌ను ప్రారంభిస్తున్న మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్

## ఆకాశ వీధిలో.. పొంగల్ పతంగ్‌లు

**సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకే సంక్రాంతి వేడుకలు: మంత్రి జూపల్లి**

**సికింద్రాబాద్ పెరేడ్ గ్రౌండ్స్‌లో అంతర్జాతీయ కైట్ ఫెస్టివల్ ప్రారంభం**

**హైదరాబాద్ (కంటోన్మెంట్), జనవరి 13 ప్రభాతవార్త:** తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాల పరిరక్షణకు కైట్ అండ్ స్వీట్ వేడుకలు ఎంతో అవసరమని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావ్ తెలిపారు. సంక్రాంతి పర్వదినాన్ని >>2

## మున్సి'పోల్స్'లో బిసిలకు రిజర్వేషన్లు

# 34 శాతం పైనే!




**ఎస్సీ, ఎస్టీలకు కలిపి 15శాతానికి పైగా ఖరారుకు అవకాశం**

**52,43,023 మంది ఓటర్లు.. తుది జాబితా ప్రకటించిన ఇసి**

**నిజామాబాద్ కార్పొరేషన్‌లో అత్యధికంగా 3,48,051 మంది ఓటర్లు**

**కొత్తగూడెంలో అత్యల్పంగా 1,34,774 ఓట్లే, అమరచింతలో 9,147 ఓట్లు**

**18న మేడారంలో కేబినెట్ భేటీ, మున్సిపల్ ఎన్నికల నిర్వహణపై నిర్ణయం**

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జనవరి13:** తెలంగాణ త్వరలో మున్సిపల్ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో స్థానిక సంస్థలకు సంబంధించి బీసీ రిజర్వేషన్లను ఖరారు చేస్తూ డెడికేటెడ్ కమిషన్ ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. మున్సిపాలిటీల వారీగా వార్డులు, చైర్‌పర్సన్ల స్థానాలకు బీసీ రిజర్వేషన్లను పేర్కొంది. మొత్తం 50శాతం రిజర్వేషన్లలో ఎస్సీ, ఎస్టీ, రిజర్వేషన్లు తీసివేయగా మిగిలినవి బీసీలకు కేటాయించింది. గ్రామాలతో పోల్చితే పట్టణాల్లో ఎస్సీ, ఎస్టీ జనాభా తక్కువగా ఉంటుంది. ఈ నేపథ్యంలో ఎస్సీ, ఎస్టీలకు కలిపి దాదాపు 15శాతానికి పైగా రిజర్వేషన్లు ఖరారు చేసినట్లు తెలిసింది. బీసీలకు 34శాతానికి పైగా రిజర్వేషన్లు కల్పించాలని కమిషన్ పేర్కొన్నట్లు తెలిసింది. య కమిషన్ నివేదిక ఆధారంగా మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల వారీగా రిజర్వేషన్లను సంక్రాంతి పండుగ తర్వాత ఒకటి, రెండు రోజుల్లో ఖరారు చేసే అవకాశం ఉంది. తుదినివేదికను రాష్ట్ర ఎన్నికల సంఘానికి మున్సిపల్ శాఖ అందజేస్తుంది. ఇదిలాఉండగా రాష్ట్రంలో ఎన్నికలు జరగనున్న 117 మున్సిపాలిటీలు, 6 కార్పొరేషన్లలో మొత్తం 52,43,023 మంది ఓటర్లు ఉన్నట్లు రాష్ట్ర ఎన్నికల సంఘం తుది ఓటర్ల జాబితాను ప్రకటించింది. వీరిలో 25,62,369 మంది పురుష ఓటర్లు, 26,80,014 మంది మహిళా ఓటర్లు,640 మంది ట్రాన్స్‌జెండర్ ఓటర్లు ఉన్నారు. పట్టణ స్థానిక సంస్థల్లో పురుషుల కంటే మహిళా ఓటర్లే అధికంగా ఉండటం గమనార్హం. నిజామాబాద్ కార్పొరేషన్‌లో అత్యధికంగా 3,48,051 మంది ఓటర్లు ఉండగా, >>2



## కోళ్లా! కోట్లా?

### బరుల్లోకి దూకిన పందెంకోళ్లు

**కోస్తా జిల్లాలతో పాటు ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు, పల్నాడు జిల్లాల్లోనూ పదునెక్కిన బరులు**

**పొట్టేళ్ల పందాలు కూడా ఎక్కువే**

**కార్ల బహుమతులు ప్రకటిస్తున్న నిర్వాహకులు**

**విజయవాడ,జనవరి13,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలో సంక్రాంతి కోడి పందాలు జోరందుకున్నాయి. సంక్రాంతి పండుగకు ఏపీలో కోడి పందాల నేపథ్యంలో రూ. వేల కోట్లు చేతులు మారుతున్నాయి. ఇది అతిశయోక్తి అన్పించినా జరుగుతున్న చరిత్ర ఇదే! పండుగా సరదా సాగే ఈ పోటీలు ఇప్పుడు జూదం తరహాలో మారాయి. కోస్తాంధ్ర, పల్నాడు, ఉమ్మడి కృష్ణా జిల్లాలో కోడి పందెల సాగిపోతున్నాయి. దీనికి తోడు బరులకు దగ్గరల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక టెంట్లులో పేకాట, కాసినోలు సాగిపోతున్నాయి. పోలీసులు నామ మాత్రపు దాడులు జరిపి, చేతులు దులపుకునే పరిస్దితి. కోర్టు ఉత్తర్వుల అమలుకు రాజకీయ నాయకులే అడ్డంకి, ఆయా ఊళ్ళలో రాజకీయపక్షాల నాయకులు బరులను మీకిన్ని, మాకిన్ని అని పంచుకుని మరి పందెలు నిర్వహిస్తున్నారు. సంక్రాంతి పండుగ సందడి చూడాలంటే ఆంధ్రప్రదేశ్‌లోని గ్రామాలకు వెళ్లాల్సిందే. మూడు రోజుల పండుగకు మోడుబారిన పల్లెలు కళకళలాడుతాయి. ప్రతి ఊరు సంబురంతో నిండుతుంది. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ లోని కోస్తాంధ్ర ప్రాంతం కోలాహలంగా ఉంటుంది. పండుగకు రెండు వారాల ముందు నుంచే సందడి నెలకొనగా ఇక పండుగ మూడు రోజులు అంబరాన్నంటేలా ఒక జాతర మాదిరి ప్రతి ఊరు ఉంటుంది. వలస వెళ్లిన ప్రతి మనిషి ఈ పండుగకు సొంతూరు వస్తుంటారు. ఈ పండుగ సమయంలో ప్రత్యేక ఆకర్షణ కోళ్ల పందాలు. సంక్రాంతి అంటేనే కోళ్ల పందాలు అనే మాదిరిగా మారిపోయింది. చిన్నాపెద్దా ఎవరైనా ఈ కోడిపందాలు తెగ ఎంజాయ్ చేస్తారు. ఇక ఈ పందాలతో పాటు కాయ్ రాజా కాయ్, పేకాట తదితర ఆటలు ప్రత్యక్షమవుతాయి. ఇక మద్యం అయితే ఏరులై పారుతుంది. మాంసం అయితే టన్నులు టన్నులు అమ్ముడవుతుంది. మహిళలు రంగవల్లులు, పిండివంటలు, ఆటాపాటలతో సందడి చేస్తుంటారు. ఇలా ఎటు చూసినా సంక్రాంతి పండుగతో ఆంధ్రప్రదేశ్‌కు ప్రాణం తీసుకువస్తుంది. ఈ పండుగతో ఏపీ ఆర్థిక వ్యవస్థకు ఊపిరి అందుతుంది. కోడి పందెలు భయంకరమైన వ్యసనం కోళ్ళు బరిలోకి దిగగానే పందెం రాయుళ్లంతా ఇహం మరచి పందెం కాస్తారు. ఆస్తులు పోతున్నా లెక్కలు చేయరు. ఈ పందాలు కూడా వేల నుంచి మొదలై.. లక్షల దాకా వెళ్లిపోతుంది. పందెంలో ఓడితే పోయేది కోడి మాత్రమే కాదు.. పరువు కూడా! అందుకోసమే.. పుంజుని బరిలో దించాక పందెంరాయుళ్లు వెనకా ముందు ఏమీ చూసుకోరు. డబ్బులు తీస్తూనే ఉంటారు. అవసరమైతే ఆస్తి పత్రాలు కూడా పందెంలో పెట్టేస్తారు. అందుకోసమే.. ఇన్ని వేల కోట్లు చేతులు మారతాయి. ఇదంతా.. భారీ మొత్తాల్లో >>2



శిశువును తరలిస్తున్న అధికారులు

## అంగట్లో ఆడబిడ్డ!

**శిశువును రూ. 3 లక్షలకు అమ్మేసిన తల్లిదండ్రులు**

**హైదరాబాద్‌లో దారుణం**

**కేసు నమోదు చేసిన పోలీసులు**

**షాద్‌నగర్, జనవరి 13,ప్రభాతవార్త:** మూడో సంతానంగా కూడా ఆడపిల్ల పుట్టిందన్న కారణంగా తల్లిదండ్రులు ఏకంగా ఓ పసికందును అమ్మకానికి పెట్టారు.. ఓ ప్రబుద్ధుడు ఆ పసికందుకు ఖరీదు కట్టి రూ.3 లక్షలకు కొనుగోలుచేశాడు.. అంగన్వాడీ టీచర్ ద్వారా వెలుగులోకి వచ్చిన ఈవ్యవహారంలో రంగంలోకి దిగిన పోలీసులు ఆడ శిశువును ఐసిడిఎస్ అధికారులకు అప్పగించారు. వివరాల్లోకి వెళితే ఫరూక్ నగర్ మండలం లాల్ సింగ్ తండాకు చెందిన రేణుక, వినోద్ దంపతులకు గత నవంబర్ 9 వ తేదీన హైదరాబాద్ జజ్జిరి ఖానాలో ఆడ శిశువు జన్మించింది. ఇంతకుముందే వీరికి ఇద్దరుఆడపిల్లలు ఉన్నారు. మూడోసారి కూడా మగ పిల్లాడు పుడతాడు అనుకుంటే >>2

## గ్రామ పంచాయతీలకు రూ.277 కోట్ల నిధులు

**విడుదల చేసిన ఆర్థిక శాఖ**

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జనవరి13:** సంక్రాంతి పండుగ రోజు గ్రామపంచాయతీలకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. కొత్తగా ఎన్నికైన సర్పంచ్ లకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున శుభాకాంక్షలు తెలియజేస్తూ రూ. 277 కోట్ల నిధుల విడుదలకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు ఆర్థిక శాఖ అధికారులు పంచాయతీలకు రూ.277 కోట్ల నిధులను వెంటనే విడుదల చేశారు. ప్రజాభవన్ లో ఆర్థిక శాఖ అధికారుల ముఖ్యసమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆర్థికశాఖ ప్రధాన కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయితీ సర్పంచ్ లకు, వార్డు మెంబర్లకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు సంక్రాతి శుభాకాంక్షలు తెలిపారు.

## కుంభమేళాను మించే మేడారం జాతర

**ఈసారి 3 కోట్ల మంది హాజరయ్యే అవకాశం**

**నిర్మాణాలకు రూ.250 కోట్లకుపైగా వ్యయం**

**భక్తుల కోసం భారీగా ఏర్పాట్లు: మంత్రులు అడ్లూరి లక్షణ్ కుమార్, సీతక్క**



అధికారులతో సమీక్ష చేస్తున్న మత్రులు సీతక్క, లక్ష్మణ్

**హైదరాబాద్, ప్రభాతవార్త, జనవరి 13:** సమ్మక్క-సారలక్క జాతరను కుంభమేళాకు మించి ఘనంగా నిర్వహించాలని మంత్రులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్, దనసరి అనసూయ సీతక్క అధికారులను ఆదేశించారు. మేడారం జాతరకు ఈసారి దాదాపు 3 కోట్ల మంది హాజరయ్యే అవకాశం ఉంటుందని మంత్రులు తెలిపారు. రూ.250 కోట్లకుపైగా నిధులతో పనులను నిర్వహిస్తున్నట్టు మంత్రులు తెలిపారు. ఈనెల 28 నుండి 31 వరకు జరిగే మేడారం సమ్మక్క, సారలమ్మ జాతరకు ఈసారి దాదాపు మూడు కోట్లమంది భక్తులు హాజరయ్యే అవకాశం ఉన్నందున ప్రభుత్వంలోని వివిధ శాఖలు సమన్వయంతో పనిచేసి భక్తులకు ఏవిధమైన ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని రాష్ట్ర మంత్రులు అడ్లూరి లక్షణ్ కుమార్, దనసరి అనసూయ సీతక్క అధికారులను ఆదేశించారు. మేడారం >>2



## వీధి కుక్కలు కరిస్తే రాష్ట్రాలదే బాధ్యత

**పరిహారం చెల్లించాల్సిందే: సుప్రీంకోర్టు స్పష్టీకరణ**

**జంతు ప్రేమికులపైనా త్రిసభ్య ధర్మాసనం ఆగ్రహం**

**న్యూఢిల్లీ, జనవరి 13:** దేశవ్యాప్తంగా పెరుగుతున్న వీధి కుక్కల దాడి, మరణాలపై మరోసారి సుప్రీంకోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతా, జస్టిస్ ఎన్.వి. అంజారీలతో కూడిన ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. పిల్లలు, వృద్ధులపై దాడి జరిగితే అందుకు రాష్ట్ర ప్రభుత్వానిదే బాధ్యత అని తేల్చి చెప్పింది. బాధితులకు నష్టపరిహారం చెల్లించాలని ఆదేశించింది. అలాగే జంతు ప్రేమికులపైనా ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. జంతువులపై ఉన్న ప్రేమ, మనుషులపై ఎందుకు >>2



గుజరాత్‌లోని మాన్సా మునిసిపాలిటీలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవం, శంకుస్థాపన కార్యక్రమంలో కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను భారీ గజమాలతో సత్కరిస్తున్న దృశ్యం

## మిల్లులపై విజిలెన్స్ ఆకస్మిక దాడులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జనవరి13:** ప్రభుత్వ ధాన్యం మళ్లించడాన్ని నిరోధించడానికి రాష్ట్రవ్యాప్త ప్రత్యేక ఎన్‌ఫోర్స్‌మెంట్ డ్రైవ్‌లో భాగంగా, తెలంగాణ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం రాష్ట్రవ్యాప్తంగా బియ్యం మిల్లులపై ఏకకాలంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించింది.విజిలెన్ టీమ్ 8 బృందాలుగా విడిపోయి వరంగల్, కరీంనగర్,హైదరాబాద్, నల్గొండ, మహబూబాబాద్, పెద్దపల్లి, రంగారెడ్డి, వికారాబాద్, నారాయణపేట, సూర్యాపేట, కామారెడ్డి, నిజామాబాద్ మొత్తం 9 జిల్లాల్లో 19 రైస్ మిల్లులను తనిఖీ చేశారు. అందులో 14 మిల్లుల్లో భారీ ఎత్తున అక్రమాలు జరిగినట్లుగా గుర్తించారు.మిగిలిన 5 మిల్లులకు నోటీసులు జారీ చేసి అబ్జర్వేషన్‌లో పెట్టాఆరు. కాగా తనిఖీల్లో భాగంగా మొత్తం 1.90 లక్షల క్వింటాళ్ల ధాన్యం, 1.72 లక్షల బస్తాలు మాయం అయ్యాయని, దీంతో ప్రభుత్వ ఖజానాకు రూ. 60 కోట్లకు పైగా నష్టం వాటిల్లిందని విజిలెన్స్ అధికారులు లెక్కలు తేల్చారు. పెద్దపల్లి జిల్లాలోని జానకీరామ ఇండస్ట్రీస్ (పూసల గ్రామం) మిల్లును ఏకంగా సీజ్ చేశారు. జిల్లాల వారీగా అక్రమాల వివరాలు: కామారెడ్డి, నిజామాబాద్: సుమారు రూ.19.73 కోట్లు, సూర్యాపేట రూ.19.32 కోట్లు, నారాయణపేట రూ.15.91 కోట్ల విలువైన ధాన్యం అదృశ్యమైంది. తప్పు చేసిన మిల్లర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేసినట్లు అధికారులు పేర్కొన్నారు.

## మేడారం జాతర

>> జాతరపై మంగళవారం డాక్టర్ బిఆర్ అంబేడ్కర్ సచివాలయంలో ఉన్నత స్థాయి సమీక్షను నిర్వహించారు. సమావేశంలో రాష్ట్ర గిరిజన, ఎస్సి సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్షణ్ కుమార్, రాష్ట్ర పంచాయితీరాజ్, మహిళా, శిశు సంక్షేమ శాఖామంత్రి దనసరి అనసూయ సీతక్క పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె రామకృష్ణ రావు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు అరవింద్ కుమార్, సవ్యసాచి ఘోష్, అడిషనల్ డీజీలు విజయ్ కుమార్, స్వాతి లక్రాతోపాటు వివిధ శాఖల కార్యదర్శులు, ములుగు జిల్లా కలెక్టర్ దివాకర పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్షణ్ కుమార్ మాట్లాడుతూ, గత 2024 మేడారం జాతరకు కోటిన్నర మంది హాజరుకాగా, ఈసారి దాదాపు మూడు కోట్ల మంది భక్తులు హాజరవుతారని అంచనా వేస్తున్నామని, ఈసారి జాతరకు దాదాపు గతంలో ఎన్నడూ లేనివిధంగా రూ. 150 కోట్ల నిధులను మంజూరు చేసి విస్తృత ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. సమ్మక్క-సారలక్క జాతరను కుంభమేళాకు మించి అద్భుతంగా నిర్వహించి, రాష్ట్ర ప్రభుత్వానికి జాతీయ స్థాయిలో మంచి పేరు తీసుకురావాలని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అధికారులకు సూచించారు. మహాజాతరను విజయవంతంగా నిర్వహించడానికి ప్రతి అధికారి బాధ్యతగా తీసుకుని, ఏ చిన్న లోపం కూడా లేకుండా పకడ్బందీగా ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఈ జాతరకు రూ.150 కోట్లకుపైగా నిధులు కేటాయించి అత్యంత ప్రాధాన్యతనిస్తోందని తెలిపారు. ఈ నిధులతో మౌలిక వసతులు, భద్రత, రవాణా, పారిశుద్ధం, వైద్య సేవలు వంటి అన్ని విభాగాల్లో సమగ్ర ఏర్పాట్లు చేయనున్నట్లు చెప్పారు. జాతరకు వచ్చే భక్తులు సులభంగా గమ్యానికి చేరుకునేలా అన్ని ప్రధాన రహదారులు, అంతర్గత మార్గాల్లో స్పష్టమైన దిశా సూచిక బోర్డులు, బ్యానర్లు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. భక్తులు ఎలాంటి అయోమయానికి గురికాకుండా ట్రాఫిక్ నియంత్రణ పటిష్టంగా ఉండాలని, ప్రత్యేక రూట్ మ్యాప్‌లతో పాటు అవసరమైన చోట వన్‌వే వ్యవస్థ అమలు చేయాలని సూచించారు. ఈ జాతరపై క్యాబినెట్ మొత్తం ప్రత్యేక దృష్టి సారించిందని, మంత్రులందరూ సమన్వయంతో పనిచేస్తూ ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తున్నారని తెలిపారు. తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక, ఛత్తీస్‌గఢ్ సహా పలు రాష్ట్రాల నుంచి లక్షలాదిగా భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున, అందుకు అనుగుణంగా వసతి, పార్కింగ్, రవాణా సౌకర్యాలను విస్తృతంగా ఏర్పాటు చేయాలని తెలిపారు. రాష్ట్ర పంచాయితీ రాజ్, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క మాట్లాడుతూ, ఈసారి జాతర ఏర్పాట్లకు రూ. 150 కోట్లతో పాటు గద్దెల పునరుద్ధరణ పనులకు రూ. 101 కోట్లు మొత్తంగా రూ. 251 కోట్లను రాష్ట్ర ముఖ్యమంత్రి మంజూరు చేశారని వివరించారు. జాతరకు వచ్చే ప్రతీ భక్తులకు సాఫీగా దర్శనం లభించేలా ప్రాధాన్యత నిస్తున్నట్టు అన్నారు. జాతర సందర్భంగా గురు, శుక్ర వారాల్లోనే ప్రతి రోజు కనీసం 40 లక్షల మంది భక్తులు ఉంటారని, ఇందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేపట్టాలన్నారు.

## కరిస్తే రాష్ట్రాలదే బాధ్యత

>> చూపడం లేదని ప్రశ్నించింది. వీధి కుక్కల దాడిలో ఒక పిల్లవాడు చనిపోతే ఎవరు బాధ్యత వహిస్తారని నిలదీసింది. ఒక వేళ కుక్కలకు ఆహారం పెట్టేవారు కూడా దీనికి బాధ్యులని, అలాంటి వారు వాటిని తమ ఇళ్లకే తీసుకెళ్లాలని సూచించింది. విద్యాసంస్థలు, ఆసుపత్రుల వంటి చోట్ల నుంచి కుక్కలను తొలగించాలని ఆదేశించింది. వీధి కుక్కల అంశంపై సుప్రీంకోర్టు రోజువారీ విచారణ కొనసాగిస్తోంది. ఈ క్రమంలో మంగళవారం నాటి విచారణలో కీలక వ్యాఖ్యలు చేసింది. చిన్నారులు లేదా వృద్ధులపై కుక్కలు దాడి చేసి గాయపరిచినా లేదా ప్రాణాలు తీసినా రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని, అందుకు నష్టపరిహారం చెల్లించాలని సర్వోన్నత న్యాయస్థానం హెచ్చరించింది. అంతేకాదు, కుక్కలకు ఆహారం పెట్టేవారు కూడా బాధ్యులని, వాళ్లు తమ ఇళ్లకే తీసుకెళ్లాలని న్యాయమూర్తి జస్టిస్ విక్రమ్ నాథ్ అన్నారు. కుక్కల సమస్య ఒక భావోద్వేగమైన విషయమని లాయర్ మేనకా గురుస్వామి చేసిన వ్యాఖ్యలపై ధర్మాసనం స్పందిస్తూ "ఇప్పటివరకు భావోద్వేగాలు కుక్కలకే ఉన్నట్లున్నాయి" అని వ్యాఖ్యానించింది. అయితే, తాను కూడా మనుషుల గురించే ఆలోచిస్తున్నానని ఆమె బదులిచ్చారు. కుక్క కాటు ఘటనలు, మరణాలు సంభవిస్తే డాగ్ ఫీడర్లు కూడా బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. డాగ్ ఫీడర్లు దాఖలు చేసిన పిటిషన్‌ను ధర్మాసనం తిరస్కరిస్తూ, ఇది లా అండ్ ఆర్డర్‌కు సంబంధించిన అంశమని పేర్కొంది. బాధితులు అవసరమైతే హైకోర్టులను ఆశ్రయించి ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయాలని సూచించింది. కోర్టు ఉత్తర్వులు ఎవరి పట్లనూ వేధింపులకు లైసెన్స్ కాదని కూడా స్పష్టం చేసింది. ప్రభుత్వాల వైఫల్యం వల్లే.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది.

## అంగట్లో ఆడబిడ్డ!

>> ఆడపిల్ల పుట్టింది. దీనితో ఆడపిల్లను ఎలాగైనా వదిలించుకోవాలని నిర్ణయించుకున్నారు. ఆ చిన్నారికి ఖరీదు కట్టారు. కేశంపేట మండలం వేముల నర్వ గ్రామానికి చెందిన గోవిందు అనే వ్యక్తి ఆ పసికందును కొనుగోలు చేసేందుకు ముందుకు వచ్చాడు. రూ. మూడు లక్షలకు పాపను కొనుగోలు చేసినట్లు సమాచారం. అయితే ప్రతి నెల పిల్లల ఆరోగ్యాన్ని పరిశీలించేందుకు వెళ్లిన అంగన్వాడీ టీచర్ చింటు అసలు సంగతి గ్రహించి ఐసిడిఎస్ అధికారులకు సమాచారం అందించడంతో వారు పోలీసులను సంప్రదించారు. పట్టణ సీఐ విజయకుమార్ రంగంలోకి దిగి విచారణ చేయగా పసికందున విక్రయించిన మాట వాస్తవమేనని తేలింది. దీనితో గోవిందును అదుపులోకి తీసుకొని పసికందును స్వాధీనం చేసుకొని ఐసిడిఎస్ అధికారులకు అప్పగించారు. ఐసిడిఎస్ అధికారులు పసికందులు శిశు విహార్ కు తరలించారు. కేసు ఇంకా విచారణలో ఉందని, పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తామని సిఐ విజయ్ కుమార్ తెలిపారు.

## శవాల గుట్టలు!

>> నిఘా వర్గాలు గుర్తించాయి. ఈ నేపథ్యంలో ఖమేనీ దేశం నుంచి పారిపోయేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఇస్లామిక్ దేశాలు ఇరాన్‌కు అండగా నిలిచేందుకు విముఖత చూపుతున్నందున రష్యా వెళ్లేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే, రష్యాలో ఖమేనీ ప్రాణాలకు భద్రత ఎంత వరకు అనేది నిఘా వర్గాలు చెప్పలేకపోతున్నందున, సుప్రీం లీడర్ తర్జనభర్జన పడుతునననట్లు సమాచారం. అనివార్య పరిస్థితులు ఏర్పడితే, ప్రస్తుతానికి రష్యాకెళ్లి తల దాచుకోవడం మంచిదనే అభిప్రాయం నిఘా వర్గాలు వెల్లడించినట్లు తెలుస్తోంది. అటు అమెరికా తమ దేశ పౌరులకు అత్యవసర హెచ్చరిక జారీ చేసింది. తక్షణమే ఇరాన్ విడిచి వెళ్లాలని సూచించారు. మరోవైపు ఇరాన్‌పై సైనిక చర్య కోసం అమెరికా బలగాలు ఖతార్‌లోని అల్ ఉదీద్ మైమానిక స్థావరంలో తిష్ట వేశాయి. అధ్యక్షుడు ట్రంప్ ఆదేశం కోసం ఎదురుచూస్తున్నట్లు ఉందని అంతర్జాతీయ మీడియాలో కథనాలువెలువడుతున్నాయి. ఏక్షణమైనా అమెరికా బలగాలు ఇరాన్‌పై దాడి చేసే అవకాశముందని జర్మన్ చాన్సలర్ మెర్జ్ ఆందోళన వ్యక్తం చేశారు. అమెరికా తాజా హెచ్చరికల నేపథ్యంలో ఇరాన్ కూడా ప్రతీకార చర్య సిద్ధమవుతోంది. తాము యుద్ధం కోరుకోవడం లేదని, అలా అని తమపై దాడి చేస్తే చూస్తూ ఊరుకోమని టెహ్రాన్ ఘాటుగా స్పందించింది. అమెరికాతోపాటు, ఇజ్రాయెల్‌పై దాడులు చేస్తామని హెచ్చరించింది.

## వారం - వర్జ్యం

14-01-2026, బుధవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
పుష్యమాసం, దక్షిణాయణం
హేమంత ఋతువు, కృష్ణపక్షం,ఉత్తరాషాఢ కార్తె
ఏకాదశి సా.5.52
అనూరాధ రా.3.03
వర్జ్యం : ఉ.9.17-11.04
దు.ఉ.11.55-12.40
శుభసమయం: ఉ.9.45-10.45, సా.5.30-6.10
రాహుకాలం - మ.12.00-1.30

## వార్తాఫలం

**మేషం:** కోర్టు కేసులు పరిష్కారదశకు చేరుకుంటాయి. పనులలో జాప్యం జరిగినా చివరికి పూర్తిచేస్తారు.

**వృషభం:** కుటుంబసభ్యుల నుండి ప్రోత్సాహం లభిస్తుంది. క్రయవిక్రయాలలో లాభాలు పొందుతారు. ఆరోగ్యం పట్ల శ్రద్ధ అవసరం.

**మిథునం:** దూరప్రాంతాల నుండి వచ్చిన సమాచారం ఆనందం ఇస్తుంది. ఆర్థిక లావాదేవీలు నిరాశ కలిగిస్తాయి.

**కర్కాటకం :** బాధ్యతాయుతంగా వుంటారు. నూతన పెట్టుబడుల విషయాలలో తొందరపాటు వద్దు.సోదరుల కలయిక.

**సింహం:** దూరప్రయాణాలలో నూతన వ్యక్తుల పరిచయాలు ఏర్పడతాయి. ఆరోగ్య సమస్యలు ఎదురైన అధిగమిస్తారు.

**కన్య :** కుటుంబసభ్యుల నుండి ప్రోత్సాహం లభిస్తుంది. విదేశీయాన యత్నాలు ఫలిస్తాయి. క్రయ విక్రయాలలో లాభాలు.

**తుల :** వ్రాతపూర్వక ఒప్పందాలను అనుకున్న విధంగా చేసుకోగలుగుతారు. ప్రతిష్టను నిలబెట్టుకుంటారు.

**వృశ్చికం:** వివాహాది శుభకార్యాలు సానుకూలపడతాయి. ఉద్యోగాలలో బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తారు.

**ధనుస్సు:** ఒకే సమయంలో అనేకమైన పనులు చక్కబెట్టుకోవలసి వస్తుంది. పని విభజనను చేస్తారు.

**మకరం:** సన్నిహిత వర్గం అందుబాటులో ఉండటం వలన పెద్దగా ఇబ్బంది పడరు. డాంబికానికి, దర్పానికి ప్రాముఖ్యత నిస్తారు.

**కుంభం:** గతంలో పొదుపుచేసిన ధనాన్ని ఈ రోజు ఒక శుభకార్య నిమిత్తం ఖర్చు చేస్తారు. పోటీ పరీక్షలలో విజయం.

**మీనం :** నూతన ఆదాయ మార్గాలను అన్వేషిస్తారు. మీ పరపతిని పెంచుకోవడానికి చేసే యత్నాలు ఫలించవు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# బిసిలకు రిజర్వేషన్లు 34 శాతం పైనే!

>> కొత్తగూడెంలో అత్యల్పంగా 1,34,774 మంది ఓటర్లు ఉన్నారు. ఆదిలాబాద్ మున్సిపాలిటీలో అత్యధికంగా 1,43,655 మంది ఓటర్లు ఉండగా, అమరచింత మున్సిపాలిటీలో అత్యల్పంగా 9,147 మంది ఓటర్లు ఉన్నారు. మున్సిపాలిటీలు,కార్పొరేషన్లలో మొత్తం 2,996 వార్డులు ఉన్నాయి. 123 మున్సిపాలిటీల్లో 113 చోట్ల మహిళా ఓటర్ల సంఖ్య ఎక్కువగా ఉండటం గమనార్హం. కాగా, అధికారికంగా రిజర్వేషన్లు ఖరారైన తర్వాత పట్టణ స్థానికసంస్థల ఎన్నికల కోసం పురపాలక శాఖ నోటిఫికేషన్ విడుదల చేయనుంది. మేడారంలో జరుగుతున్న సమ్మక్క సారలమ్మ జాతర ఏర్పాట్లను రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క పరిశీలించారు. జాతర పనులు తుది దశకు చేరుకున్నాయని ఆమె వెల్లడించారు. ఆ తల్లుల దర్శనం కోసం అన్నివర్గాల ప్రజలు ఈ జాతరకు తరలివస్తారన్నారు. దాదాపు రెండు కోట్ల మంది భక్తులు వస్తారని అంచనా వేస్తున్నామని సీతక్క చెప్పారు. ఈ నేపథ్యంలో అన్ని శాఖల సమన్వయంతో పని చేస్తున్నామని వివరించారు. మేడారం భక్తులకు ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోందన్నారు.ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖలు ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. సీఎం రేవంత్ రెడ్డికి.. సమ్మక్క సారలమ్మ తల్లులతో ఎంతో భావోద్వేగ బంధం ఉందని గుర్తుచేశారు. అందుకే రూ.260 కోట్లతో మేడారం అభివృద్ధి పనులు చేపట్టారని చెప్పుకొచ్చారు. జనవరి 18న మేడారంలో దేవాలయాన్ని ప్రారంభించేందుకు సీఎం విచ్చేయనున్నారని తెలిపారు. ఇక్కడే కేబినెట్ సమావేశం సైతం ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. అంటే.. ఆ రోజు రాష్ట్ర ప్రభుత్వమే మేడారంనకు తరలి వస్తుందన్నారు. మేడారం వచ్చే భక్తులకు త్వరితగతిన అమ్మవార్ల దర్శనం జరిగేలా చర్యలు తీసుకోవాలని దేవాలయ అధికారులను ఆదేశించారు సీతక్క. కనీసం మూడు రోజుల పాటు సంప్రదాయ భక్తులు మేడారంలోనే బస చేస్తారని వివరించారు. అందుకు వారికి అవసరమైన వసతులను కల్పించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. రవాణా, తాగునీరు, శానిటేషన్ సమస్యలు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారామె.

అలాగే.. ట్రాఫిక్ సమస్యలు లేకుండా చర్యలు చేపట్టాలని పోలీసులకు స్పష్టం చేశారు మంత్రి. సామాన్య భక్తులు ఆర్టీసీ బస్సుల్లో తరలివస్తారని.. ఈ మార్గంలో నడిచే బస్సుల పర్యవేక్షణ ఉండాలని ఆర్టీసీ సంస్థ ఉన్నతాధికారులకు సూచించారు. సమ్మక్క సారలమ్మ మహా మేడారం జాతరను దృష్టిలో ఉంచుకుని ముందస్తుగానే అన్ని చర్యలు పూర్తి చేశామని మంత్రి సీతక్క వివరించారు. కాగా, 18న ఉదయం ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పలు అభివృద్ధి పనులకు సీఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపనలు చేస్తారు. అక్కడే కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో పాల్గొంటారు. అనంతరం సీపీఐ వంద సంవత్సరాల వేడుకలకు సీఎం హాజరవుతారు. అదే రోజున సాయంత్రానికి ముఖ్యమంత్రి సహా మంత్రివర్గం మేడారం చేరుకుంటారు. ఆపై 5 గంటల తర్వాత కేబినెట్ సమావేశమయ్యే అవకాశాలున్నాయి. ఈ సమావేశంలో మున్సిపల్ ఎన్నికల నిర్వహణపై తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.



సికింద్రాబాద్ పెరేడ్ గ్రౌండ్స్‌లో కైట్ ఫెస్టివల్‌లో కళాకారులతో మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్

## ఆకాశ వీధిలో.. పొంగల్ పతంగ్‌లు

>> పురస్కరించుకొని మంగళవారం సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన పతంగుల,మిఠాయిల పండుగ వేడుకలను రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలను ప్రపంచ నలుమూలల్లో చాటి చెప్పేందుకు ప్రజా ప్రభుత్వం చేపడుతున్న విభిన్నమైన కార్యక్రమాలను చేపడుతుందన్నారు. దశాబ్దాల చరిత్ర కలిగిన పతంగుల పండుగ మన సంస్కృతి సాంప్రదాయాల సంరక్షణ కోసం ప్రభుత్వం ఇలాంటి ఉత్సవాలు నిర్వహిస్తుందన్నారు. ఈ వేడుకల్లో వివిధ దేశాలు,రాష్ట్రాల నుంచి పతంగులను ఎగరవేస్తూ అకాశాన్ని మురిపిస్తున్నాయని తెలిపారు. తన చిన్నతనంలో పతంగులు ఎగరవేసిన మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. గాలి పటాల తయారీని హైదరాబాద్‌లోనే పెద్ద ఎత్తున ప్రోత్సహించడం ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు పెంచే యత్నం చేస్తున్నామన్నారు. పర్యాటక రంగం అభివృద్ధి ద్వారా రాష్ట్ర ఆదాయాన్ని పెంచడంతో పాటు నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తున్నామన్నారు. ప్రజలు కనీసం నెలకు రెండు రోజులైనా పర్యాటక ప్రదేశాలను సందర్శించాలన్నారు. దీని వల్ల మానసిక ఉల్లాసంతో పాటు కళాకారులకు,వ్యాపారులకు ఆర్థికంగా చేయూత లభిస్తుందన్నారు. మూడు రోజుల పాటు జరిగే ఈ ఫెస్టివల్‌ను ప్రజలంతా పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి, పర్యాటక శాఖ మేనేజింగ్ డైరెక్టర్ క్రాంతి వల్లూరి, బాష సంస్కృతిక శాఖ డైరెక్టర్ ఏనుగు నర్సింహ్మారెడ్డి, హెరిటేజ్ డైరెక్టర్ అర్జున్ రావ్,కైట్ ఫెస్టివల్ కన్సల్టెంట్ పవన్ డి సోలంకి, క్లిక్ ప్రతినిధులు లింబీ బెంజిమన్,పరమానంద శర్మ, అభిజిత్ తదితరులు పాల్గొన్నారు. ఈ ఫెస్టివల్‌లో తెలంగాణ సాంప్రదాయ పిండి వంటలతో పాటు దేశి విదేశీ మిఠాయిలను 60ప్రత్యే స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. దేశంలోని 15 రాష్ట్రాలకు చెందిన 55 కైట్ క్లబ్‌ల ప్రతినిధులు పాల్గొన్నారు. అదే విధంగా ఈ నెల 16 నుంచి 18 తేదీ వరకు హాట్‌ఎయిర్ బెలూన్ ఫెస్టివల్ వేడుకలు ఉంటాయన్నారు.

## బిఎస్‌సి (అగ్రికల్చర్) మాస్ కాపీయింగ్ కేసు..

### 35 మంది విఎఒలతో పాటు వర్సిటీ అధికారుల అరెస్టుకు రంగం సిద్ధం

**హైదరాబాద్, జనవరి 13, ప్రభాతవార్త:** రాష్ట్ర వ్యవసాయ కళాశాలలో ఇన్ సర్వీస్ విద్యార్థులుగా చేరి మూడవ సంవత్సరం చదువుతున్న వ్యవసా య శాఖ అధికారుల (విఎఓలు) మాస్ కాపీయింగ్ వ్యవహారం కీలక మలుపు తిరిగింది. వరంగల్, జగిత్యాల సహా పలుచోట్ల ఇటీవల జరిగిన ఈ పరీక్షల్లో విఎఓలు ముందుగానే వ్యవసాయ కాలేజి అధికారులు, సిబ్బంది సహకారంతో వాట్సాప్ ద్వారా ప్రశ్నలు తెప్పించుకుని, ఆర్టిఫిషియల్ పెన్ ల సహాయంతో వీరంతా పరీక్షలు రాయడం తెలిసిందే. ఈ విషయాన్ని వర్శిటీ జానయ్య అంతర్గత తనిఖీలో పట్టుకుని అధికారులతో పాటు కాపీ యింగ్‌కు పాల్పడ్డ 35 మంది విఎఓలను సస్పెండ్ చేయడం విదితమే. వీరంతా ఇన్ సర్వీస్ విద్యార్థులుగా చేరి అక్రమాలకు పాల్పడడాన్ని వ్యవ సాయ శాఖ కూడా తీవ్రంగా పరిగణించి విధుల నుంచి సస్పెండ్ చేసింది. మరోవైపు ఈ వ్యవహారంపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని వర్శిటీ రిజిస్ట్రార్ డిజిపి శివధర్ రెడ్డిని కలిసి విజ్ఞప్తి చేశారు. దీనిపై సిఐడి విచారణకు ఆదేశిస్తామని డిజిపి హామీ ఇచ్చారు.

## సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపిన సిఎం రేవంత్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జనవరి13:** తెలుగు ప్రజలందరికీ ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. భోగ భాగ్యాలను అందించే భోగి.. కొత్త కాంతులు తెచ్చే సంక్రాంతి.. కనుమ పండుగలను అందరూ ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి పథకాలన్నీ రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి చేరాలనేది తమ సంకల్పమని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. వ్యవసాయంతో పాటు పరిశ్రమలు, ఉత్పత్తులు, సేవల రంగంలో తెలంగాణ రాష్ట్రం తిరుగులేని పురోగతి సాధిస్తుందనే నమ్మకం తనకుందని అన్నారు. తెలంగాణ రైజింగ్-2047 విజన్ సాకారం చేసేందుకు ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ప్రజలందరూ సంతోషంగా తెలుగు సంప్రదాయం ఉట్టిపడేలా సంక్రాంతి పండుగ సంబురాలు జరుపుకోవాలన్నారు. పతంగులు ఎగరవేసేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

## రాష్ట్ర ప్రజలకు సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలిపిన కెసిఆర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జనవరి13:** రాష్ట్ర ప్రజలకు మాజీ ముఖ్యమంత్రి, బిఆర్ఎస్ అధినేత కేసీఆర్ సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలిపారు.భోగి, మకర సంక్రాంతి, కనుమ పర్వదినాలతో, మూడు రోజులపాటు సంక్రాంతి వైభవం కొనసాగుతుందని అన్నారు. ఈసందర్భంగా పల్లెలన్నీ రంగవల్లులు, గొబ్బెమ్మలతో నిండి ప్రకృతి రమణీయతను సంతరించుకుంటాయని కేసీఆర్ తెలిపారు. సంక్రాంతి శోభతో రాష్ట్రవ్యాప్తంగా సంతోషాలు వెల్లివిరుస్తాయని అన్నారు. దక్షిణం నుంచి ఉత్తరాయనానికి సూర్యుడు ప్రవేశించే మకర సంక్రాంతి పర్వదినం, హిందూ శాస్త్ర పురాణాల్లో ప్రత్యేకతను సంతరించుకున్నదని కేసీఆర్ తెలిపారు.పదేండ్ల బిఆర్ఎస్ పాలనలో జరిగిన వ్యవసాయాభివృద్ధిని ఈ సందర్భంగా స్మరించుకున్న కేసీఆర్ వ్యవసాయరంగం, రైతాంగ సంక్షేమం తిరిగి గాడినపడి,తెలంగాణ సుభిక్షంగా వర్ధిల్లాలని ఆకాంక్షించారు.

## సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలిపిన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జనవరి13:** సంక్రాంతి పండుగల సందర్భంగా రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. భోగ భాగ్యాలను అందించే భోగి, కొత్త కాంతులు తెచ్చే సంక్రాంతి, కనుమ పండుగలను అందరూ ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. తెలంగాణలోని ప్రతి కుటుంబం ప్రేమ అభిమానంతో పండుగ జరుపుకుని ప్రజలు సుఖ సంతోషాలతో,ఆయు ఆరోగ్యాలతో ఉండాలని ఆయన కోరారు.

# కోళ్లా! కోట్లా?

>> ఉండే వ్యవహారం కావడంతో.. ఆన్ లైన్ పేమెంట్లు కూడా అదే స్థాయిలో జరుగుతాయి. పండగ అయిపోయిన తర్వాత కానీ తెలియదు.. ఎంత వచ్చింది? ఎంత పోయింది? అనేది! సంక్రాంతి అయిపోయిన 3 రోజుల తర్వాత దిగుతుంది కోళ్ల పందాల మత్తు పందెం గాళ్ళకు,మిగిలిందో మోదం,లేదో ఖేదం. ఈ పండుగకు అన్నీ కలిపి రూ.3 వేల కోట్ల నుంచి రూ.5 వేల కోట్ల ఆదాయం సమకూరుతుందని చెప్పవచ్చు. ఈ ఆదాయంలో ప్రధాన భాగం కోడిపందాలతో పాటు మద్యం విక్రయాలు సింహభాగం ఉంటాయి. కోళ్లపందాల్లో కోట్లు కోట్లు ఏపీలోని రాయలసీమ మినహా మిగతా కోస్తాంధ్ర ప్రాంతంలో సంక్రాంతి పండుగ ఆనందోత్సాహాల మధ్య జరుగుతుంది.

సంక్రాంతి పండుగకు కోడిపందాల సందడి ఏ రేంజిలో ఉంటుందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ముఖ్యంగా, ఉభయగోదావరి, కోనసీమ, కాకినాడ, కృష్ణా జిల్లా ప్రాంతాల్లో కోడిపందాల బరుల్లో కోట్లాది రూపాయలు చేతులు మారతాయన్నది అందరికీ తెలిసిందే. దాదాపు అన్ని చోట్ల కోడిపుంజులకు కత్తులు కట్టి పందాలు వేస్తుంటారు. కొన్ని చోట్ల డింకీ పందాలు (కత్తులు లేకుండా) నిర్వహిస్తున్నారు. కాకినాడ జిల్లా కరప మండలంలోనూ భారీ ఎత్తున కోడిపందాల బరులు ఏర్పాటు చేశారు. ఓ కోడిపందెం బరిలో నిర్వాహకులు బంపర్ ఆఫర్ ప్రకటించారు. విజేతలకు మహీంద్రా థార్ వాహనం బహుమతిగా ఇస్తామని తెలిపారు. అంతేకాదు, కోడిపందెం బరి వద్దే మహీంద్రా థార్ వాహనాన్ని ప్రదర్శిస్తూ, కోడిపందెం రాయుళ్లను ఊరిస్తున్నారు. ఈ వాహనం ఖరీదు రూ.25 లక్షల వరకు ఉంటుందని తెలుస్తోంది. దీనికి సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. కోడి పందాలంటే.. బరిలో రెండు పుంజులు పోట్లాడటం కాదు. వేల కోట్లు చేతులు మారడం కూడా! ఎస్.. కొబ్బరి తోటల్లో జరిగే ఈ కోళ్ల యుద్ధాన్ని చూసి.. జబ్బులు, తొడలు చరుచుకునే పందెంరాయుళ్లు ఎందరో ఉన్నారు. గల్లా పెట్టెల్లోని.. నోట్ల కట్టలు.. కట్టలు తెంచుకొని బరుల్లోకి వచ్చేస్తాయి. కత్తి కట్టిన కోడి.. అవతలి పుంజును పడగొట్టిన ప్రతిసారీ.. పందెంరాయుళ్ల చేతులు మీసాల్ని మెలేస్తాయి. ప్రతి పందెం రౌండ్‌కి.. నోట్లు వర్షంలా కురుస్తాయి.

**నిజానికి పందెం కోళ్ళకు కత్తులు కట్టకూడదు.అయినా బరుల్లో అ నిబంధన ఆచరించారు..**

బరిలో దిగాక కోడి తేడా కొడితే.. జీవితాలే తారుమారైపోతాయి. దెబ్బకు అదృష్ట రేఖ.. దురదృష్టరేఖగా మారిపోతుంది. ఇవన్నీ తెలిసే.. పందెంరాయుళ్లు తొడగట్టి మరీ కొబ్బరితోటల్లోకి వెళ్తారు. తమ పుంజుని బరిలోకి దించుతారు. కొందరైతే.. ఆస్తుల్ని అమ్ముకొని మరీ పందాలు కాస్తారు. మెడలో పులి గోరు చైన్లు, వేళ్ల నిండా ఉంగరాలు, చేతులకు బ్రాస్‌లెట్లతో వచ్చినోళ్లు కూడా.. చివరికి ఒట్టి చేతులతో వెనుదిరుగుతారు. అయినాసరే.. సంక్రాంతి కోడి పందాలకు ఉండే క్రేజే వేరు. ఆంధ్రాలో అదో సంప్రదాయం. అంతకుమించిన సంబరం. అందుకే.. సంక్రాంతి సమయానికి.. అంతా ఊళ్లలో వాలిపోతారు. పందెం బరుల్లో దిగిపోతారు.

ఆంధ్రాలో సంక్రాంతి కోడి పందాల్లో పాల్గొనడం.. అంత చిన్న విషయం ఏమీ కాదు. జేబులో వందో వెయ్యో పెట్టుకొని వెళితే.. అక్కడ పందెం కోడి కాదు కదా.. పందాలు చూస్తూ తినేందుకు చికెన్ పకోడీ కూడా రాదు. పందెంలో పుంజుని దించాలంటే.. ఏకంగా డబ్బు సంచులే తీసుకెళ్లాలి. బరుల్ని ఏర్పాటు చేసే చోటుని బట్టి.. పందెం బీటు మారుతుంటుంది. ఒక్కో కోడి పందెం 5 వేల నుంచి మొదలై.. 5 లక్షలు, 10 లక్షల దాకా ఉంటుంది. కేవలం.. ఆంధ్రా వాళ్లే కాదు.. హైదరాబాద్, చెన్నై నుంచి కూడా పందెం రాయుళ్లు డబ్బు సంచులతో వచ్చి మరీ బరుల్లో తొడగొడతారు. వాళ్లకు తగ్గట్లుగా.. అదృష్టం కలిసొచ్చి.. వాళ్ల పుంజు కూడా బరిలో తొడగొడితే.. మరో 2, 3 డబ్బు సంచులతో ఊరెళ్తారు. లేకపోతే.. తెచ్చింది కూడా పోగొట్టుకొని.. వట్టి చేతులతో వెనుదిరుగుతారు.గతంలో. ఏపీలో కోడి పందాలంటే..రూ. వేలు, లక్షల్లోనే జరిగేవి. ఇప్పుడు లక్షల్లో పందెం కాయడం సాధారణంగా మారింది.. కొన్ని చోట్ల.. అరుదైన పుంజులపై రూ.కోటి పై పందెం కూడా నడుస్తోంది. ఈ స్థాయిలో పందాలు నిర్వహిస్తున్నారు.దీంతో . రూ.వేల కోట్లు చేతులు మారుతున్నాయ్. ఇదంతా.. గోదావరి జిల్లాలతో పాటు కృష్ణా, గుంటూరు జిల్లాల్లో కోడి పందాలపై దాదాపు 3 వేల కోట్లకు పైనే చేతులు మారతాయనే లెక్కలున్నాయ్. ఈసారి.. ఆ బెట్టింగ్‌లు 6 వేల కోట్ల దాకా వెళ్లొచ్చనే అంచనాలున్నాయి.

కొన్ని క్షణాల్లోనే తేలిపోయే కోడి పందాల కోసం.. కోట్లు తగలేయడమేంటి? వేల కోట్ల పందాలు కాయడమేంటనే వాదనలు వినిపిస్తుండొచ్చు. కానీ.. అక్కడ సీన్ మరోలా ఉంటుంది. కోడి పందాల్లో పాల్గొనడం దగ్గర్నుంచి.. పందెంలో పుంజుని గెలిపించుకోవడం దాకా.. ప్రతి సీన్ ప్రతిష్ఠాత్మకమే. అందుకే.. లక్షలు, కోట్లలోకి వెళ్లిపోతాయ్ పందాలు. చివరికి.విదేశాల్లో సెటిలైనోళ్లు కూడా సంక్రాంతికి సొంతూళ్లకు వచ్చి పందాలు కాస్తుంటారంటే.. పరిస్థితులు ఏ స్థాయిలో ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. కేవలం కొన్ని నిమిషాల్లోనే.. లక్షలు ఆవిరైపోతున్నా అస్సలు తగ్గరు. బ్యాంక్ బ్యాలెన్స్ ఖాళీ అయ్యే దాకా.. బరి నుంచి కదలరు.

**ఏపీలో కోళ్ల పందాల కోసం భారీ స్థాయిలో బరులు**

పందెం కోళ్లు కూడా సంక్రాంతి సమరానికి సై అంటే సై అంటున్నాయి. వేల కోట్ల రూపాయలు.. చేతులు మారేందుకు రెడీగా ఉన్నాయి. ఈసారి ఒక్కో జిల్లాలో కనీసం 600 కోట్లకు పైనే పందాలు జరుగుతాయనే అంచనాలున్నాయి. ఇంతకుముందుతో పోలిస్తే.. ఈసారి కోడి పందాలు జోరుగా సాగే అవకాశం ఉందంటున్నారు.

సంక్రాంతికి వారం ముందు నుంచే.. కోడి పందాల హడావుడి మొదలైపోతుంది. భోగి, సంక్రాంతి, కనుమ రోజుల్లో కోడి పందాల హీట్ పీక్‌కు చేరుతుంది. వందల కోట్ల రూపాయలు చేతులు మారేది కూడా ఈ 3 రోజుల్లోనే. పండగ రోజుల్లో.. ఒక్కో బరి దగ్గర ఏర్పాట్లకే దాదాపుగా 30 లక్షల దాకా ఖర్చవుతుంది. అంటే.. అక్కడ ఏ స్థాయిలో పందాలు నిర్వహిస్తారో లెక్కేసుకోవచ్చు. ఈ ఖర్చుని కూడా పందెం రాయుళ్ల నుంచే వసూలు చేస్తారు నిర్వాహకులు. ఒక్కో పందెం నుంచి పది పర్సెంట్ కమీషన్ తీసుకుంటారు.ఏపీలో కోడి పందాల వెనుక పెద్ద ఆర్థిక వ్యవస్థే నడుస్తుంది. కోళ్ల పెంపకం నుంచి మొదలుకొని వాటికి ట్రైనింగ్, ఫుడ్, బరుల ఏర్పాటు.. ఇలా ఈ పందాల చుట్టూ జరిగే వ్యాపారం అంతా కలిపి.. వేల కోట్లు దాటుతోంది. కేవలం.. ఆంధ్రా ప్రజలే కాదు.. ఎక్కడెక్కడి నుంచో వచ్చే వాళ్లతో పందెం బరులన్నీ సందడి సందడిగా మారతాయి. హోటల్ రూమ్స్ కూడా కొన్ని నెలల ముందు నుంచే బుక్ అయిపోతాయి. కోడి పందాల బరుల చుట్టూ.. జాతర వాతావరణం ఉంటుంది. ఈ ప్రదేశాల్లో ఫుడ్ బిజినెస్‌కు కూడా ఫుల్ డిమాండ్ ఉంటుంది. ఇలా.. ఆంధ్రాలో ఒక్క సంక్రాంతి సీజన్‌లోనే.. కోళ్ల పందాల రూపంలో వేల కోట్ల రూపాయలు చేతులు మారిపోతాయి.కోడి పందేలకు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో బరులు సిద్ధమైపోయాయి. ఇతర జిల్లాలతో పాటు పక్క రాష్ట్రాల నుంచి పందేలను చూసేందుకు వచ్చే అతిథులకు అసౌకర్యం కలగకుండా భారీ హంగులతో ఏర్పాట్లు చేశారు. గత ఏడాది దెందులూరు నియోజకవర్గంలో అంతర్జాతీయస్థాయి కుస్తీ పోటీలు నిర్వహించే వేదికలా కోడి పందేల బరిని సిద్ధం చేయగా, ఈసారి నూజివీడు వాసులు సైతం తామేమీ తక్కువ కాదన్నట్లు అదే తరహాలో భారీ బరిని ఏర్పాటు చేశారు.




## 'కాల్ ఫర్ బ్లడ్' వెబ్‌యాప్‌ను ప్రారంభించిన డిజిపి శివధర్‌రెడ్డి

**హైదరాబాద్, జనవరి 13, ప్రభాతవార్త:** రక్తం అవసరమైన వారికి వెంటనే దాతలను అందుబాటులోకి తెచ్చే ఉద్దేశంతో రూపొందించిన కాల్ ఫర్ బ్లడ్ ఫౌండేషన్ వెబ్ అప్లికేషన్‌ను డిజిపి శివధర్ రెడ్డి మంగళవారం నాడు ప్రారంభించారు. లక్డీకాపూల్‌లోని తన కార్యాలయంలో జరిగిన ఓ కార్యక్రమంలో డిజిపి దీనికి సంబంధించిన వెబ్ యాప్‌ను ప్రారంభించడంతో పాటు పలు అంశాలపై మాట్లాడారు. రక్తం అవసరమయ్యే వారికి ఆ సమయంలో దాతలను గుర్తించే సాంకేతిక సహాయం ఈ యాప్‌లో అందుబాటులో వుంటాయని డిజిపి తెలిపారు. రక్త దాతల వివరాలు గోప్యంగా వుండే విధంగా ఆధునిక సాంకేతికతతో దీనిని రూపొందించారని ఆయన తెలిపారు.

ఒకసారి రక్తదానం చేసిన వారి పేర్లు నిర్ణీత కాలం వరకు మళ్లీ ఇందులో కనిపించకుండా ఏర్పాటు చేశారని ఆయన తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో రక్తం కావలసిన వారికి ఈ యాప్ ఎంతగానో ఉపయోగపడు తుందని డిజిపి తెలిపారు. కాల్ ఫర్ బ్లడ్ ఫౌండేషన్ తీసుకువచ్చిన ఈ యాప్ రక్తం అవసరమయ్యే వారికి ఎంతగానో సహాయ పడుతుందని ఆయ న తెలిపారు. అందరి మంచి కోసం ఏర్పాటైన ఈ ఫౌండేషన్‌ను డిజిపి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ వ్యవస్థాపకుడు చింతల సం పత్‌తో పాటు ఇతర సభ్యులు పాల్గొన్నారు.

## బాధ్యత లేకుండా భావప్రకటన స్వేచ్ఛ వినియోగించరాదు

### మహిళాఅధికారుల పట్ల అసభ్యంగా రాయడం, కూయడం గర్హనీయం

### సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 13:** రాజ్యాంగం హామీ ఇచ్చిన భావ ప్రకటన స్వేచ్ఛ అత్యంత విలువైనదని, సమాజానికి ప్రాణవాయువు లాంటిదని సుప్రీం కోర్టు విశ్రాంత న్యాయమూర్తి, రిటైర్డ్ లోకాయుక్తా (గోవా) జస్టిస్ బి సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు. అయితే రాజ్యాంగం పరిమితుల్లేని స్వేచ్ఛకు హామీనివ్వలేదని తెలిపారు. ఇటీవల ఓ ఐఎఎస్ అధికారిణి వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగించేలా ప్రసారం చేసిన కథనాలను సుదర్శన్ రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో ఖండిరచారు. సోషల్ మీడియా అయినా సరే, ప్రధాన స్రవంతిలోని మీడియా అయినా సరే.. ప్రచార సాధనాలు ఏవైనా, బాధ్యత లేకుండా భావ ప్రకటన స్వేచ్ఛను వినియోగిస్తే నియంత్రణ కూడా అదే స్థాయిలో ప్రతిస్పందిస్తుందని, ఇది కూడా అత్యంత ప్రమాదకరమని పేర్కొన్నారు. స్వీయ నియంత్రణ, సమాజం పట్ల బాధ్యతగా ప్రవర్తించడం చేతగాకపోతే మీ భావ ప్రకటనా స్వేచ్ఛను మరొకరు నియంత్రించకుండా మీకు మీరే ఆ బాధ్యతల నుంచి తప్పుకుంటే మంచిదని సూచించారు. తమ బాధ్యతను అత్యంత సమర్థవంతంగా నిర్వహించేటువంటి యువ అధికారిణిల పట్ల అసభ్యంగా, బాధ్యతా రహితంగా భావ ప్రకటన స్వేచ్ఛ పేరుతో అమర్యాదగా, వారి వ్యక్తిత్వాన్ని దెబ్బతీసేవిధంగా రాయడం, కూయడం అత్యంత గర్హనీయమని, పురుషాధిక్యత భావజాలంతో కూడిన ప్రమాదకరమైన దుశ్చర్య అని తన ప్రకటనలో తప్పుబట్టారు.

## దావోస్‌లో 'తెలంగాణ రైజింగ్' ప్రత్యేక కార్యక్రమం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 13:** ప్రపంచంలోని ప్రముఖ కంపెనీల సీఈఓలు, ప్రతినిధులకు తెలంగాణ రైజింగ్ దార్శనికతను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చాటి చెప్పనున్నారు. జనవరి 20న ఈ కార్యక్రమంలో తెలంగాణ లైఫ్ సైన్సెస్ పాలసీ, తెలంగాణ ఏఐ హబ్ ను తెలంగాణ రైజింగ్ బృందం ఆవిష్కరించనుంది. డిసెంబర్లో తెలంగాణ రైజింగ్2047 విజన్ డాక్యుమెంట్ ఆవిష్కరణ, గ్లోబల్ సమ్మిట్ వేదికగా భారీ స్థాయిలో పెట్టుబడులు ఆకర్షించిన నేపథ్యంలో.. ఈ నెల 19-23వ తేదీల్లో జరిగే డబ్ల్యుఈఎఫ్-2026లో భాగంగా తెలంగాణ రైజింగ్ దార్శనికత, (క్యూర్, ప్యూర్, రేర్), రాష్ట్రంలో పెట్టుబడులకు అత్యంత అనుకూలమైన వాతావరణం అని సిఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ముఖ్యంగా ఐటీ, లైఫ్ సైన్సెస్,రిన్యూవబుల్ ఎనర్జీ, తయారీ రంగాలలో పెట్టుబడులకు మంచి వాతావరణం ఉందని చాటి చెప్పడానికి దావోస్‌లో నిర్వహించిబోయే ఈ కార్యక్రమం ఓ వేదిక కానుంది. ప్రభుత్వం చేపట్టిన భారత్ ఫ్యూచర్ సిటీ, మూసీ ప్రక్షాళన, డ్రై పోర్ట్, బుల్లెట్ ట్రైన్, హైదరాబాద్‌కు భారీగా జిసిసిల రాక.. వంటి అంశాలను ఈ కార్యక్రమం ద్వారా ప్రపంచ స్థాయిలో వివరించనున్నారు. తెలంగాణలో వేగవంతమైన జిఎస్‌డిపి వృద్ధి, పారిశ్రామిక విధానాలు, బలమైన మౌలిక సదుపాయాల గురించి, ముఖ్యంగా తెలంగాణ రైజింగ్ దార్శనికత-2047 ద్వారా వచ్చే రెండు దశాబ్దాల కోసం రచించిన అభివృద్ధి ప్రణాళికలను పరిచయం చేయడాని కోసం ఒక ప్రత్యేక కార్యక్రమం నిర్వహించాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.

### నారాయణ్‌పేట్, సిసిఎస్‌లో నమోదైన కేసులపై

## సజ్జనార్ నేతృత్వంలో సిట్ ఏర్పాటు

**హైదరాబాద్, జనవరి 12, ప్రభాతవార్త:** నారాయణ్‌పేట్‌లోని మద్దూరుతో పాటు సిసిఎస్‌లో నమోదైన రెండు కేసులపై సిటీ కొత్వాల్ సజ్జన్నార్ నేతృత్వంలో ఎనిమిది మంది సభ్యులతో కూడిన సిట్ ఏర్పాటయ్యింది. ఈ మేరకు సర్కారు మంగళవారం ఆదేశాలు జారీ చేసింది. సిఎం రేవంత్ రెడ్డి ఫోటోలను అసభ్యకరంగా పోస్ట్ చేసిన వ్యవహారంలో పబ్లిక్ టివి వాట్సాప్ గ్రూప్ నిర్వాహకుడు కావలి వెంకటేష్‌పై మద్దూర్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదయ్యింది. కాంగ్రెస్ నేత గూళ్ల నరసింహ ఇచ్చిన ఫిర్యాదుపై ఈ నెల 11వ తేదీన ఈ కేసు నమోదయ్యింది. తాజాగా మహిళా ఐఎఎస్ అధికా రిని కించపరిచే వార్తలు ప్రసారం చేసిన వ్యవహారంపై రెండు న్యూస్ చాళ్లతో పాటు 7 యూట్యూబ్ చానళ్లపై సిటీ సిసిఎస్‌లో కేసు నమోదైంది. భారతీయ న్యాయ సంహిత సెక్షన్లు 75, 78, 79 (వేధింపులు, మహిళల గౌరవానికి భంగం కలిగించడం), 351 (1), 352 (2) (శాంతి భ ద్రతలకు విఘాతం కలిగించేలా అవమానించడం) కింద కేసు నమోదు చేశారు. ఈ రెండు ఘటనలపై సమగ్ర విచారణకు సర్కారు సిట్‌ను ఏర్పాటు చేసింది. సిట్‌కు సజ్జన్నార్ నేతృత్వం వహించనుండగా ఇందులో సిటీ పోలీసు విభాగంలోని ఉత్తర రేంజి జాయింట్ సిపి శ్వేత, చేవెళ్ల డిసిపి యోగే ష్ గౌతం. సిటీ పరిపాలనా విభాగం డిసిపి వెంకటలక్ష్మి, సైబర్ క్రైం డిసిపి అరవింద్‌బాబు, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అదనపు ఎస్పీ ప్రతాప్ కుమార్, సిసిఎస్ ఎసిపి గురు రాఘవేంద్ర, సిఐ సెల్ ఇన్‌స్పెక్టర్ శంకర్ రెడ్డి, షీ సైబర్ సెల్ ఎస్ఐ హరీష్‌లు సభ్యులుగా వున్నారు.

# చలాన్లతో బ్యాంకు అకౌంట్లకు లింకా?

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 13:** వాహనాల ట్రాఫిక్ చాలాన్ల రుసుంను సదరు వ్యక్తుల బ్యాంకు అకౌంట్ల నుంచి నేరుగా విత్‌డ్రా అయ్యేలా యాప్ రూపొందించడం పట్ల బిజెపి అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు తీవ్ర అభ్యం తరం తెలిపారు. బ్యాంకు ఖాతాలు వారి వ్యక్తిగత మైనవని, బహిరంగ పరచరాదని అన్నారు. ఈ విధానం వల్ల లేనిపోని సమస్యలు వస్తాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఆర్థికపరమైన మోసాలను అరికట్టేందుకు కేంద్రం రూపొందించిన సంచార్ సాతీని కాంగ్రెస్ వ్యతిరేకించిందని ఆయన గుర్తు చేశారు. ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ సీనియర్ నేత, ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ ఆగ్రహం వ్యక్తంచేశారు. ట్రాఫిక్ చలాన్‌లను ఆటోడెబిట్ ద్వారా నేరుగా బ్యాంకు ఖాతాల నుంచి వసూలు చేయాలని సీఎం పోలీసులకు సూచించ డంపై ఆయన మండిపడ్డారు. రేవంత్‌రెడ్డికి కనీస రాజ్యాంగ స్ఫూర్తి లేదు, అవగాహన లేదని విమర్శించారు. ముఖ్యమంత్రి మాట అంటే ఆదేశమని, అలాంటి ఆదేశానికి చట్టబద్ధత, నియమనిబద్ధత ఉండాలని శ్రవణ్ చెప్పారు. సీఎం స్థాయి వ్యక్తి ఏదిపడితే అది మాట్లాడటం కరెక్ట్ కాదని, అలా మాట్లాడితే ఆ వ్యక్తి జోకర్‌గా మిగిలిపోతారని అన్నారు. రేవంత్‌రెడ్డి జోకర్‌లా ఎందుకు మాట్లాడుతున్నారో అర్థం కావడం లేదని, ఆయనది అహంకారమా, అజ్ఞానమా, అమాయ కత్వమా..? తెలియదని వ్యాఖ్యా నించారు. తాము అధికారంలోకి ట్రాఫిక్ చలాన్‌లపై 50 శాతం డిస్కౌంట్ ఇస్తామని చెప్పిన రేవంత్‌రెడ్డి.. ఇప్పుడు నేరుగా బ్యాంకు ఖాతాల నుంచి ఆటోడెబిట్ ద్వారా చలాన్‌లను వసూలు చేయాలని సూచించడం దారుణ మని అన్నారు. ఆటోడెబిట్ ద్వారా ట్రాఫిక్ చలాన్‌లను వసూలు చేయాలనే నిర్ణయంతో సీఎం.. విచ్చలవిడి అవినీతికి, దోపిడీకి తెరలేపారని ఆరోపించారు.

### బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు ఆగ్రహం

## రేవంత్‌రెడ్డిది అహంకారమా.. అజ్ఞానమా?: దాసోజు శ్రవణ్

### మున్సిపల్ ఎన్నికల్లో బిజెపి ఒంటరిగానే పోటీ

### జనసేన పార్టీ రాష్ట్రంలో పోటీ చేస్తే తప్పలేదు

తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ ఒంటరిగానే పోటీ చేస్తుందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు స్పష్టం చేశారు. తమ పార్టీకి ఎవరైనా మద్దతు తెలిపితే స్వాగతిస్తామని ఆయన పేర్కొన్నారు. జనసేన ఒక రాజకీయ పార్టీ అని, ఆ పార్టీ తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేస్తే ఎలాంటి అభ్యంతరం ఉండదని ఆయన అన్నారు.

మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, బీజేపీ ఎదుగుదలను కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల నాయకులు జీర్ణించుకోలేకపోతున్నారని విమర్శిం చారు. శాసనమండలి ఎన్నికల్లో పోటీ చేయడానికి గులాబీ పార్టీకి అభ్యర్థులే కరవయ్యారని ఎద్దేవా చేశారు. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో తమ పార్టీ మంచి ఫలితాలు సాధించిందని ఆయన గుర్తు చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో నూ తమ సత్తా చాటుతామని రామచందర్ రావు ధీమా వ్యక్తం చేశారు. ఎంపీలు వారి నివాసాల్లో సమావేశం కావడంలో తప్పులేదని ఆయన అన్నారు. తనకు వ్యతిరేకంగా ఎవరైనా సమావేశం అయ్యారనే విషయంపై తనకు సమాచారం లేదని ఆయన తెలిపారు. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత పార్టీ పెడతారో లేదో తనకు తెలియదని ఆయన స్పష్టం చేశారు.

# 19న బిజెపి జాతీయ అధ్యక్షుని ఎన్నిక

### నామినేషన్ దాఖలు చేయనున్న పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నితిన్‌నబిన్

### 20న లాంఛనంగా ఆయన పేరు ప్రకటన



**న్యూఢిల్లీ, జనవరి 13:** భారతీయ జనతాపార్టీ సంస్థాగత జాతీయ ఎన్నికలకు సర్వం సిద్ధం అయింది. ప్రస్తుతం వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు చేపట్టిన సీనియర్‌నాయకుడు నితిన్‌నబిన్ జాతీయ అధ్యక్షుడుగా నామినేషన్ దాఖలుచేయనున్నారు. ఈ ఎన్నిక లాంఛన ప్రాయం మాత్రమే. పార్టీ వర్కింగ్‌ప్రెసిడెంట్‌గా గత డిసెంబరులో బాధ్యతలుస్వీకరించిన నితిన్ తన నామినేషన్ పత్రాలను ఈనెల 19వ తేదీ దాఖలుచేస్తారు. జనవరి 20వ తేదీనే ఆయన బిజెపి కొత్త జాతీయ అధ్యక్షుడుగా బాధ్యతలు స్వీకరిస్తారని పార్టీ నేతలు చెపుతున్నారు. అందరు బిజెపి రాష్ట్రాల ముఖ్యమంత్రులు, బిజెపి అన్ని రాష్ట్రాల అధ్యక్షులు, జాతీయ కార్యవర్గం, ఇతర కీలక నాయకులు సీనియర్ బిజెపి నాయకులు నామినేషన్‌రోజున ఢిల్లీకి రావాలని పార్టీ వర్తమానాలు పంపించింది.

బిజెపి చీఫ్ ఎలక్షన్ అధికారి కె.లక్ష్మణ్ బిజెపి అధ్యక్షుడుగా ఆయన పేరును అధికారికంగా ప్రకటిస్తారు. మూడు సెట్ల నామినేషన్లు ఈమేరకు ఆయన దాఖలుచేస్తారు. ఒక సెట్‌పై 20 మందికిపైగా రాష్ట్ర బిజెపి అధ్యక్షులు సంతకాలుచేయాలి. మరోసెట్‌పై ప్రధాని నరేంద్రమోడీ, రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్, హోంమంత్రి అమిత్‌షా, పార్టీ ప్రస్తుత జాతీయ అధ్యక్షుడు జెపినడ్డాలు సంతకంచేస్తారు. ఇక మూడోసెట్‌పై బిజెపి జాతీయ కార్యవర్గసభ్యుల సంతకాలుంటాయి. ఒకే ఒక్క పేరు వస్తుండటంతో బిజెపి జాతీయ అధ్యక్షుడుగా నితిన్‌నబిన్ పేరు దాదాపుగా ఖరారయినట్లే. ప్రస్తుత అధ్యక్షుడు జెపినడ్డా ఆధ్వర్యంలో ఇప్పటికే పార్టీ జాతీయ స్థాయి సమావేశం నిర్వహించింది. నితిన్‌నబిన్‌తోపాటు బిఎల్ సంతోష్; సునీల్ బన్సాల్, అరుణ్‌సింగ్, తరుణ్‌చుగ్‌లు ఈ సమావేశంలో పాల్గొన్నారు. బిజెపి అధ్యక్ష ఎన్నికకు సన్నాహాలు, ఏర్పాట్లను ఈ సమావేశంలో సమీక్షించారు ఈనెల 19,20 తేదీల్లోనే ఈ ఎన్నిక పూర్తవుతుంది. బీహార్‌కు చెందిన ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి రాష్ట్రకేబినెట్‌లో మంత్రిగా పనిచేసిన నితిన్ నబిన్‌ను ముందుగా జాతీయ కమిటీకి వర్కింగ్‌ప్రెసిడెంట్‌గా నియమించిన బిజెపి తదనంతరం ఆయన్నే రెగ్యులర్ అధ్యక్షుడుగా ఎన్నుకుంటున్నది. ఇప్పటివరకూ పనిచేసిన జెపినడ్డా రెండుసార్లు పదవీకాలం పొడిగింపు పొందారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలోను, పార్లమెంటు ఎన్నికల సమయంలో కూడా ఆయన పదవీకాలం పొడిగించారు. ప్రస్తుతం నడ్డా కేంద్రమంత్రిగా కూడా పనిచేస్తుండటంతో పార్టీ అధ్యక్షపదవికి మార్పు అనివార్యం అయింది. ఇందులో భాగంగానే నితిన్‌నబిన్‌ను వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమించిన కేంద్రం లాంఛనప్రాయంగా ఎన్నికలు నిర్వహిస్తోంది. ఇకపై బిజెపికి పూర్తికాలపు అధ్యక్షుడుగా బీహార్ నేత నితిన్‌నబిన్ కొనసాగనున్నారు.



## యూరోపియన్ పార్లమెంట్ డిజి మాంగోల్డ్‌తో తెలంగాణ సిఇఒ భేటీ

### డిజిటల్ దుష్ప్రచారాన్ని అడ్డుకునే మార్గాలపై లోతైన చర్చలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 13:** ఎన్నికల సమయంలో తప్పుడు సమాచారం, సోషల్ మీడియా ఆధారిత దుష్ప్రచారాన్ని అడ్డుకునే అంశంపై తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సిఇఒ) సి.సుదర్శన్‌రెడ్డి యూరోపియన్ పార్లమెంట్ డైరెక్టర్ జనరల్ ఫర్ కమ్యూనికేషన్ క్రిస్టియన్ మాంగోల్డ్‌తో మంగళవారం కీలక భేటీ నిర్వహించారు. ఈయూ ఎన్నికల వ్యవస్థ నిర్మాణం, ప్రజలతో కమ్యూనికేషన్ నిర్వహించే విధానం, ఫేక్ న్యూస్ వ్యాప్తిని నియంత్రించేందుకు యూరోపియన్ యూనియన్ తీసుకుంటున్న సాంకేతిక, విధానపరమైన చర్యలను మాంగోల్డ్ వివరించారు. డిజిటల్ వేదికలపై జరుగుతున్న తప్పుడు ప్రచారాన్ని గుర్తించి తక్షణమే స్పందించే ప్రత్యేక మానిటరింగ్ వ్యవస్థల గురించి కూడా ఆయన ప్రస్తావించారు.

సిఇఒ సుదర్శన్‌రెడ్డి భారత ఎన్నికల విధానాన్ని సమగ్రంగా వివరిస్తూ, వృద్ధులు, దివ్యాంగులు, వలస ఓటర్లు వంటి వర్గాలకు సులభంగా ఓటు హక్కు వినియోగించేలా భారత ఎన్నికల సంఘం అమలు చేస్తున్న నూతన కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా భారత్ నిర్వహిస్తున్న ఎన్నికల తీరుపై మాం గోల్డ్ ప్రత్యేకంగా ప్రశంసలు వ్యక్తం చేసినట్లు అధికారులు తెలిపారు. జనవరి 2025 నుంచి యూరోపియన్ పార్లమెంట్‌లో డైరెక్టర్ జనరల్ ఫర్ కమ్యూనికేషన్‌గా క్రిస్టియన్ మాంగోల్డ్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. అంతర్జాతీయ స్థాయిలో ఎన్నికల నిర్వహణలో అనుసరిస్తున్న ఉత్తమ పద్ధతులను అధ్యయనం చేయడం, డిజిటల్ యుగంలో ఎన్నికల విశ్వసనీయతను పరి రక్షించడమే లక్ష్యంగా సిఇఒ నేతృత్వంలోని తెలంగాణ బృందం యూరప్ పర్యటనలో భాగంగా ఈ భేటీ జరిగినట్లు అధికారులు వెల్లడించారు.

## కిలో చికెన్ రూ.350కి చేరిక

### మటన్ కేజీ రూ.950

**హైదరాబాద్, జనవరి 13, ప్రభాతవార:** తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌ల్లో పండుగ వేళ చికెన్ రేట్లు పెరగడం షాకిస్తోంది. పండుగ డిమాండ్‌ను పౌల్ట్రీ వ్యాపారులు క్యాష్ చేసుకుంటున్నారు రెండు రాష్ట్రాల్లో సంక్రాంతి పండుగ కారణంగా చికెన్ ధరలు విపరీతంగా పెరిగాయి. సాధారణ రోజుల్లో రూ. 240 ఉన్న చికెన్ ఇప్పుడు స్కిన్‌లెస్ రూ.340 నుండి రూ.350 వరకు, లైవ్ చికెన్ రూ.180 వరకు పలుకుతోంది, అలాగే నాటుకోడి ధర రూ.2 వేల నుండి రూ.2,900 వరకు చేరింది. డిమాండ్ పెరగడం, ఉత్పత్తి తగ్గడం వల్ల ధరలు పెరిగాయని వ్యాపారులు చెబుతు న్నారు. దీంతో నాన్‌వెజ్ మార్కెట్లలో సందడి తగ్గింది. హైదరాబాద్‌లో అయితే కిలో కోడి మాంసం రూ.300 నుండి రూ.320 వరకూ పలుకుతోంది. నాటుకోడి సంగతి అయితే చెప్పనక్కర్లేదు. మామూలు రోజుల్లో నాటుకోడి రేటు ఇప్పుడు ఏకంగా రూ.3 వేలకు అమ్ముతున్నారు. మటన్ ధర కూడా కిలో రూ.800 నుంచి రూ.950 అమ్ముతున్నారు.

## అంతర్రాష్ట్ర గంజాయి స్మగ్లర్ పట్టివేత

**హైదరాబాద్, జనవరి 13, ప్రభాతవార్త:** ఒడిశా నుంచి గుజరాత్‌లోని సూరత్‌కు గంజాయి స్మగ్లింగ్ చేస్తున్న ఓ అంతరాష్ట్ర గంజాయి స్మగ్లర్‌ను ఈగల్ పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఇతని వద్ద నుంచి 6.28 కిలోల నాణ్యమైన గంజాయిని జప్తు చేశారు. దీనికి సంబంధించిన వివ రాలను ఈగల్ డైరెక్టర్ సందీప్ శాండిల్యా మంగళవారం మీడియాకు వెల్లడించారు. ఒడిషాలోని గంజాం జిల్లా చంద్రాపూర్‌కు చెందిన అనంత స్వాయి న్ (32) స్థానికంగా సెక్యూరిటీ గార్డుగా వున్నాడు. అయితే ఇందులో పెద్దగా జీతం లేక పోవడంతో అతను పక్కదారి పట్టాడు. తానుండే ప్రాంతాని కి చెందిన ఆనంద్ స్వయిన్ అనే గంజాయి స్మగ్లర్‌తో చేతులు కలిపి తాను కూడా ఈ దందాలో దిగాడు. గంజాయి స్మగ్లింగ్ చేస్తే దండిగా డబ్బులు వస్తాయని ఆనంద్ చెప్పడంతో అనంత అంగీకరించాడు. ఈ క్రమంలో ఇతను పలుమార్లు గం జాయి స్మగ్లింగ్ చేసి కొంత గడించాడు. తాజాగా ఆ నంద్ అనంతకు 6.28 కిలోల గంజాయిని ఒడిషాలో ఇచ్చి దీనిని గుజ రాత్‌లోని సూరత్‌లో తనకు పరిచయం వున్న స్మగ్లర్‌కు ఇవ్వాలని కోరాడు. దీని తరువాత అనంత గంజాయి వున్న సూట్ కేసుతో కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో ఒడిషా నుంచి సికింద్రాబాద్‌కు మంగళవారం ఉదయం వచ్చాడు. అన ంతరం గంజాయితో సహా ఎంఎంటిఎస్ రైలులో సికింద్రాబాద్ స్టేషన్ నుంచి కాచి గూడ స్టేషన్‌కు వచ్చాడు. ఇక్కడి నుంచి అనంత గంజాయిని తీ సుకుని సూరత్‌కు వెళ్లాల్సి వుంది. అయితే అనంత గురించి పక్కా సమాచారం వున్న ఈగల్ పోలీసులు కాచిగూడ స్టేషన్‌లో తనిఖీలు నిర్వహించి అ తన్ని పట్టుకుని గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడ్డ గంజాయి విలువ మూడు లక్షల 14 వేల రూపాయలుగా పోలీసులు తెలిపారు. కా గా రాష్ట్రంలో గంజాయి లేదా ఇతర ఎలాంటి డ్రగ్స్ గురించి సమాచారం వున్నా ఈగల్ టోల్ ఫ్రీ నంబర్ 1908 లేదా 8712671111కు తెలపాల ని ఈగల్ డైరెక్టర్ సందీప్ శాండిల్యా కోరారు.

## మరికొన్ని సంక్రాంతి ప్రత్యేక రైళ్లు

**హైదరాబాద్ (తార్నాక), జనవరి 13, ప్రభాతవార్త :** మకరవిళక్కు పండుగ సీజన్‌ను పురస్కరిం చుకుని ప్రయాణికుల రద్దీ అధికంగా ఉండనున్న నేపథ్యంలో దక్షిణ మధ్య రైల్వే వివిధ గమ్యస్థానాల మధ్య నాలుగు ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు ప్రకటించింది. ఈ ప్రత్యేక రైళ్ల వివరాలు ఇలా ఉన్నాయి.

రైలు నెం. 06067 తిరువనంతపురం సెంట్రల్ - చర్లపల్లి స్పెషల్: జనవరి 15న గురువారం ఉదయం 4.10 గంటలకు తిరువనంతపురం నుంచి బయలుదేరి మరుసటి రోజు మధ్యాహ్నం 3.00 గంటలకు చర్లపల్లికి చేరుకుంటుంది. రైలు నెం. 06068 చర్లపల్లి - తిరువనంతపురం సెంట్రల్ స్పెషల్: జనవరి 16న శుక్రవారం రాత్రి 9.45 గంటలకు చర్లపల్లి నుంచి బయలుదేరి ఆదివారం ఉదయం 8.00 గంటలకు తిరువనంతపురానికి చేరుకుంటుంది.

రైలు నెం. 06065 కొల్లం జంక్షన్ - కాకినాడ టౌన్ స్పెషల్: జనవరి 15న గురువారం తెల్లవారుజామున 3.30 గంటలకు కొల్లం నుంచి బయలుదేరి మరుసటి రోజు మధ్యాహ్నం 12.00 గంటలకు కాకినాడ టౌన్‌కు చేరుకుంటుంది. రైలు నెం. 06066 కాకినాడ టౌన్ - ఎర్నాకులం స్పెషల్: జనవరి 16న శుక్రవారం సాయంత్రం 6.00 గంటలకు కాకినాడ టౌన్ నుంచి బయలుదేరి మరుసటి రోజు రాత్రి 10.30 గంటలకు ఎర్నాకులం చేరుకుంటుంది.

తిరువనంతపురం-చర్లపల్లి-తిరువనంతపురం స్పెషల్ రైళ్లు కొల్లం, చెంగన్నూర్, తిరువల్ల, చంగనాస్సే రి, కొట్టాయం, ఎర్నాకులం జంక్షన్, అలువా, త్రిస్సూ ర్, పాలక్కాడు, పొద నూర్, తిరుప్పూర్, ఎరోడ్, సేలం, జోలార్‌పేట్టై, కట్పాడి, రెనిగుంట, గూడూరు, నెల్లూరు, ఒంగోలు, చీరాల, తెనాలి, విజయవాడ, ఖమ్మం, వరంగల్, కాజీపేట స్టేషన్లలో ఆగుతాయి.

కొల్లం-కాకినాడ టౌన్ స్పెషల్ రైలు కాయంకులం, చెంగన్నూర్, తిరువల్ల, చంగనాస్సే రి, కొట్టాయం, ఎర్నాకులం జంక్షన్, ఎర్నాకులం టౌన్, అలువా, త్రిస్సూ ర్, పాలక్కాడు, పొదనూర్, తిరుప్పూర్, ఎరోడ్, సేలం, జోలార్‌పేట్టై, కట్పాడి, పెరంబూర్, గూడూరు, నెల్లూరు, ఒంగోలు, చీరాల, తెనాలి, విజయవాడ, గుడివాడ, భీమవరం టౌన్, నిడదవోలు, రాజమండ్రి, సమల్కోట్ స్టేషన్లలో ఆగుతుందని రైల్వే అధికారులు తెలిపారు.కాకినాడ టౌన్-ఎర్నాకులం స్పెషల్ రైలు సమల్కోట్, రాజమండ్రి, నిడదవోలు, భీమవరం టౌన్, గుడివాడ, విజయవాడ, తెనాలి, చీరాల, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, పెరంబూర్, కట్పాడి, జోలార్‌పేట్టై, సేలం, ఎరోడ్, తిరుప్పూర్, పొదనూర్, పాలక్కాడు, త్రిస్సూ ర్, అలువా స్టేషన్లలో ఆగుతుంది.ఈ ప్రత్యేక రైళ్లలో ఏసీ 3 టియర్, స్లీపర్, జనరల్ సెకండ్ క్లాస్ కోచ్‌లు అందుబాటులో ఉంటాయని రైల్వే అధికారులు వెల్లడించారు.

## సంక్రాంతికి ఇప్పటిదాకా 5,375 స్పెషల్ బస్సులు

### తిరుగు ప్రయాణానికి 18, 19 తేదీల్లోనూ ప్రత్యేక సర్వీసులు

**హైదరాబాద్, జనవరి 13, ప్రభాతవార్త:** సంక్రాంతి పండుగ సందర్భంగా టిజిఎస్ ఆర్‌టిసి గత నాలుగు రోజులుగా పండుగ రద్దీకనుగుణంగా ప్రత్యేక బస్సులతో ప్రయాణికులను సురక్షి తంగా గమ్యస్థానాలకు చేరవేసింది. ఇప్పటి వరకు 5,375 స్పెషల్ బస్సులను నడిపినట్లు ఆర్‌టిసి ప్రకటించింది. స్పెల్ బస్సుల రవాణా సేవల్ని అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని టిజిఎస్ ఆర్‌టిసి ప్రత్యేక బస్సులతో సేవల్ని అందిస్తుందన్న విషయం తెలిసిందే. పట్టణాల నుంచి పల్లెలలకు వెళ్లే ప్రయాణికులకు ఏమాత్రం అసౌకర్యం కలుగకుండా ముందస్తు ఏర్పాట్లతో వారి వారి గమ్యస్థానాలకు చేరవేస్తోందని అధికారులు ప్రకటించారు. ఈ నెల 9 నుంచి ప్రత్యేక బస్సులతో ఆయా ప్రాంతాల నుంచి రవాణా సౌకర్యాన్ని అందిస్తున్న టిజిఎస్ ఆర్‌టిసి మంగళవారం వరకు 5375 స్పెషల్ బస్సులను ఆపరేట్ చేసిందని ప్రకటించింది. ప్రయాణికులకు ఎలాంటి అవాంతరాలు ఎదురు కాకుండా ఉండేందుకు ముందస్తుగా తీసుకున్న చర్యలు మంచి ఫలితాలను ఇస్తున్నాయని, ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాలలో ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేసి బస్సుల రాకపోకలకు సంబంధించిన సమాచారాన్ని అందజేస్తున్నట్లు ఆర్‌టిసి ప్రకటించింది. ఉన్నతాధికారులు ఆయా పాయింట్లను స్వయంగా పర్యవేక్షిస్తూ రవాణా ఏర్పాట్లపై ఎప్పటికప్పుడు సిబ్బందికి తగు ఆదేశాలు ఇస్తున్నారు. హైదరాబాద్‌లో రద్దీ ప్రాంతాలైన ఎంజీబీఎస్, జేబీఎస్, ఉప్పల్ క్రాస్ రోడ్స్, ఆరాంఘర్, ఎల్బీనగర్ క్రాస్ రోడ్స్, కేపీహెచ్‌బి ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సులను సంస్థ నడుపుతోంది. ఈ నెల 9 వ తేదిన 721, 10 వ తారీఖున 1645, 11న 1180, 12న 1109, 13న (6 గం.ల వరకు) 720 ప్రత్యేక బస్సులలో ప్రయాణికులను సురక్షి తంగా వారి వారి గమ్యస్థానాలకు చేరవేసినట్లు సంస్థ వెల్లడించింది. జె.బి.ఎస్ (1484), ఎంజీబీఎస్ (1170), ఉప్పల్(807), కె.పి.హెచ్.బి (916), ఎల్.బి. నగర్ (715), ఆరాంఘర్ (283) నుంచి స్పెషల్ బస్సులను నడిపినట్లు అధికారులు పేర్కొన్నారు. సంక్రాంతి పండుగ అనంతరం తిరుగు ప్రయాణంలో కూడా ప్రయాణికులకు ఎలాంటి అవరోధాలు తలెత్తకుండా ఉండేందుకు ఈ నెల 18, 19 న ప్రత్యేక బస్సుల్ని నడుపనున్నట్లు తెలిపింది. ఈ ప్రత్యేకమైన రవాణా సేవల కోసం సిబ్బంది అంకితభావంతో విధుల్ని నిర్వహిస్తున్నారని సంస్థ పేర్కొంది. ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కోకుండా తగిన సమాచారాన్ని అందించడం జరుగుతోందని, సుదూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు ముందస్తుగా రిజర్వేషన్ ద్వారా టిక్కెట్లను బుక్ చేసుకుని టిజిఎస్ ఆర్‌టిసి సేవల్ని వినియోగించుకోవాలని అధికారులు సూచించారు. సంక్రాంతి ప్రత్యేక బస్సులకు సంబంధించిన పూర్తి సమాచారం కోసం ఆర్‌టిసి కాల్ సెంటర్ నంబర్లు 040-69440000, 040-23450033లలో సంప్రదించాలని సంస్థ సూచించింది.

## మళ్లీ 'సుప్రీం'కు సునీతారెడ్డి

### వివేకా హత్య కేసులో కీలక పరిణామం

**హైదరాబాద్, జనవరి 13, ప్రభాతవార్త:** మాజీ మంత్రి వై.ఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో సిబి ఐ తదుపరి దర్యాప్తు పరిధిని ఇద్దరు వ్యక్తులకు మాత్రమే పరిమితం చేస్తూ హైదరాబాద్ సిబిఐ కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను వివేకానంద రెడ్డి తనయ సునీతా రెడ్డి సుప్రీం కోర్టులో సవాల్ చేశారు. ఈ మేరకు ఆమె తాజాగా పిటిషన్ దాఖలు చేశారు. ఈ కేసు విచారణలో ట్రయల్ కోర్టు నిర్ణయం, తాము లేవనెత్తిన అంశాలకు సుప్రీం కోర్టు గతంలో జారీ చేసిన మార్గదర్శకాలకు విరుద్ధంగా వుందని సునీతా రెడ్డి తన పిటిషన్‌లో తెలిపారు. ఈ కేసులో తదుపరి దర్యాప్తు అవసరంపై మూడు నెలల్లోగా నిర్ణయం తీసుకోవాలని గతంలో ట్రయల్ కోర్టుగా వున్న హైదరాబాద్ సిబిఐ కోర్టును సుప్రీం కోర్టు ఆదేశించడం తెలిసిందే. ఈ ఆదేశాల మేరకు హైదరాబాద్ సిబిఐ కోర్టు విచారణ చేబట్టి ఇద్దరు వ్యక్తులకు సంబంధించిన అంశాలపై మాత్రమే దర్యాప్తును పరిమితం చేస్తూ పాక్షిక ఉత్తర్వులు జారీ చేసింది. ఈ పాక్షిక ఉత్తర్వులను సునీతా రెడ్డి సుప్రీం కోర్టులో సవాల్ చేశారు. కాగా సునీతా రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌తో పాటు ఇప్పటికే పెండింగ్‌లో వున్న ఇతర పిటిషన్లతో కలిపి విచారిస్తామని పేర్కొన్న ధర్మాసనం దీనిపై తదుపరి విచా రణను వచ్చే మంగళవారానికి వాయిదా వేసింది.

**బహిరంగ ప్రకటన**

తేది: 14.01.2026

గౌరవనీయ తెలంగాణ హైకోర్ట్ వారి ఎదుట శ్రీమతి ఎ.సునీల, నాంపల్లి XII అడిషనల్ చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ వారి ఎదుట పెండింగ్ వున్న CC No. 350 of 2017 లో ప్రొసీడింగ్స్ ఛాలెంజింగ్ చేస్తూ Crl.P.No. 14219 of 2024 దాఖలు చేసారు. ప్రతివాది నం.లు 2, 5 మరియు 6. టి.జ్ఞానేశ్వర్, డి.కృష్ణారెడ్డి మరియు మోహన్‌రాజ్ అయి ఉన్నారు. న్యాయస్థానం 23-12-2025న ఈ ప్రతివాదులకు బదులు నోటీస్ నిర్దేశించి మరియు మేటర్‌ను 22-01-2026కు పోస్ట్ చేసింది. న్యాయస్థానం ఉత్తర్వు ఆదేశం ప్రకారం ఆ రోజుగానీ లేదా ఏ ఇతర తేదీన గానీ ప్రతివాదులు హాజరు కావడం విఫలమైతే, రికార్డుపై మెటీరియల్ యొక్క ఆధార ప్రాతిపదికన మేటర్ నిర్ణయించబడుతుంది.

సుహృద్భావంతో

సం/- TPS హర్ష, న్యాయవాది

మొబైల్: + 919493920888

**తెలంగాణ ప్రభుత్వం**

**అటవీ శాఖ**

**సంక్షిప్త ఇ-టెండర్ ప్రకటన**

సంగారెడ్డి జిల్లా, సంగారెడ్డి రేంజ్, గుమ్మడిదల బీట్ మరియు సెక్షన్, Compt.No. 335 & 336 మంబాపూర్ అర్బన్ ఫారెస్ట్ పార్క్ వద్ద సాధారణ టాయిలెట్ బ్లాక్ నిర్మాణం అనగా (1) పని కొరకు ప్రమాణితమైన 13.01.2026 తేదీ ఫైల్ నం. 861207/S6/2025. టెండర్ ఐడి : 669444 ప్రకారం ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్ ఫారంపై 2025-26లో www.tender.telangana.gov.in లోకి లాగిన్‌చే పని వివరాలు చూడవచ్చును. (క్ర.సం.1,2, 3,4 పని యొక్క పేరు: 1) సంగారెడ్డి జిల్లా, సంగారెడ్డి రేంజ్, గుమ్మడిదల బీట్ మరియు సెక్షన్, Compt No. 335 & 336 మంబాపూర్ అర్బన్ ఫారెస్ట్ పార్క్ వద్ద సాధారణ టాయిలెట్ బ్లాక్ నిర్మాణం. అంచనా మొత్తం రూ.లలో: రూ.8,21,135/-. 2) బిడ్ డాక్యుమెంట్ యొక్క దాఖలు మరియు టెండర్ డాక్యుమెంట్ యొక్క డౌన్‌లోడ్: 14.01.2026 ఉ.10.30గం. నుండి 23.01.2026 మ.3.00గం. 3) టెక్నికల్ బిడ్ తెరచు తేది: 23.01.2026 మ.3.30గం. 4) ప్రైస్ బిడ్ తెరచు తేది: 23.01.2026 సా.4.30గం. కార్యాలయ చిరునామా: జిల్లా అటవీ శాఖాధికారి, సంగారెడ్డి, మల్కాపూర్ X రోడ్ దగ్గర, రామ్‌చంద్రారెడ్డి కాలనీ, సంగారెడ్డి-502001 (సంప్రదించవలసిన నం. 8142412347).

సం/-. జిల్లా అటవీ శాఖాధికారి, సంగారెడ్డి.

DIPR.NO. 13684-PP/CL/ADVT/1/2025-26 తేది: 13.01.2026

**తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం వద్ద ఒక క్రొత్త రాజకీయ పార్టీగా రిజిస్ట్రేషన్ కావడానికి జారీ చేయబడిన నోటీసు**

(తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలతో ప్రచురించబడినది)

తేది: 07-01-2026

రాజకీయ పార్టీల రిజిస్ట్రేషన్ మరియు గుర్తుల కేటాయింపు ఉత్తర్వు, 2018 యొక్క నిబంధనలకు లోబడి "రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (భీంరావ్ అంబేద్కర్)" (పార్టీ పేరు) జాతీయ అధ్యక్షులు అయిన శ్రీ డా. భీంరావ్ యశ్వంత్ అంబేద్కర్ గారు తమ పార్టీని 'రిజర్వు గుర్తు లేని రాజకీయ పార్టీగా' తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం వద్ద నమోదు చేసుకొనుటకై అభిలషిస్తున్నట్లు సాధారణ ప్రజానీకానికి తెలియజేసేందుకు ఈ నోటీసు ఉద్దేశమైనది. ఈ పార్టీలో (1) ప్రొఫెసర్ డా. గాలి వినోద్ కుమార్, రాష్ట్ర అధ్యక్షులు గారు, (2) శ్రీ వల్లెపు మైసయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షులు గారు, (3) శ్రీ తొంట బాబు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గారు, (4) శ్రీ కమ్మంపల్లి మురళీకృష్ణ, కోశాధికారి గారు, ప్రధాన కార్యవర్గ సభ్యులు మరియు పార్టీ యొక్క కేంద్ర కార్యాలయం: సూరత్: 71, 3వ అంతస్తు, మాత్రు ఆశిష్ అపార్ట్‌మెంట్, త్రిభువన్ నగర్, సూరత్, గుజరాత్ - 395004, రాష్ట్ర కార్యాలయం: ఇం.నెం. 12-13-132/1, కిట్రియా రెసిడెన్సీ, ఫ్లాట్ నెం. 202, రోడ్ నెం. 3, తార్నాక, సికింద్రాబాద్ - 500017, తెలంగాణ రాష్ట్రం.

సదరు పార్టీ రిజిస్ట్రేషన్‌పై ఎవరికైనా ఏ విధమైన అభ్యంతరాలు ఉన్నట్లయితే, అట్టి అభ్యంతరాలను కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం, మొదటి అంతస్తు, టిజిటిసి భవనం, ఎ.సి. గార్డ్స్, హైదరాబాద్ - 500004 గారికి ఈ ప్రకటన ప్రచురితమైన పదిహేను రోజుల్లోగా పంపవలెను. నిర్ణీత గడువులోగా అభ్యంతరాలు రానియెడల, తెలంగాణ రాష్ట్రంలో పార్టీల పరంగా జరిగే స్థానిక సంస్థల ఎన్నికలలో పోటీ చేసేందుకు "రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (భీంరావ్ అంబేద్కర్)" (పార్టీ పేరు)ను ఒక రాజకీయ పార్టీగా నమోదు చేయు ప్రక్రియను రాష్ట్ర ఎన్నికల సంఘం చేపడుతుంది.

సం/- రాష్ట్ర అధ్యక్షులు, "రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (భీంరావ్ అంబేద్కర్)" రాజకీయ పార్టీ పేరు, తెలంగాణ రాష్ట్రం.

వార్త

ఇతరుల సంపాదనను అక్రమంగా ఆశించేవారు నికృష్టులు. తన సంపాదనను అనుభవించేవారు శ్రేష్ఠులు.

-సోక్రటీస్


# చుర్రుమంటున్న 'సర్'!

ఏ వరైతేనేమి దేనికయితేకానీ 'సర్' మంట రాజుకుంది. అదిప్పుడిప్పుడే ఆరేట్లు లేదు. ఓటర్ల జాబితాలో తప్పుల సవరణ, హాజరులో లేని ఓట్ల తొలగింపు వంటి అంశాలకున్న ప్రాధాన్యత అంతా ఇంతా కాదు. ఎన్నికల కమిషన్ ఈ అంశాలపై ప్రత్యేక శ్రద్ధ కేటాయించడం ఆహ్వానించదగినదే.కానీఎన్నో విమర్శలను తలకెత్తుకొంది. అనేక ఆరోపణలకు గురైంది. అవేమీ చిన్నాచితక ఆరోపణలు కావు. దేశం మొత్తంమీద రాజకీయ రంగంలో అనేక చిత్ర విచిత్ర సంఘటనలకు కారణమైంది. సమయం సరైనదే అయినా సందర్భం దానికంతగా అనుకూలించలేదు. ఎప్పుడైనా చేసేది చేయాల్సిందే. చేయగలిగిందే. కానీ ప్రధాన ఎన్నికల కమిషనర్ జాబితాన్ని సమంజసంగా వినియోగించు కోకుండా విపక్ష ప్రధాన నేతల మీద ఒంటికాలుమీద లేచారు. ప్రశ్నించేందుకు మీరెవరు! మేమే అన్నీ! అనే ధోరణితో వ్యవహరించడమే అసలు సమస్య కన్నా మిన్నగా జనం లోకి పోయింది. కేంద్ర ఎన్నికల కమిషన్ స్వతంత్ర్యంగా వ్యవహరించిందా? లేదా! అనే అంశాలపై సందేహాలు కలిగే విధంగా ప్రవర్తించింది. అప్పట్నించే ఈ 'సర్' వ్యవహారం పాకం జీడిలా సాగుతోంది. తాజాగా ఎన్నికల సంఘంపై పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ 'సర్' తీసివేతలపై ధ్వజమెత్తుతున్నారు. ప్రస్తుత రూపంలోనే ఎన్నికల సంఘం ముందుకెళ్తేఎంతో మంది ఓటు హక్కును కోల్పోతారని ఆమె ఆందోళన. కాంగ్రెస్ పార్టీ చెప్పిందనో, ఎన్నికల సంఘం భారతీయ జనతాపార్టీ కనుసన్నల్లో నడుస్తోందనో ఆరోపణలు చేసుకుంటూ కాలక్షేపం చేయడం కన్నా అసలు లోతుల్ని కనిపెట్టి దాడి చేయడమైనా, బలమైన ఆరోపణలకు 'తెర' తీయడమైనా చేస్తే అందరికీ ఉభయతారకంగా ఉంటుంది. కానీ ఎన్నికల సంఘం తమపై వచ్చే ఎలాంటి ఆరోపణలనూ లెక్క చేయకుండా ముందుకెళ్తోంది. ప్రణాళిక సన్నద్ధత లేకుండా సమర్థ యంత్రాంగం లేకుండానే 'సర్'ను తాత్కాలికంగా అమలు చేసి ఓటర్లను తొలగించేస్తోందని ఆమె పశ్చిమ బెంగాల్ ఓటర్ల తొలగింపుపై నానాయాగీ చేస్తున్నారు. అదే విషయాన్ని మమత ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌కు లేఖరాశారు. తీవ్ర అవకతవకలు, విధాన ఉల్లఘనలు లేకుండా పరిపాలనా నిర్వహణ లోపాలను సరిచేసుకుని 'సర్'ను అమల్లోకి తెస్తే ఎవరికీ ఏ విధమైన అభ్యంతరం ఉండదని మమతా బెనర్జీ వెల్ల డిస్తున్నారు. ప్రస్తుతం జరుగుతున్న ఓట్ల తొలగింపువ్యవ హారాన్ని ఆమె ప్రజాస్వామ్య పునాదులపై దాడిగా అభివర్ణించారు. ఏకపక్షంగా, లోపభూయిష్టంగా ఉన్న ఓటర్ల జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ కసరత్తులు నిలిపి వేయాలని ఆమె ప్రధాన ఎన్నికల కమిషనర్‌కు విజ్ఞప్తిచేశారు. ఆమోదయోగ్యం, ఆచరణ సాధ్యంకాని నిబంధనల వలనే 'సర్'లో సమస్యలు తలెత్తుతున్నాయని, నిజానికి 'ఓట్ల' సమీక్షకు తమకేమీ అభ్యంతరం లేదని 'సర్' విధానాలపై ధ్వజమెత్తుతున్న అన్ని రాష్ట్రాలూచెప్పేమాట. బెంగాల్‌లో అవలంబిస్తున్న 'సర్' ప్రక్రియ కోసం విని యోగిస్తున్న 2002 నాటి ఓటర్ల జాబితా సమయంలోనే డిజిటలైజేషన్ ప్రక్రియలో లోపాలు చోటు చేసుకున్నాయ ని ఆమె ఆరోపణ. దీని విషయమై ఎన్నికల కమిషన్ ఇంతవరకు స్పందించకపోవడం వల్లనే మమత ఆగ్రహ కారణం. ఇలాంటి అవకతవకల వలన ఓటర్లు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సర్‌ప్రక్రియ మొదలైన నాటినుంచి ఆమె ఆవేదనలన్నీ ఇసికిలేఖల రూపంలో చేరుతూనే ఉన్నాయి. తాజా లేఖ ఐదవది. బీహార్‌లో విపక్షాలన్నీ ఈ 'సర్' ప్రక్రియపై ధ్వజమెత్తడం ఎన్నికల కమిషనర్‌తోపాటు సుప్రీంకోర్టు సాధికారికంగా కలుగ చేసుకోవడంతో చాలా సమస్యలు సమసిపోయాయనే అందరూ అనుకున్నారు. కానీ బిఎల్‌ఓల పేరిట కొత్త సమస్యలు తలెత్తాయి. అది వారి వ్యక్తిగతం కాదు. విధాన రూపకల్పనలో వైవిధ్య విధానాలు ఉండడం వల్లే వాటి మీద కూడా విమర్శలు చెలరేగాయి. కృత్రిమ మేధ ఆధారంగా చేపట్టిన2022నాటి ఓట్ల సవరణ కార్యక్రమంలోనూ తప్పులు దొర్లాయి. అవన్నీ సవరింపదగ్గవే.కానీ ఎందుకనో ఎన్నికల కమిషన్, బహిరంగ నోటీసుల ప్రక్రియ ప్రారంభించారు. ఆనాటి ఓటర్ల జాబితాలో తప్పులు చోటు చేసుకున్నందున నేడు సేకరించిన సమాచారంతో కొన్ని సరిపోలలేదు.'డేటామిస్ మేచ్' అనే కొత్త సమస్య తెరపైకి వచ్చింది. తాజా వివరా లతో సరిచేసుకోవచ్చు. కానీ పారదర్శకం కోసమే వాటి సవరణ చోటు చేసుకోలేకపోతోంది. ఉన్న వివరాలు చాలవనే ధోరణిలో ఇ.సి నోటీసులిస్తోంది. తాజాగా నోబెల్ అవార్డుగ్రహీత అమర్త్యసేన్ ఇసి నోటీసులిచ్చింది. ఆయనకు ఆయన తల్లిగారికి మధ్య వయసుతేడా 18సంవత్సరాలుగా ఉందనే కారణంతో అక్కడ లేనిపోని సందేహాలు తలెత్తే స్థాయిలో ఎన్నికల కమిషన్ నోటీసుల ప్రస్తావన ఉంది. విపక్షాల విమర్శలెన్నున్నా వాటికి జవాబు చెప్పేందుకు ఎన్నికల సంఘం సిద్ధంగాలేదు. రాజ్యాంగస్ఫూర్తికి భిన్నంగా ఓటర్ల జాబితా సవరణ జరుగుతోందనే ఆరోపణల నుంచి బయట పడేందుకు ఏ విధంగానూ ఎన్నికల కమిషన్ ప్రయత్నించడం లేదన్న విమర్శల నుంచి దూరంగా జరిగే పరిస్థితులను కల్పించలేకపోతోంది. సర్‌లో అనుమానిత ఓటర్ల విచారణ యాంత్రికంగా పాత సాంకేతిక డేటా ఆధారంగానే జరుగుతోందితప్ప మానవీయ విలువలను పట్టించుకోవడంలేదంటూ మమత బెనర్జీ తనలేఖలో ఆధారసహితంగా పేర్కొంది. పలురాష్ట్రాల్లో విచారణానంతరం ఎంత మంది ఓటర్లను తొలగించినా వాటిపై సందేహాలను తీర్చడంలో ఇ.సి పారదర్శకతను అనుసరిస్తే సమస్య జటిలం కాదు.



ప్రపంచాన్ని అర్థం చేసుకోవాలనే కోరిక, దాన్ని మార్చాలనే ఆకాంక్ష మానవ ప్రగతికి ప్రధాన ప్రేరకాలు.

బెర్ట్రండ్ రస్సెల్



మన ప్రవర్తనలో ముందుగా మార్పు వస్తే సహజంగానే ప్రపంచంలోనూ మార్పు వస్తుంది.

షేక్స్పియర్

# పర్యావరణ పరిరక్షకులు మనమే

**పరిశుభ్రత పారిశుధ్యం అనే అంశం కేవలం పారిశుద్ధ్య కార్మికులకు వదిలి వేయకుండా పూర్తిస్థాయిలో సమాజంలోని ప్రజల భాగస్వామ్యం పరస్పర సహకారంతో బాధ్యతగా ఆధునిక ధోరణితో పర్యావరణ పరిరక్షించే అనేక ప్రక్రియలను ఉపయోగించుకుని మొదట కాలుష్య రహిత పరిసరాలను ఏర్పరచుకున్న తర్వాతనే జీవన అవసరాలకు నిర్ణయాత్మక రూపకల్పన చేసుకునే విధంగా రానున్న రోజుల్లో కాలుష్య నిర్మూలనపై మరింత అవగాహన కలిగే పరిస్థితి ఉంటే మంచిదేమో. అదే విధంగా కాలుష్యనియంత్రణలో వృక్షసంపద కూడాఅత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది.అవసరమైన ప్రాంతాల్లో వృక్షాలను పెంచుకునే బాధ్యత కూడా మానవ సమాజంపైఉంది. అత్యధికశాతం అడవులను నరికివేస్తూ అనుకూలమైన సాను కూల జీవన విధానాలకొరకు అనేకరకాలైన టువంటి పద్ధతులను అవలంబిస్తున్న ఆధునిక మానవుడు అవసరమైతేతిరిగి చెట్లను నాటి వాటిని పెంచే విధంగా బాధ్యతను తీసుకుంటే రాబోవు కాలంలో మంచి వాతావరణంతో కూడిన పర్యావరణం ప్రకృతి మానవునికి మేలు చేసే విధంగా ఉంటుందని ఆశించడంలో సందేహం లేదు.**

దాడిశెట్టి శ్యామ్ కుమార్

దేశంలో ప్రధాన నగరాలతో పాటు జనసాంద్రత అధికంగా ఉన్న ప్రాంతాల్లో మోతాదుకు మించిన కలుషితమైన పదార్థాలు నిరంతరం మానవాళికి నష్టం కలిగించే విధంగా రూపాంతరం చెందుతూ ఉండడం శోచనీయం. తద్వారా కాలుష్య బారిన పడిపోతున్న ప్రజలు తీవ్ర ఇబ్బందులతోపాటు అనారోగ్య సమస్యలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. ముఖ్యంగా జీవావరణం చుట్టూ ఉన్న పరిసర ప్రాంతాల్లో వాయు, జల, శబ్దరూపాల్లో వివిధ కాలుష్య కారకాలు ఎక్కువ అవుతున్నాయని గణాంకాలు చెపుతున్నాయి. ప్రధానంగా ఆధునిక జీవన విధానాల్లో వస్తున్న మార్పులకు అనుగుణంగా మానవుని అవసరాల కోసం ప్రకృతిలో మితిమీరిన స్వార్థపూరిత విధానాలను వినియోగిస్తున్న తీరు అవలంబిస్తున్న పద్ధతులు చాలావరకు పరిసరాల చుట్టూఉన్న పర్యావరణాన్ని పరిరక్షించే రీతిలో లేకుండా ఉండటం ఒక ఎత్తు అయితే పర్యావరణ సమతుల్యంపై కాలుష్యం నియంత్రణపై శ్రద్ధ వహించకపోవడం మరొక ఎత్తు అవుతుందేమో అనిపిస్తుంది. మారుమూల గ్రామీణ ప్రాంతాలు సైతం ఆధునిక పోకడలు సంతరించుకుంటున్న తరుణంలో వ్యవసాయ పద్ధతిలో వినియోగిస్తున్న అనేక రకాలైన కృత్రిమ రసాయన ఎరువుల వాడకంతో పాటు వాహనాల రద్దీ కూడా ఎక్కువ కావడం పెట్రోల్ డీజిల్ లాంటి ఇంధనాలు అవసరాలు పెరిగిపోయి విరివిగా ఇంధనాల నుండి వస్తున్నటువంటి విషపూరిత రసాయనాలు, వ్యర్థాలు వాతావరణంలో పొగ రూపంలో కలిసిపోతుండడం సర్వసాధారణమైపోతున్నది.సమాజంలోని మానవులు అవసరాలకు మించి వన సంరక్షణ లాంటి ప్రదేశాల్లోని చెట్లను ఇష్టం వచ్చినట్లు నరికి వేస్తూ వాటిని నివాస ప్రాంతాలుగా మారుస్తున్న సందర్భాల్లో పర్యావరణ పరిరక్షణకు దోహదపడే చెట్లను తిరిగి పెంచకుండా పర్యావరణ పరిరక్షణపై నిర్లక్ష్య వైఖరి వహిస్తున్న తీరుతో మానవ ఆధునిక జీవన విధానాల్లో నిరంతరం వెలువడుతున్న విషపూరితమైన కార్బన్ డయాక్సైడ్ , కార్బన్ మోనాక్సైడ్ లాంటి క్లోరో ఫ్లోరోకార్బన్‌లు వాతావరణంలోకి విస్తరిస్తూ ఉండటం గమనార్హం. జీవావరణం చుట్టూ ఉన్న పరిసరాల్లోని స్వచ్ఛమైన వాతావరణాన్ని హరించే రీతిలో ఎప్పుడు పడితే అప్పుడు ఎక్కడ పడితే అక్కడ ఉంటున్న మోతాదుకు మించిన కలుషితమైన వ్యర్థాలను నిర్ణీత సమయంలో నిర్మూలించకపోవడం వల్ల కావచ్చేమోకానీ మానవుడు ప్రకృతి ప్రవృత్తికి భిన్నంగావ్యవహరించే తీరులో అడపాదడపా ప్రకృతి నుండి ప్రతిస్పందనగాప్రకృతి విలయతాండవం చేస్తున్న సందర్భాల్లో జనజీవనం అస్తవ్యస్తం అవుతున్న సంఘటనలు గోచరిస్తూనే ఉన్నాయి. ఈ క్రమంలో ప్రకృతిలో మానవుడు తన భౌతిక అవసరాలకు ఉపయోగించే విధానాలు కొంతవరకైనా పర్యావరణాన్ని నష్టపరిచే విధంగా ఉంటున్నాయా అనే సందేహాలు కలగక మానవు. పట్టణ పరిసర ప్రాంత పరిశ్రమల నుండి వాహనాల నుండి తరచుగా వెలువడుతున్న కార్బన్ డయాక్సైడ్, కార్బన్ మోనాక్సైడ్,సల్ఫర్ దయాక్సైడ్,నైట్రోజన్ ఆక్సైడ్, క్లోరోఫ్లోరో కార్బన్ లాంటి విషతుల్య పదార్థాలు ప్రత్యక్షంగా



పరోక్షంగా వాతావరణంలో కలిసి జీవావరణానికి హాని కలిగించే విధంగా తయారవుతున్నాయి. ఇంధన కాలుష్యాలు దుమ్ము ధూళి కణాలతో కలిసిపోతుండడం మానవాళికి కావాల్సిన ప్రాణవాయువు ఆక్సిజన్ శాతం క్రమక్రమంగా తగ్గిపోతుండటంతో తీవ్రమైన అనారోగ్య సమస్యలు ఏర్పడడమే కాకుండా కాలుష్య బారినపడి అనేక దీర్ఘకాలిక వ్యాధులకు లోను అవుతుండడం విచారకరం.ముఖ్యంగా పారిశ్రామిక ప్రాంతాల్లో పరిశ్రమల నుండి విడుదలవుతున్న వ్యర్థాలు, విష వాయువులు వాతావరణ కాలుష్యాన్ని, జల కాలుష్యాన్ని కలుగచేస్తూనే ఉన్నాయి. తద్వారా అనేక రకాలైనటువంటి బ్యాక్టీరియా వైరస్ లాంటి అతి సూక్ష్మమైన జీవులు మానవులకు హాని కలుగచేస్తూనే ఉన్నాయి. ఈగలుదోమలు వ్యర్థపదార్థాలు పై సంచరిస్తూ అనారోగ్యాలకు ఉపకరణాలుగా మిగిలిపోతున్నాయి. పర్యావరణ పరిరక్షణ కాలుష్య నియంత్రణకు కాలుష్యంవల్ల కలిగే నష్టాలను, వచ్చే ఉపద్రవాలను అనర్థాల గురించి సరైన నిర్ణయాత్మక కార్యాచరణపై క్షేత్రస్థాయిలో సమాజంలోని కాలుష్య నియంత్రణ వ్యవస్థల్లో పౌరులను బాధ్యులుగా చేయవలసిన అవసరం ఎంతైనా ఉంది. మోతాదుకు మించిన వ్యర్థాలను కాలుష్య పదార్థాలను నియంత్రించుకునే విధానాలను ఆచరిస్తూపర్యావరణ పరిరక్షణకు తమ వంతు కర్తవ్యంగా సమాజంలోని ప్రతి పౌరులు విధిగా భావిస్తే తప్ప కాలుష్య నియంత్రణ సాధ్యం కాదేమో. ఆధునిక మానవ నాగరిక సమాజంలో పెట్రోల్ డీజిల్ లాంటి ఇంధన వనరులు అతిగా ఉపయోగించడం వల్ల కలిగే అనర్థాలను నివారించడానికి ప్రకృతి పర్యావరణానికి హాని కలిగించనిప్రత్యామ్నాయమైనటువంటి కాలుష్య రహిత సాంప్రదాయ పునరుత్పాదక శక్తి వనరులైన బయోమాస్, సౌరశక్తి జలశక్తి,పవన శక్తిని సమృద్ధిగా ఉపయోగించుకొని రానున్న రోజుల్లో పర్యావరణ పరిరక్షణకు ఆటంకం లేకుండా మానవులు అవసరాలను సులభతరం చేసుకోవచ్చు. ప్రభుత్వాలు కాలుష్య నియంత్రణ మండలి అనేకసార్లు అనేకరకాలుగా కాలుష్య నివారణపై శ్రద్ధ వహించే విధంగా పలు సూచనచేస్తున్నప్పటికీ, కొన్ని పరిశ్రమల నుండి విడుదలవుతున్నటువంటి కాలుష్య పదార్థాలు అంతే రీతిలో మానవాళికి అనర్థాలకు కలుగచేస్తూనే ఉన్నాయి. ఈ క్రమంలో పర్యావరణ పరిరక్షకులు కాలుష్య నిర్మూలనకు ఆధునిక సాంకేతికతను ఉపయోగించుకొని ప్రత్యామ్నాయ మార్గాలను ఎన్నుకునే విధంగా కొన్నిప్రాంతాల్లో ప్రయత్నాలు ప్రారంభం కావడం విశేషం.ఏది ఏమైనప్పటికీ కాలుష్య రహిత సమాజ నిర్మాణంలో మానవాళి సహకారం బాధ్యత అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. పరిశుభ్రత పారిశుధ్యం అనే అంశం కేవలం పారిశుద్ధ్య కార్మికులకు వదిలి వేయకుండా పూర్తిస్థాయిలో సమాజంలోని ప్రజల భాగస్వామ్యం పరస్పర సహకారంతో బాధ్యతగా ఆధునిక ధోరణితో పర్యావరణ పరిరక్షించే అనేక ప్రక్రియలను ఉపయోగించుకుని మొదట కాలుష్య రహిత పరిసరాలను ఏర్పరచుకున్న తర్వాతనే జీవన అవసరాలకు నిర్ణయాత్మక రూపకల్పన చేసుకునే విధంగా రానున్న రోజుల్లో కాలుష్య నిర్మూలనపై మరింత అవగాహన కలిగే పరిస్థితి ఉంటే మంచిదేమో.అదే విధంగా కాలుష్యనియంత్రణలో వృక్షసంపద కూడాఅత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది.అవసరమైన ప్రాంతాల్లో వృక్షాలను పెంచుకునే బాధ్యత కూడా మానవ సమాజంపైఉంది. అత్యధికశాతం అడవులను నరికివేస్తూ అనుకూలమైన సానుకూల జీవన విధానాలకొరకు అనేకరకాలైన టువంటి పద్ధతులను అవలంబిస్తున్న ఆధునిక మానవుడు అవసరమైతేతిరిగి చెట్లను నాటి వాటిని పెంచే విధంగా బాధ్యతను తీసుకుంటే రాబోవు కాలంలో మంచి వాతావరణంతో కూడిన పర్యావరణం ప్రకృతి మానవునికి మేలు చేసే విధంగా ఉంటుందని ఆశించడంలో సందేహం లేదు. ●

# విద్యావ్యవస్థను కాపాడవల్సింది గురువులే

పురుషోత్తం నారగౌని

ఒకప్పుడు సమాజంలో గురువు స్థానం దైవంతో సమానం. 'బ్రతుకు నేర్పేవాడే బడి పంతులు' అని అంతా నమ్మేవారు. కానీ, మారుతున్న కాలక్రమంలో, విలువల పతనంలో ఆ నానుడి మారుతూ వచ్చింది.నేడు చాలా మంది ఉపాధ్యాయులు బ్రతుకు నేర్పేవారిగా కాకుండా,తమ బ్రతుకు తాము చూసుకునే 'బ్రతుక నేర్చిన పంతులు'గా మారిపోతున్నారన్నది చేదు నిజం. భావి భారత పౌరులను తీర్చిదిద్దాల్సిన తరగతి గది, నేడు ఉపాధ్యాయుల హక్కుల పోరాట వేదికగా మారుతోందే తప్ప, విద్యా ప్రమాణాల పెంపుదల కేంద్రంగా మారడం లేదు. తాజాగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుతో రాష్ట్రంలోని వేలాది మంది ఇన్‌సర్వీస్ టీచర్లలో (వృత్తిలో కొనసాగుతున్నవారు) మొదలైన ఆందోళన, వారు చేస్తున్న డిమాండ్లు విద్యావ్యవస్థలోని లోపాలను మరోసారి బట్టబయలు చేశాయి. విద్యా హక్కు చట్టం (ఆర్‌టిఇ) ప్రకారం ఉపాధ్యాయులుగా కొనసాగాలంటే టెట్ (టీచర్ ఎలిజెబులిటీ టెస్ట్) అర్హత తప్పనిసరి అని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. అయితే, పదిహేను, ఇరవై ఏళ్లుగా ఉద్యోగంలో ఉన్న తాము ఇప్పుడు మళ్లీ పరీక్ష రాయడమేమిటని, తమకు మినహాయింపు ఇవ్వాలని ఉపాధ్యాయ సంఘాలు రోడ్డెక్కుతున్నాయి. ఇక్కడ సామాన్యుడికి వచ్చే సందేహం ఒక్కటే. దశాబ్దాల తరబడి విద్యార్థులకు పాఠాలు చెప్తున్న ఉపాధ్యాయులకు, తమ అర్హతను నిరూపించుకునే ఒక పరీక్ష రాయడానికి భయం ఎందుకు? ఇన్నేళ్ల అనుభవం ఉన్నవారికి ఆ పరీక్ష ఒక ప్రహసనం కావాలే తప్ప, గండం కాకూడదు కదా! సిలబస్‌లో తమకు సంబంధం లేని అంశాలు ఉన్నాయన్నది వారి వాదన. కానీ, మారుతున్న కాలానికి అనుగుణంగా తమను తాము అప్‌డేట్ చేసుకోలేనివారు, రేపటి తరం పిల్లలకు ఆధునిక విజ్ఞానాన్ని ఎలా అందించగలరు? అనే ప్రశ్నకు వారి వద్ద సమాధానం లేదు.కేవలం ఒకసారి ప్రభుత్వ ఉద్యోగం వచ్చిందంటేచాలు, ఇక జీవితాంతం ఎలాంటి పరీక్షలు లేకుండా, నాణ్యతతో సంబంధం లేకుండా నెట్టుకురావచ్చు అనే ధోరణి వ్యవస్థలో గూడుకట్టుకుపోయింది. వాస్తవానికి ఈ దుస్థితికి కేవలం



ఉపాధ్యాయులను మాత్రమే తప్పుబట్టలేం. ప్రభుత్వాల పాపం కూడా ఇందులో ఉంది. ఉపాధ్యాయులను బోధనకు మాత్రమే పరిమితం చేయాల్సిన ప్రభుత్వం, వారిని కుల గణన, ఎన్నికల డ్యూటీలు, పల్స్ పోలియో, మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ అంటూ రకరకాల పనులకు వాడుకుంటోంది. దీనివల్ల వారి ఏకాగ్రత దెబ్బతింటున్న మాట వాస్తవమే. పైగా పాఠశాలల్లో తనిఖీ వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యమైపోయింది. ఉపాధ్యాయుడు క్లాస్ రూమ్‌లో ఏం చెప్తున్నాడు? విద్యార్థులకు ఎంత అర్థమవుతోంది? అని పర్యవేక్షించే నాథుడే లేడు. దీనికి తోడు ఉపాధ్యాయ బదలీలు, ప్రమోషన్లలో రాజకీయ జోక్యం పెరిగిపోవడంతో బోధన కంటే పైరవీలకే ప్రాధాన్యత పెరిగింది. ఈ వాతావరణమే కొంతమంది ఉపాధ్యాయులను 'పని చేయకపోయినా పర్లేదు' అనే స్థాయికి దిగజార్చింది. ఫలితంగా ప్రభుత్వ బడుల్లో చదివే పేద విద్యార్థులు నష్టపోతున్నారు. ప్రైవేటు పాఠశాలలు లాభపడుతున్నాయి. ఇప్పుడు కేంద్ర విద్యాశాఖ, సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు ఎంతమంది టీచర్లకు టెట్ అర్హత లేదో వివరాలు కోరింది. రాష్ట్రంలో దాదాపు 40 వేల మందికి పైగా ఇలాంటి టీచర్లు ఉన్నట్లు అంచనా. వీరంతా ఇప్పుడు సుప్రీం కోర్టులో రివ్యూ పిటిషన్లు వేస్తూ, ప్రభుత్వాలపై ఒత్తిడితెస్తూ మినహాయింపు కోరుతున్నారు. కానీ ఇది సరైన పద్ధతి కాదు. వైద్యరంగంలో ఉన్న డాక్టర్లు ఎప్పటికప్పుడు కొత్త వైద్య విధానాలు నేర్చుకోవాలి, ఐటీ ఉద్యోగులు కొత్త టెక్నాలజీ నేర్చుకోవాలి. మరి సమాజాన్ని నిర్మించే ఉపాధ్యాయులు మాత్రం 'మాకు పాత చదువే చాలు, కొత్త పరీక్షలు వద్దు'అని భీష్మించుకు కూర్చోవడం ఎంతవరకు సమంజసం? 'వృత్తిలో సీనియారిటీ' అనేది గౌరవమే కానీ, అది 'నైపుణ్య లేమి'కి కవచంకాకూడదు. ఇప్పటికైనా ఉపాధ్యాయ లోకం ఆత్మవిమర్శ చేసుకోవాలి. తాము కేవలం జీతాలు తీసుకునే ఉద్యోగులం మాత్రమే కాదు, ఒక తరానికి దిక్సూచిలం అనే బాధ్యతను గుర్తించాలి. టెట్‌వంటి పరీక్షలను ఒక శిక్షగా కాకుండా, తమ సామర్థ్యాన్ని మెరుగుపరుచుకునే అవకాశంగా భావించాలి. ప్రభుత్వాలు కూడా కేవలం కోర్టు తీర్పుల అమలుకే పరిమితం కాకుండా, ఉపాధ్యాయులకు తగిన శిక్షణనిచ్చి, వారిని ఇతర పనుల నుంచి విముక్తి చేసి, కేవలం బోధనపైనే దృష్టి పెట్టేలాచూడాలి. లేదంటే, ప్రభుత్వ బడులు కేవలం భవనాలుగా మిగిలిపోతాయి తప్ప,భవిష్యత్తును నిర్మించే కర్మాగారాలుగా మారలేవు. విద్యా వ్యవస్థను కాపాడుకోవాల్సింది కోర్టులు కాదు, ఆ వ్యవస్థలో కీలకమైన గురువులే అని గుర్తించిన నాడు ఏ పరీక్షలూ వారికి అడ్డంకి కావు. ●

# మరొకసారి బయటపడిన అమెరికా దాష్టీకం

డాక్టర్ తిరుణహరి శేషు

నార్కో టెర్రరిజానికి పాల్పడుతున్నారనే నెపంతో అమెరికా అబ్జల్యూట్ రిసాల్వ్ ఆపరేషన్‌తో వెనుజులాపై దాడి చేసి ఆ దేశాధ్యక్షుడు నికోలస్ మదురోని అతని భార్య సిలిమా ఫ్లోరెస్‌ని బందీలుగా తీసుకపోవటంతో ప్రపంచ పోలీస్‌గా పిలవబడుతున్న అమెరికా దాని చర్యతో ప్రపంచమంతా నెవ్వెరపోయింది. అమెరికాలోకి డ్రగ్స్‌ని దిగుమతి చేస్తూ నార్కోటెర్రరిజాన్ని ప్రేరేపిస్తూ ఇంటర్నేషనల్ డ్రగ్స్ కేంద్రంగా వెనుజులా మారిందని ఆరోపిస్తూ మూడు కోట్లకు పైగా జనాభా గల దక్షిణ అమెరికా దేశమైన వెనుజులా దేశంపై అమెరికా డెల్టా ఫోర్స్‌దాడి చేయడంతో 2013 నుండి ఆ దేశాన్ని పాలిస్తున్న నికోలస్ మదురో పాలనకి తెరపడింది. పనామా సైనిక పాలకుడు ఆంటోనీయో నోరిగాను ఏ ఆరోపణలతో అమెరికా 1989లో బందీగా పట్టుకపోయిందో ఇప్పుడు అదే ఆరోపణలతో నికోలస్ మదురోని కూడా అమెరికా బందీగా పట్టుకొచ్చింది.మదురోపై అమెరికా చేస్తున్న ఆరోపణలు ఎలాఉన్నా అవి ఆదేశ అంతర్గత వ్యవహారాలకు సంబంధించినవి కాబట్టి అమెరికా ఎలా జోక్యం చేసుకుంటుంది. వెనుజులా పై అమెరికా చేపట్టిన చర్య అంతర్జాతీయ చట్టాలకి, న్యాయ సూత్రాలకి, ఐక్యరాజ్యసమితి నిబంధనలకి వ్యతిరేకంగానే ఉన్నాయి కదా! అమెరికా మదురోపై దాడికి చూపిస్తున్న కారణాల కంటే ఆ దేశంలో ఉన్న చమురు నిల్వలపై అమెరికా కన్నుపడటమే దాడి వెనుక ప్రధాన ఉద్దేశంగా కనపడుతుందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. 303బిలియన్ బ్యారెల్స్ చమురు నిక్షేపాలతో వెనుజులా చమురు నిల్వలలో ప్రపంచంలోనే మొదటి స్థానంలో ఉన్నది. వెనుజులా చమురు నిక్షేపాలు అమెరికా కంపెనీల చేతిలోనే ఉండేవి కానీ 1999లో హ్యూగో చావేజ్ అధికారంలోకి వచ్చిన తర్వాత చమురు నిక్షేపాలను జాతీయం చేయటంతో చమురు నిక్షేపాలపై అమెరికా ఆధిపత్యానికిగండి పడింది. 25 సంవత్సరాల క్రితం వెనిజులా చమురు నిక్షేపాలపై కోల్పోయిన ఆధిపత్యాన్ని తిరిగి సంపాదించాలంటే మదురో నాయకత్వంలోని యునైటెడ్ సోషలిస్టు పార్టీ ఆఫ్ వెనుజులానిఅధికారం నుండి తొలగించాలనే వ్యూహంలో భాగంమే మదురోని బందీగా తీసుకెళ్లడం.మదురోని బందీగా పట్టుకెళ్ళిన తర్వాత అక్కడ ఎవరు పాలించాలో మేమే నిర్ణయిస్తామని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలు చూస్తుంటే ఇరాక్ లో సద్దాం హుస్సేన్‌ని ఉరితీసి లిబియాలో కల్నల్ గడాఫీని చంపివేసి తమ కీలుబొమ్మ ప్రభుత్వాలను నిలబెట్టినట్లుగానే వెనిజులాలో కూడా తమ కీలుబొమ్మ ప్రభుత్వాన్ని ప్రతిష్టించి చమురు నిక్షేపాలను తమ ఆధీనంలోకి తెచ్చుకోవటమే అమెరికా వ్యూహంగా



కనిపిస్తుంది. దేశ ప్రజలలో మదురోపై ఉన్న వ్యతిరేకత అమెరికాకి కలిసి వచ్చింది. ప్రజల నుండి కానీ, సైన్యం నుండి కానీ పెద్దగా వ్యతిరేకత లేకుండానే అమెరికా మదురోని బంధించగలిగింది. బొలివేరియన్ విప్లవ నాయకుడైన హ్యూగో చావేజ్ ప్రభుత్వాన్ని కూలదోయటంలో విఫలమైన అమెరికా మదురో విషయంలో మాత్రం విజయం సాధించటానికి ప్రధాన కారణం మదురో వైఫల్యాలే. చమురు నిక్షేపాలను జాతీయ చేయటం ద్వారా వచ్చిన సంపదనివిద్యా, ఆరోగ్యం, గృహవసతి, పేదరిక నిర్మూలన లాంటి సౌకర్యాలపై ఖర్చు చేసి ఛావేజ్ ప్రజల మన్ననలు పొందగలిగారు కానీ చావేజ్‌కి భిన్నంగా మదురో ఎన్నికలలో అక్రమాలు చేసి గెలవటం, ప్రతిపక్ష నేతలను క్రూరంగా అణిచివేయటం తన పాలనలో ద్రవ్యోల్బణం, పేదరికం పెద్ద ఎత్తున పెరిగిపోతున్నా పట్టించుకోకపోవడంతో దేశీయంగా మదురోకి ప్రజల నుండి పెద్దగా మద్దతు దొరకకపోవటంతో అమెరికా సునాయసంగా తన పనిని చక్క పెట్టుకోగలిగింది.వెనుజులా ఉదంతంతో అమెరికా ద్వంద్వ వైఖరి మరొకసారి బట్టబయలైంది.తన అనుకూల దేశాలతో ఒక విధంగా వ్యతిరేక దేశాలతో మరొక విధంగా అమెరికా వ్యవహరిస్తుంది.ఇజ్రాయెల్, పాకిస్థాన్ లాంటి దేశాలకు కొమ్ము కాస్తూ వెనుజులాపై చేసిన ఆరోపణలాగే కొలంబియా, మెక్సికో, క్యూబా, డెన్మార్క్ లాంటి దేశాలపై కూడా చేస్తూ ఆ దేశాలను బెదిరించే ప్రయత్నాలు అమెరికా చేస్తుంది. అమెరికా వెనుజులా అధ్యక్షుడిని బంధీని చేసినట్లుగానే చైనా తైవాన్ అధ్యక్షుడిని, రష్యా ఉక్రెయిన్ అధ్యక్షుడిని బందీగా చేస్తే అప్పుడు అమెరికా వైఖరి ఎలా ఉంటుంది. తన మాట వినని బ్రెజిల్ పైన ఇండియా పైన ప్రపంచంలోనే అత్యధిక సుంకాలు విధించి అమెరికా మరొక విధంగా తన ఆధిపత్యాన్ని చలాయించే ప్రయత్నం చేస్తుంది. భారత్ రష్యా నుండి క్రూడ్ ఆయిల్‌ను దిగుమతి చేసుకుంటున్నందుకే భారత్‌పై అదనంగా 25శాతం సుంకాలను విధిస్తున్నామని ట్రంప్ చెబుతూ భారత్‌పై ఒత్తిడిపెంచే ప్రయత్నం చేస్తున్నారు. పాకిస్థాన్ కూడా భారత్‌లో ఉగ్రవాదాన్ని ఉసిగొల్పుతుంది మరి ఈ కారణంతో భారత్ పాకిస్థాన్‌పై ఆపరేషన్ సింధూర ప్రయోగిస్తే అమెరికా ఎందుకు జోక్యంచేసుకుంది.అణువస్త్ర ఆయుధాలు తయారు చేస్తున్నారనే నెపంతోఇజ్రాయిల్‌తో కలిసి ఇరాన్‌పై దాడులు చేస్తున్నారు. క్యూబాని కూడా బెదిరిస్తున్నారు తమ మాట వినని బ్రెజిల్ ఇండియాలపై పెద్దఎత్తున సుంకాలు విధిస్తున్నారు. ఉత్తర అట్లాంటిక్ మహాసముద్రంలో కరేబియన్ సముద్ర జలాలలో బెల్లా 1, సోఫియా బెల్లా 1చమురు నౌకలను అమెరికా తన ఆధీనంలోకి తీసుకొని రష్యాపై కూడా కాలు దువ్వుతుంది కాబట్టే అమెరికా ఆర్థికవేత్త జఫ్రీశాక్స్ అమెరికాని రోగ్ స్టేట్ (దూర్తదేశంగా)అభివర్ణిస్తూ ట్రంప్ ది మతిలేని దూకుడు ట్రంప్ అదుపు తప్పారని విమర్శిస్తున్నారు. వెనుజులా పట్లఅమెరికా వ్యవహరించిన విధంగానే బలమైన దేశాలు బలహీన దేశా లపైన ఈ విధమైన చర్యలు చేపట్టుకుంటూ రాజరికపు ఆన వాళ్ళైన అశ్వమేధయాగాలు చేసుకుంటూపోతే నానాజాతి సమితి వైఫల్యం రెండవ ప్రపంచ యుద్ధానికి దారి తీసినట్లుగానే ఐక్యరాజ్యసమితి వైఫల్యం మూడవ ప్రపంచ యుద్ధానికి దారి తీస్తే ఆ పరిణామాలకి అమెరికానే బాధ్యత వహించాలి. ●

# ప్రజావాక్కు



### తెలుగు సబ్జెక్టు తప్పనిసరి

ఈమధ్యతెలుగు మహాసభలు, నిర్విఘ్నంగా నిర్వహించబడ్డాయి. సభకు హాజరైన ఆహ్వానితులు తెలుగు భాష ఔనత్యాన్నిగురించి ఏకరువు పెడుతూ పెద్దపెద్ద ఉపన్యాసాలు యిచ్చారు,వెళ్ళారు.తెలుగు పాఠ్యాంశాలు తప్పక అన్ని విద్యాలయాలలో అమలు చేయాలని ఎవరైనా చెప్పారా?ఆంగ్లభాషమీదమోజు మెకాలే మహానుభావుడి దయవల్లదినదినప్రవర్ధమానమవుతున్నది. ఇంతగా పాతుకుపోయిన ఈజాడ్యం ఇప్పుడు పొమ్మంటే పోతుందా? దేశ భాషలందు తెలుగు లెస్స అనీ, దీన్ని ఇటాలియన్ ఆఫ్ దిఈస్ట్‌అనిఅంటారనీ లోకోక్తి. తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ స్కూళ్లలో కూడా ఓ తెలుగు సబ్జెక్టు బోధనను తప్పనిసరి చేయాలి.

- ఎన్.రామలక్ష్మి,సికింద్రాబాద్

### సుంకాల బెడద

అమెరికా సుంకాలు బెడదతో ఎగుమతి ఆధారిత ఆర్థిక వ్యవస్థలు కలిగిన రాష్ట్రాలలో ఉద్యోగాలు పోయే పరిస్థితి ఉంది. ముఖ్యంగా వస్త్రపరిశ్రమకు బారి దెబ్బతగిలే అవకాశంఉంది. దాదాపు 32శాతం ఎగుమతులు అమెరికాకు తమిళనాడు నుండి జరుగుతాయి.అయితే ఇప్పుడు కావాల్సిందిసబ్సిడీలు ముడి సరుకులమీద సబ్సిడీలు ఇవ్వడం యూరప్‌నుఅమెరికాకు బదులుగా మార్కెట్‌గా మార్చడం బ్రిటిష్ కాలం నాటి చారిత్రక నేపథ్యాన్ని మళ్ళీ పునరుద్ధరించడం చేయాలి. వ్యవసాయ రంగం తరవాత చేనేత రంగంమాత్రమే దేశంలో అతిపెద్దరంగంగా ఉన్న నేపథ్యంలో సబ్సిడీలు ఇవ్వడం ద్వారా చేనేత రంగం కుప్పకులకుండా కాపాడడం కేంద్ర ప్రభుత్వం తక్షణ కర్తవ్యం.

- భారత అవినాష్, జనగామ

### కోతుల బెడద

గ్రామాల్లో, పట్టణాలలో కూడా కోతుల బెడద ఎక్కువ అయింది. తోటలలో రైతులు గ్రామాల వైపు గ్రామంలో నుండి తోటలవైపు వాటిని మళ్లిస్తున్నారు. సర్పంచ్ ఎన్నికల ముందు అభ్యర్థులు వాటిని పంపి మెప్పుపొందారు. గెలిచాక ఎవరు పట్టించుకోవడం లేదు. వాటికి ఆహారం లేక ఇండ్లలోకి వస్తున్నాయి. కోతుల బెడద వల్ల కొందరు చనిపోయారుఅన్నవార్తలువస్తున్నాయి.ఇకనైనా ప్రభుత్వం కోతుల బెడదని తగ్గించేందుకుచర్యలు తీసుకోవాలి.

- అగస్త్య, కరీంనగర్

### జీవితాలను మారుస్తున్న సాంకేతికత

డిజిటల్ విప్లవం మన జీవనశైలిని సులభతరం చేసినప్పటికీ, మానవ సంబంధాల మధ్య పెను మార్పులను తీసుకువచ్చింది. ప్రపంచం మన గుప్పిట్లోకి చేరిందన్న సంతోషంలో, పక్కనే ఉన్నమనుషులకి మనం దూరమవుతున్నాం. ఒకేగదిలో ఉన్నా, భోజనటేబుల్ వద్దకూర్చున్నా సంభాషణల కంటే మొబైల్ నోటిఫికేషన్లకే ప్రాధాన్యత ఇస్తున్నాం. స్నేహితులతో ముఖాముఖి కలిసే సందర్భాలను వీడియో కాల్స్,ఎమోజీలు భర్తీ చేస్తున్నాయి, దీనివల్ల భావోద్వేగాల్లో లోతు తగ్గి సామాజిక వియోగం ఏర్పడుతోంది. వందల కొద్దీ సోషల్ మీడియా స్నేహితులు ఉన్నా, మనసు విప్పి మాట్లాడుకునే వారు కరువవుతున్నారు. సాంకేతికత మనల్ని అనుసంధానించే సాధనంగా ఉండాలి తప్ప, మన జీవితాలను శాసించే శక్తిగా మారకూడదు.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### సోమనాథ్ - నాగరిక ధైర్యానికి ప్రతీక

సోమనాథ్ ఆలయం భారత నాగరికతకు, ఆధ్యాత్మిక వారసత్వానికి ప్రతీకగా నిలుస్తూ శతాబ్దాల చరిత్రను తనలో దాచుకుని ఉంది. ఈఆలయం ఎన్నోవిధ్వంసాలను ఎదుర్కొన్నప్పటికీ, ప్రతిసారి పునర్నిర్మాణంతో తిరిగి లేచి నిలబడటం భారత సమాజంలోని ఆత్మవిశ్వాసం, ధైర్యం, సంస్కృతిపట్ల ఉన్న అచంచలమైన నిబద్ధతను స్పష్టంగా చాటిచెబుతుంది. అందుకే సోమనాథ్‌ను నాగరిక ధైర్యానికి ప్రతీక‌గా అభివర్ణించడం చారిత్రకంగా సముచితమైన వ్యాఖ్యగా భావించాల్సి ఉంటుంది. వారసత్వ పరిరక్షణకు అత్యున్నత ప్రాధాన్యంఇస్తూ, ఆధునిక సదుపాయాలను సమతుల్యంగా కలపాల్సిన బాధ్యత పాలకులపై ఉంది.అలా జరిగినప్పుడే ఈ అభివృద్ధి ప్రయత్నాలు సార్థకతను పొందుతాయి.

- తిప్పర్తి శ్రీనివాస్, చొప్పదండి

### మాతృభాషని కాపాడుకుందాం

మాతృభాష మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక.ఇంట్లో తల్లిదండ్రులు తెలుగులోనే మాట్లాడితే పిల్లలు కూడా సహజంగా తెలుగును నేర్చుకుంటారు.పిల్లల మనసుల్లో భాషపై ప్రేమ, గౌరవం పెరుగుతుంది.ఇతర భాషలు నేర్చుకోవడం అవసరమే అయినా మాతృభాషను మరిచిపోవడం మంచిది కాదు.తెలుగులో మాట్లాడడం, చదవడం, రాయడం అలవాటు చేసుకోవాలి.మన భాషను మనమే కాపాడుకుంటేనే దాని ఉనికి నిలుస్తుంది.అందరు తెలుగు పరిరక్షణకు కృషి చేయాలి.

-నిమ్మగడ్డ కృష్ణ, హైదరాబాద్

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# డిజిటల్ అరెస్టుల కట్టడికి కమిటీ

## హోంశాఖ ప్రత్యేక కార్యదర్శి నేతృత్వంలో ఏర్పాటు
## సుప్రీంకోర్టుకు నివేదన.. నెలలోగా నివేదిక

**న్యూఢిల్లీ, జనవరి 13:** డిజిటల్ అరెస్ట్ మోసాలను అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం రంగంలోకి దిగింది. ఈ స్కామ్‌ల ద్వారా వృద్ధులు, యువత, బలహీన వర్గాల ప్రజల నుండి వేలాది కోట్ల రూపాయల కష్టార్జితాన్ని దోచుకున్నారు. దేశవ్యాప్తంగా డిజిటల్ అరెస్టుల సమస్యకు సంబంధించిన అన్ని కోణాలను క్షుణ్ణంగా పరిశీలించేందుకు కేంద్ర హోంమంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఒక అత్యున్నత స్థాయి అంతర్ విభాగాల కమిటీని ఏర్పాటు చేసింది. హోంశాఖ ప్రత్యేక కార్యదర్శి నేతృత్వంలో ఈ కమిటీ పనిచేస్తున్నది. ఇందులో టెలికం, విదేశాంగ శాఖ, ఆర్థిక, న్యాయ, వినియోగదారుల వ్యవహారాల శాఖలు, ఆర్‌బిఐ అధికారులతోపాటు సిబిఐ, ఎన్ఐఎ, ఢిల్లీ పోలీసుల ఐజీ స్థాయి అధికారులు సభ్యులుగా ఉంటారు. గత ఏడాది డిసెంబర్ 26న ఏర్పాటు చేయగా, ఈ కమిటీ ఇప్పటికే పలు సమావేశాలు నిర్వహించింది, వాటిలో తాజా సమావేశానికి గూగుల్, వాట్సాప్, టెలిగ్రామ్ మరియు మరిన్ని ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్‌ల ప్రతినిధులు హాజరయ్యారు. డిజిటల్ అరెస్ట్ కేసులపై సుప్రీంకోర్టు సుమోటోగా విచారణ చేపట్టిన నేపథ్యంలో మంగళవారం న్యాయస్థానానికి ప్రభుత్వం ఒక స్టేటస్ రిపోర్టు సమర్పించింది. డిజిటల్ అరెస్ట్ స్కామ్‌లను ఎదుర్కోవడానికి టెలికం, ఆర్‌బిఐ నుండి సమాచారం అందినట్లు అందులో పేర్కొంది. దేశంలో పెద్ద సంఖ్యలో ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న ఈ సమస్యను అంతం చేయడానికి మార్గం సుగమం చేసేందుకు అంతర్ విభాగ మంత్రిత్వ సంప్రదింపులు జరపాలని భారత ప్రధాన న్యాయమూర్తి సూర్య కాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ఆదేశించిన తర్వాత ఐడిసిని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ మరింత లోతుగా అధ్యయనం చేసేందుకు సమయం కోరింది. కమిటీ సభ్యుల నుంచి పూర్తి స్థాయి వివరాలు సేకరించి, వాటిపై చర్చించి, ఒక సమగ్ర నివేదికను కోర్టు ముందు ఉంచేందుకు తమకు ఒక నెల గడువు కావాలని కమిటీ సుప్రీం కోర్టును అభ్యర్థించింది. అందుకు న్యాయస్థానం అనుమతించింది. డిసెంబర్ 1న, డిజిటల్ అరెస్ట్ స్కామర్లు, వారి సహచరులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోర్టు సిబిఐని ఆదేశించింది. సైబర్ నేరాలకు సంబంధించిన మ్యూల్ ఖాతాలను తెరవడంలో ప్రమేయం ఉన్న బ్యాంకర్లపై అవినీతి నిరోధక దర్యాప్తు ప్రారంభించడానికి దర్యాప్తు సంస్థకు సర్వోన్నత న్యాయస్థానం "పూర్తి స్వేచ్ఛ" ఇచ్చిన విషయం తెలిసిందే.




# సుప్రీంకోర్టుకు చేరిన జననాయగన్ వివాదం

**న్యూఢిల్లీ, జనవరి 13:** తమిళ స్టార్ హీరో విజయ్ నటించిన జన నాయగన్ సినిమా సెన్సార్ వివాదం సుప్రీంకోర్టుకు చేరింది. ఈ చిత్రానికి సెన్సార్ సర్టిఫికెట్ జారీపై మద్రాస్ హైకోర్టు డివిజన్ బెంచ్ విధించిన స్టేను సవాల్ చేస్తూ నిర్మాణ సంస్థ కేవీఎన్ ప్రొడక్షన్స్ దాఖలు చేసిన స్పెషల్ లీవ్ పిటిషన్‌ను సుప్రీంకోర్టు విచారణకు స్వీకరించింది. ఈ పిటిషన్‌పై జనవరి 19న విచారణ జరుపుతామని ధర్మాసనం స్పష్టం చేసింది. జనవరి 9న విడుదల కావాల్సిన ఈ సినిమాకు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ (సిబిఎఫ్‌సి) నుంచి క్లియరెన్స్ లభించలేదు. దీంతో నిర్మాతలు మద్రాస్ హైకోర్టును ఆశ్రయించగా, సింగిల్ జడ్జి వెంటనే సర్టిఫికెట్ జారీ చేయాలని ఆదేశించారు. అయితే, కొద్ది గంటల్లోనే సెన్సార్ బోర్డు అప్పీలు చేయడంతో డివిజన్ బెంచ్ ఆ తీర్పుపై స్టే విధించింది. ఈ నేపథ్యంలో నిర్మాతలు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. నిజానికి, తొలుత ఈ సినిమాను చూసిన సెన్సార్ బోర్డు ఎగ్జామినింగ్ కమిటీ, కొన్ని మార్పులతో 'యు/ఎ-16ప్లస్' సర్టిఫికెట్ ఇచ్చేందుకు అంగీకరించింది. నిర్మాతలు ఆ మార్పులు చేసి సినిమాను మళ్లీ సమర్పించారు. కానీ, అదే కమిటీలోని ఒక సభ్యుడు సినిమాలోని కొన్ని సన్నివేశాలు మతపరమైన మనోభావాలను దెబ్బతీసేలా ఉన్నాయని, రక్షణ దళాలను తప్పుగా చిత్రీకరించారని ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు ఆధారంగా సీబీఎఫ్‌సీ ఛైర్‌పర్సన్ సినిమాను రివైజింగ్ కమిటీకి పంపడంతో విడుదల ప్రక్రియ నిలిచిపోయింది. ఈ సినిమాపై సుమారు రూ. 500 కోట్లు పెట్టుబడి పెట్టినట్లు నిర్మాతల తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. మరోవైపు, ఈ వివాదంలో తమ వాదనలు వినకుండా ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వొద్దని కోరుతూ సెన్సార్ బోర్డు సుప్రీంకోర్టులో కేవియట్ పిటిషన్ దాఖలు చేసింది. జనవరి 19న సుప్రీంకోర్టు విచారణ తర్వాత ఈ సినిమా భవితవ్యంపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

# అందరికీ వికాసం 'బ్రిక్స్' లక్ష్యం



### - విదేశాంగ మంత్రి జైశంకర్
### - బ్రిక్స్ 2026 లోగో ఆవిష్కరణ

**న్యూఢిల్లీ, జనవరి 13:** బ్రిక్స్ 2026కు భారత్ అధ్యక్షత వహిస్తోంది. ఈ నేపథ్యంలోనే కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ మంగళవారం ఢిల్లీలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో బ్రిక్స్ 2026 లోగో, అధికార వెబ్‌సైట్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి జైశంకర్ మాట్లాడుతూ, "ఈ ఏడాది బ్రిక్స్ కూటమి సారథిగా ప్రపంచ సంక్షేమానికి తొలి ప్రాధాన్యం ఇస్తాం, కూటమిలోని అన్ని దేశాలను కలుపుకుపోయి ప్రపంచ సంక్షేమానికి కృషి చేస్తాం, అందరికీ వికాసం అనే లక్ష్యంతో ఈసారి బ్రిక్స్ సదస్సు నిర్వహిస్తున్నాం" అని వివరించారు. "ప్రస్తుతం ప్రపంచ దేశాల్లో సంక్లిష్ట పరిస్థితులు నెలకొన్నాయి. భౌగోళిక రాజీకయ అనిశ్చితులు, చాలా దేశాల నడుమ అస్థిర పరిస్థితులు నెలకొన్నాయి. ఆర్థిక సంక్షోభాలూ కనిపిస్తున్నాయి. ఈ పరిణామాల ప్రభావం ప్రపంచ దేశాలపై పడుతోంది" అని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ప్రపంచంలో కీలకమైన కూటమిగా బ్రిక్స్ ప్రాధాన్యం, బాధ్యత పెరుగుతున్నాయి. తాము సంప్రదింపులను, సహకారాన్ని, ఆచరణాత్మక స్పందనను ప్రోత్సహిస్తాం. ఇక ఇదే సమయంలో దేశాల వికాసం, జాతీయ ప్రయోజనాలపైనా ఫోకస్ పెడతాం" అని విదేశాంగ మంత్రి జైశంకర్ వివరించారు. ఈ ఏడాది ఆగస్టు లేదా సెప్టెంబరులో భారత్ వేదికగా బ్రిక్స్ సదస్సు జరిగే అవకాశాలు ఉన్నాయని సూచనప్రాయంగా వెల్లడించారు. జి20 సదస్సు నిర్వహణలో అనుసరించిన విధానాన్నే ఈసారి బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశాలకు అనుసరించనున్నట్లు తెలుస్తోంది. 28 రాష్ట్రాలు, తొమ్మిది కేంద్రపాలిత ప్రాంతాలలో సమావేశాలను నిర్వహించనుంది. బ్రిక్స్ నేతల శిఖరాగ్ర సమావేశంతోపాటు 60 నగరాల్లో మంత్రులు, ఫోరమ్‌లు, వర్కింగ్ గ్రూపులతో సహా దాదాపు 100 ఇతర సమావేశాలు జరుగుతాయని అధికారులు చెబుతున్నారు. విదేశాంగ మంత్రుల రెండు సమావేశాలు, ఒకటి జాతీయ భద్రతా సలహాదారుల స్థాయిలో, నాలుగైదు షెర్పా లేదా సౌస్ షెర్పా సమావేశాలు, దాదాపు 20 మంత్రివర్గ సమావేశాలు జరిగే అవకాశముంది. దేశ రాజధానితోపాటు బెంగళూరు, హైదరాబాద్, చెన్నై, చండీగఢ్, అహ్మదాబాద్, లక్నో వంటి నగరాల్లో కొన్ని కీలక మంత్రివర్గ సమావేశాలు నిర్వహించనున్నారు.

# భారత్‌లో ఆరోగ్య ఉపద్రవంగా 'డయాబెటిస్'

**న్యూఢిల్లీ, జనవరి 13:** ఆరోగ్య సంక్షోభంగా పరిణమించిన మధుమేహం భారత్ పాలిట ఆర్థిక భారంగా మారుతోంది. డయాబెటిస్ కారణంగా అత్యధిక ఆర్థిక నష్టాన్ని చవి చూస్తున్న దేశాల జాబితాలో భారత్ ప్రపంచంలోనే రెండో స్థానంలో నిలిచిందని అంతర్జాతీయ పరిశోధనలో వెల్లడైంది. దేశ ఆర్థిక వ్యవస్థపై ఏకంగా 11.4 ట్రిలియన్ డాలర్ల భారం పడుతోందని ఇంటర్నేషనల్ ఇనిస్టిట్యూట్ ఫర్ అప్లైడ్ సిస్టమ్స్ అనాలసిస్, వియన్నా యూనివర్సిటీ పరిశోధకులు స్పష్టం చేశారు. మధుమేహం వల్ల పడే ఆర్థిక ప్రభావాన్ని 2020 నుంచి 2050 వరకు విశ్లేషిస్తూ 204 దేశాలపై ఈ అధ్యయనం నిర్వహించారు. ఇందులో 16.5 ట్రిలియన్ డాలర్లతో అమెరికా మొదటి స్థానంలో ఉండగా, 11.4 ట్రిలియన్ డాలర్లతో భారత్ రెండో స్థానంలో, 11 ట్రిలియన్ డాలర్లతో చైనా మూడో స్థానంలో ఉన్నాయి. ప్రపంచం లోని మొత్తం బాధితుల్లో నాలుగో వంతు మంది భారత్‌లోనే ఉండటం ఈ తీవ్రతకు ప్రధాన కారణంగా నిలుస్తోంది. మధుమేహం వల్ల దేశాల జీడీపీలో 1.7 శాతం మేర అనధికార సంరక్షణ వ్యయం రూపంలో వృథా అవుతోందని పరిశోధకులు గుర్తించారు. ముఖ్యంగా క్యాన్సర్, అల్జీమర్స్ వంటి ప్రాణాంతక వ్యాధుల కంటే మధుమేహం వల్లే ఆర్థిక వ్యవస్థకు ఎక్కువ నష్టం వాటిల్లుతోందని వారు హెచ్చరిస్తున్నారు. మధుమేహం కారణంగా పని ఉత్పాదకత తగ్గడం, వైద్యం కోసం భారీ గా ఖర్చు చేయాల్సి రావడం ప్రజల ఆదాయాన్ని గణనీయంగా తగ్గిస్తోంది. ఈ ఆర్థిక సంక్షోభం నుంచి గట్టెక్కాలంటే ప్రజల్లో ఆరోగ్య కరమైన జీవనశైలిపై అవగాహన పెంచాలని పరిశోధకులు సూచిస్తున్నారు. వ్యాధిని ముందస్తుగా గుర్తించేందుకు అందరికీ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించాలన్నారు.

# షక్సాగామ్ ఒప్పందం చట్టవిరుద్ధం

### ఆర్మీచీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది




**న్యూఢిల్లీ,జనవరి 13:** కశ్మీర్ సమీపంలోని షక్సాగామ్ వ్యాలీ తమ దేశంలో భాగమని చైనా చేసిన వాదనను భారత్ మరోసారి ఖండించింది. షక్సాగామ్ లోయను పాకిస్థాన్, చైనాకు అప్పగించటానికి సంబంధించి 1963లో ఇరు దేశాల మధ్య జరిగిన ఒప్పందం చట్టవిరుద్ధమని భారత ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది స్పష్టం చేశారు. షక్సాగామ్ లోయ తమకే చెందుతుందని ఇటీవల చైనా పేర్కొంది. ఆ ప్రాంతంలో మౌలిక సదుపాయాల నిర్మాణాన్ని చేపట్టడంలో తాము పూర్తిగా సరైన మార్గంలోనే ఉన్నామని తెలిపింది. ఈ నేపథ్యంలో భారత ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది ఈ విధంగా స్పందించారు. షక్సాగామ్ లోయను చైనాకు అప్పగిస్తూ బీజింగ్‌తో పాకిస్థాన్ చేసుకున్న ఒప్పందం చెల్లదని ఆయన తేల్చి చెప్పారు. ఆ ప్రాంతంలో జరిగే ఏ కార్యకలాపాలను కూడా తాము గుర్తించబోమని అన్నారు. చైనాపాకిస్థాన్ ఆర్థిక కారిడార్‌ను ఆ రెండు దేశాలు సంయుక్తంగా చేస్తోన్న చట్టవిరుద్ధమైన చర్యగా తాము పరిగణిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. షక్సాగామ్ లోయ కీలకమైన కారకోరమ్ రహదారిలో ఉంది. స్వాతంత్రం వచ్చిన తర్వాత పాకిస్థాన్ దీనిని ఆక్రమించి, ఆపై చైనాకు ధారాదత్తం చేసింది. భారత్‌కు చెందిన ప్రాంతాన్ని ఆక్రమించుకుని మరో దేశానికి ఇవ్వడం అంతర్జాతీయ చట్టాల ప్రకారం విరుద్ధం. ఆక్రమించుకున్న ఈ లోయ ద్వారానే చైనాపాకిస్థాన్ మధ్య రహదారి సౌకర్యం ఏర్పడింది. దీని మీదుగానే చైనా, పాకిస్థాన్ ఆర్థిక కారిడార్‌ను నిర్మిస్తున్నారు. షక్సాగామ్ లోయ ప్రాంతంలో చైనా చేపట్టిన అభివృద్ధి పనులపై ఈ నెల 9న భారత్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. పాకిస్థాన్‌చైనా పేర్కొంటున్న 1963 నాటి సరిహద్దు ఒప్పందాన్ని తాము ఎప్పటికీ గుర్తించబోమని భారత్ స్పష్టం చేసింది. షక్సాగామ్ లోయ తమ దేశంలో భాగమేనని భారత్ పునరుద్ఘాటించింది. దీనిపై చైనా స్పందిస్తూ, ఆ ప్రాంతం తమ దేశంలో భాగమేనని, అక్కడ తాము చేపడుతున్న అభివృద్ధి పనులపై భారత్ అభ్యంతరం చెప్పడానికి అవకాశం లేదని వాదించింది.

# జనవరి 13 పాతికేళ్లు పూర్తయ్యాయా.. మీ శిక్షాకాలాన్ని ఎలా లెక్కిస్తున్నారు?

### అబూ సలెంను ప్రశ్నించిన సుప్రీంకోర్టు

**న్యూఢిల్లీ, జనవరి 13:** తాను భారత్‌లో 25 ఏళ్ల జైలు శిక్ష పూర్తిచేసుకున్నానని 1993 నాటి ముంబయి వరుస పేలుళ్ల కేసులో దోషిగా తేలిన గ్యాంగ్‌స్టర్ అబూసలెం పేర్కొనడాన్ని సుప్రీం కోర్టు ప్రశ్నించింది. 2005 నవంబరులో అతడు అరెస్టయిన సంగతిని గుర్తు చేసింది. అలాంటప్పుడు శిక్షాకాలాన్ని ఏ విధానంలో లెక్కిస్తున్నారని, శిక్ష తగ్గింపు కాలాన్ని కూడా పరిగణనలోకి తీసుకుంటున్నారా అని జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాల ధర్మా సనం ప్రశ్నించింది. ముంబయి పేలుళ్ల కేసులో మరణశిక్ష గానీ, పాతికేళ్లకు పైగా జైలుశిక్షకానీ విధించబోమన్న హామీపై అబూ సలెంను పోర్చుగల్ నుంచి భారత్ 2005 నవంబర్ 11న వెనక్కి రప్పించింది. సత్ప్రవర్తన కారణంగా తగ్గించే శిక్షాకాలాన్ని కలుపుకుని చూస్తే భారత్‌లో ఇప్పటికే తాను 23 ఏళ్ల జైలు జీవితాన్ని పూర్తి చేసుకున్నట్లవుతుందని, కాబట్టి తనను విడుదల చేయాలని అతడు తొలుత బాంబే హైకోర్టును ఆశ్రయించాడు. శిక్షాకాలం పూర్తయినట్లు కనిపించడంలేదంటూ ఆ వినతిని ఉన్నత న్యాయస్థానం నిరుడు జులైలో తోసిపుచ్చడంతో సుప్రీం తలుపు తట్టాడు. అయితే అబూ సలెం టాడా చట్టం కింద దోషిగా తేలిన సంగతిని జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాల ధర్మాసనం గుర్తుచేసింది. శిక్ష తగ్గింపును ఆ చట్టం అనుమతిస్తుందా అని సందేహం వ్యక్తం చేసింది. దీంతో సంబంధిత నిబంధనలను ధర్మాసనం ముందు ఉంచుతానని అబూ సలెం తరఫు న్యాయవాది విన్నవించారు. అందుకు రెండు వారాల గడువు ఇచ్చి తదుపరి విచారణను ఫిబ్రవరి 9కి వాయిదా వేసింది. ముంబయికి చెందిన ప్రదీప్ జైన్ అనే బిల్డర్‌ను 1995లో హత్య చేసిన మరో కేసులో అబూ సలెంకు ప్రత్యేక టాడా కోర్టులో 2015 ఫిబ్రవరిలో జీవిత ఖైదు విధించారు.

# కెనడాలో భారీ బంగారం దోపిడీ కేసు..

### కీలక నిందితుడు భారత్‌లో!



**ఒట్టావా, జనవరి 13:** కెనడాలోని టొరంటో ఎయిర్‌పోర్టులో బంగారంతో ఉన్న ఓ కంటైనర్‌ను మూడేళ్ల క్రితం కొందరు దుండగులు దోపిడీ చేశారు. ఈ కేసులో ముమ్మర దర్యాప్తు చేస్తోన్న కెనడా పోలీసులు తాజాగా ఓ నిందితుడిని అరెస్టు చేశారు. అతడి పేరు అర్సలాన్ చౌదరీ అని వెల్లడించారు. అతడికి ఓ చిరునామా అంటూ ఏమీ లేదని, దుబాయి నుంచి టొరంటో పియర్సన్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టులో దిగగానే అరెస్టు చేసినట్లు చెప్పారు. అయితే ఈ కేసులో కీలక నిందితుడు సిమ్రన్‌ప్రీత్ పనేసర్ భారత్‌లోనే ఉన్నట్లు సమాచారం. 2023 ఏప్రిల్‌లో స్విట్జర్లాండ్ నుంచి ఓ కార్గో విమానం టొరంటో ఎయిర్‌పోర్టులో దిగింది. అందులోని ఓ కంటైనర్‌లో 400 కిలోల బరువైన 6,600 బంగారు కడ్డీలు ఉన్నాయి. అప్పట్లో వాటి విలువ 20 మిలియన్ కెనడియన్ డాలర్లు. బంగారంతోపాటు కంటైనర్‌లో 2.5 మిలియన్ కెనడియన్ డాలర్ల నగదు కూడా ఉంది. టొరంటోలోని ఓ బ్యాంక్‌లో భద్రపర్చేందుకు వీటిని తీసుకొచ్చారు. విమానం దిగగానే కంటైనర్‌ను ఎయిర్‌పోర్టులోని వేర్‌హౌస్ ఫెసిలిటీలో భద్రపర్చారు. అయితే, ఆ మరుసటి రోజు పోలీసులు వెళ్లి చూడగా.. కంటైనర్‌లోని బంగారం, నగదు మాయమైంది. కెనడా చరిత్రలోనే అతిపెద్ద దోపిడీగా అప్పట్లో ఈ ఘటన పెను సంచలనం సృష్టించింది. దీనిపై పోలీసులు దర్యాప్తు చేపట్టగా నకిలీ పత్రాలతో వేర్‌హౌస్‌లోని సిబ్బందే దాన్ని మాయం చేసినట్లు తెలిసింది. ఘటన సమయంలో ఇద్దరు భారతీయులు సిమ్రన్‌ప్రీత్, పరంపాల్ సిద్ధు వేర్‌హౌస్ ఫెసిలిటీలో విధులు నిర్వర్తిస్తున్నారు. దీంతో పోలీసులు వీరిద్దరితో సహా 9 మందిపై కేసు నమోదు చేశారు. ఇప్పటికే పరంపాల్‌ను అరెస్టు చేయగా.. సిమ్రన్‌ప్రీత్ పరారీలో ఉన్నట్లు కెనడా పోలీసులు వెల్లడించారు. ఇప్పటివరకు ఆ బంగారాన్ని పోలీసులు గుర్తించలేదు. కొంత మొత్తం నగదును మాత్రం స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం.

# 'జననాయగన్'ను కేంద్రం అడ్డుకుంటోంది

### రాహుల్ గాంధీ ఫైర్.. ప్రధానిపై విమర్శలు



**న్యూఢిల్లీ, జనవరి 13:** ప్రముఖ నటుడు విజయ్ నటించిన జననాయగన్ సినిమా వివాదంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ స్పందించారు. ఈ సినిమాను కేంద్రం అడ్డుకుంటోందని ఆరోపించారు. తమిళ సంప్రదాయాలపై బిజెపి ప్రభుత్వం దాడి చేస్తోందని, విజయ్ సినిమా విడుదల కాకుండా కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వశాఖ అడ్డుకుంటోంది. అధి కారంతో తమిళ ప్రజల గొంతును నొక్కాలని ప్రధాని మోడీ ప్రయత్నిస్తున్నారు. అది ఎప్పటికీ సాధ్యం కాదు అని రాహుల్ విమర్శించారు. హెచ్.వినోద్ దర్శకత్వంలో రూపొందిన యాక్షన్ థ్రిల్లర్‌కు యు - ఎ సర్టిఫికెట్ ఇవ్వాలని సెన్సార్ బోర్డుకు మద్రాస్ హైకోర్టుసింగిల్ బెంచ్ ఆదేశాలు జారి చేసింది. కోర్టు ఉత్తర్వులను విజయ్ అభిమానులతో సహా చిత్ర బృందం ఊపిరి పీల్చుకుంది. ఆ ఆనందం ఎంతోసేపు నిలవలేదు. తీర్పును సవాల్ చేస్తూ సిబిఎఫ్‌సి మద్రాస్ హైకోర్టు డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించింది.


# ఉచితాలకంటే ప్రజల స్వయంసాధికారతకు ప్రాధాన్యం

### పిఎం సూర్యఘర్, పిఎం కుసుమ్ ఈ కోవలోనివే: కేంద్ర మంత్రి పియూష్‌గోయల్

**రాజ్‌కోట్, జనవరి 13:** ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఉచిత పథకాల పంపిణీ కంటే ప్రజలను వివిధ పథకాల సాయంతో సాధికారికంగా తీర్చిదిద్దడంపై విశ్వాసం తో ఉన్నట్లు కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ అన్నారు. పీఎం సూర్యఘర్, పీఎం కుసుమ్ వంటి పథకాల ఈకోవకు చెందినవేనని, వాటిని ప్రధాని స్వయంగా రూపొందించారని, అవి ఆయన ఆలోచనా విధానానికి ప్రతిబింబమని ఆయన పేర్కొన్నారు. గుజరాత్‌లోని రాజ్‌కోట్‌లో నిర్వహించిన వైబ్రంట్ గుజరాత్ రీజినల్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ ప్రజల భాగస్వామ్యం లేకుండా ప్రభుత్వాలు అందించే ఉచితాలపై ఆధారపడే విధానంపై ప్రధానికి నమ్మకం లేదని గోయల్ స్పష్టం చేశారు. ప్రభుత్వమే అన్నీ చేస్తుందన్న భావన తగ్గి, ప్రజలు కూడా బాధ్యత తీసుకునే విధంగా పథకాలు ఉండాలన్నదే ప్రధాని ఆలోచన అని తెలిపారు. పీఎం సూర్యఘర్ పథకం ద్వారా ప్రధాని మోదీ పౌరులకు సాధికారత కల్పించారని ఆయన తెలిపారు. ఈ పథకం కింద సౌర ఫలకాల ఏర్పాటు కోసం వినియోగదారుడు కూడా కొంత ఖర్చును భరించాల్సి ఉంటుందని, ఇలాంటి పథకాలలో ప్రజల వ్యక్తిగత భాగస్వామ్యం ఉండాలని ఆయన చెప్పారు. ప్రభుత్వమే అన్నీ చేయాలని ప్రజలు ఆశించకూడదని, ప్రభుత్వంపై పూర్తిగా ఆధారపడకూడదని ఆయన వ్యాఖ్యానించారు. ఒక పథకం విజయవంతంగా అమలవ్వాలంటే ప్రభుత్వ మద్దతుతో పాటు పౌరుల భాగస్వామ్యం అవసరమన్నారు.

## సంక్షిప్తంగా..

### ఇరాన్‌లో నిరసకారునికి మరణశిక్ష



టెహ్రాన్, జనవరి 13: ఇరాన్‌లో ప్రభుత్వ వ్యతిరేక నిరసనలు తీవ్ర రూపం దాల్చుతున్నాయి. ఆందోళనల్లో పాల్గొన్నందుకు అరెస్ట్ అయిన 26 ఏళ్ల ఎర్ఫాన్ సుల్తానీ అనే యువకుడికి ఉరిశిక్ష అమలు చేసేందుకు అధికారులు సిద్ధమవుతున్నట్లు మానవ హక్కుల సంఘాలు వెల్లడించాయి. దేశవ్యాప్తంగా జరుగుతున్న నిరసనలకు సంబంధించి మరణశిక్ష అమలు చేయడం ఇదే తొలిసారి కానుండటంతో సర్వత్ర ఆందోళన వ్యక్తమవుతోంది. టెహ్రాన్ సమీపంలోని కరాజ్ సబర్బ్‌లో నివసించే ఎర్ఫాన్ సుల్తానీని ప్రభుత్వ వ్యతిరేక ప్రదర్శనలో పాల్గొన్నందుకు ఈనెల 8న అరెస్ట్ చేశారు. కేవలం కొన్ని రోజుల్లోనే విచారణ ముగించి అతనికి మరణశిక్ష విధించారు. బుధవారం ఈ శిక్షను అమలు చేయనున్నట్లు అతని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు.

### బంగ్లాదేశ్‌లో హిందూ ఆటోడ్రైవర్ హత్య

**ఢాకా, జనవరి 13:** బంగ్లాదేశ్‌లో హిందూ మైనారిటీలపై దాడులు కొనసాగుతున్నాయి. ఇప్పటి వరకూ ఎనిమిది మంది హత్యకు గురి కాదా తాజాగా మరో హిందువును దారుణంగా కత్తులతో పొడిచి చంపారు. ఫెనీ జిల్లాలో సమీర్ దాస్ (27) అనే హిందూ ఆటో డ్రైవర్‌ను దుండగులు అత్యంత కిరాతకంగా నరికి చంపారు. దగన్‌భుయాన్ ఉపజిల్లాలోని జగత్‌పూర్ గ్రామ సమీపంలోని పంట పొలాల్లో ఆతడి మృతదేహం రక్తపు మడుగులో లభ్యమైంది. ఆదివారం సాయంత్రం సమీర్ దాస్ తన ఆటో రిక్షాతో ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. రాత్రయినా తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. సోమవారం ఉదయం పొలాల్లో మృతదేహాన్ని చూసిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. సమీర్‌ను నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి కత్తులతో పొడిచి చంపినట్లు తెలుస్తోంది.

### 'బంగ్లాలో హిందువులకు ప్రత్యేక పోలింగ్ బూత్ కావాలి'



**ఢాకా, జనవరి 13:** బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులు కొనసాగుతున్న నేపథ్యంలో.. ఆ దేశంలోని ప్రముఖ హిందూ సంఘం అక్కడి ఎన్నికల కమిషన్‌తో సమావేశమైంది. ఫిబ్రవరిలో పార్లమెంటరీ ఎన్నికలు జరగన్ను వేళ.. హిందూ ఓటర్లకు ఎన్నికల సంఘం అదనపు రక్షణ కల్పించాలని డిమాండ్ చేసింది. ప్రస్తుతం దేశంలో నెలకొన్న పరిస్థితుల్లో తమకు రక్షణ లేదని.. ముఖ్యంగా మైనారిటీలపై దాడులు జరుగుతోన్న ప్రాంతాల్లో కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని పేర్కొంది. సురక్షితమైన ఓటింగ్ కోసం తమకు ప్రత్యేక పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేసింది. బంగ్లాదేశ్ విద్యార్థి నాయకుడు ఉస్మాన్ హాదీ హత్యతో దేశంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న సంగతి తెలిసిందే. అప్పటి నుంచి హిందువులపై దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. ఇప్పటికే పలువురు ప్రాణాలు కోల్పోయారు.

# 'మిల్‌బస్' దెబ్బకు పాక్‌ను వీడుతున్న పరిశ్రమలు!



**ఇస్లామాబాద్, జనవరి 13:** పాకిస్తాన్ పారిశ్రామిక, ఆర్థికసేవలరంగంలో సైన్యం పెత్తనం మితిమీరిపోవడంతో విదేశీ సంస్థలు దేశంనుంచి నిష్క్రమిస్తున్నాయి. విదేశీ ఇన్వెస్టర్లుసైతం సైనిక పెత్తనం భరించలేక దేశంలో పెట్టుబడులు పెట్టేందుకు విముఖంగా ఉన్నారు. ఎఫ్‌ఎంసిజి దిగ్గజం ప్రాక్టర్ గ్యాంబుల్ పీఅండ్‌జి, ఇంధన రంగంలో ప్రసిద్ధి చెందిన షెల్, టోటల్ ఎనర్జీస్ వంటి సంస్థలు తమ కార్యకలాపాలను విక్రయించి వెళ్లిపోయాయి. టెక్నాలజీ దిగ్గజం మైక్రోసాఫ్ట్, ఫార్మా కంపెనీలు ఫైజర్, బేయర్, ఎలీ లిల్లీ, ఆటోమొబైల్ సంస్థ యమహా, రైడ్ షేరింగ్ యాప్‌లు ఉబెర్, కరీమ్, జర్మన్ ఇంజనీరింగ్ సంస్థ సీమెన్స్ కొనసాగలేమని చేతులెత్తేశాయి. గత మూడేళ్లలో ఫార్మా, టెక్ రంగాలకు చెందిన 21కి పైగా కంపెనీలు దేశాన్ని వీడటం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. దిగుమతులపై ఆంక్షల కారణంగా యమహా తన ఉత్పత్తిని నిలిపివేయాల్సి వచ్చింది. ఈ కంపెనీల వలసలకు అనేక ఆర్థిక, రాజకీయ కారణాలున్నాయి. పాకిస్థానీ కరెన్సీ విలువ పడిపోవడం, అధిక ద్రవ్యోల్బణం, విద్యుత్ కోతలు, బలహీనమైన వినియోగదారుల డిమాండ్ వంటివి కంపెనీల లాభాలను దెబ్బతీస్తున్నాయి. రాజకీయ అస్థిరత, పెరుగుతున్న ఉగ్రవాదం, శాంతిభద్రతల సమస్యలు వ్యాపారాలకు పెనుభారంగా మారాయి. అధికార జాప్యం, అవినీతి, తరచూ మారే పన్ను విధానాలు దీర్ఘకాలిక ప్రణాళికలను మారుస్తున్నాయి. 2023లో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు 1.2 బిలియన్ డాలర్లకు పడిపోయి, పదేళ్ల కనిష్ఠ స్థాయికి చేరాయి. ఈ సమస్యలన్నింటికీ మూల కారణం పాకిస్థాన్‌లో సైన్యం నడిపే సమాంతర ఆర్థిక వ్యవస్థ. దీనిని మిల్‌బస్ అని పిలుస్తున్నారు. రియల్ ఎస్టేట్, సిమెంట్, ఎరువులు, బ్యాంకింగ్ వంటి కీలక రంగాల్లో సైన్యం వేల కోట్ల డాలర్ల వ్యాపారాన్ని నిర్వహిస్తోంది. ఫౌజీ ఫౌండేషన్ వంటి సైనిక సంస్థలకు పన్ను మినహాయింపులు, నియంత్రణల నుంచి రక్షణ, ప్రభుత్వ కాంట్రాక్టులలో ప్రాధాన్యత లభిస్తున్నాయి. ఇవి విదేశీ కంపెనీలకు తీవ్ర నష్టం కలిగిస్తోంది. సమాన అవకాశాలు లేని ఈ రంగంలోకి ప్రవేశించడానికి విదేశీ పెట్టుబడిదారులు భయపడుతున్నారు. సైన్యం నేతృత్వంలోని స్ట్రాటజిక్ ఇన్వెస్ట్‌మెంట్ ఫెసిలిటేషన్ కౌన్సిల్(ఎస్ఐఎఫ్‌సి కూడా సైనిక అనుబంధ సంస్థలకే ప్రాధాన్యత ఇస్తుండటంతో పారదర్శకత పూర్తిగా లోపించిందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. మిలిటరైజ్డ్ కామర్స్ కారణంగా పాకిస్థాన్ పెట్టుబడులకు స్వర్గధామంగా కాకుండా, అత్యంత ప్రమాదకరమైన ప్రాంతంగా మారిపోయింది. పెట్టుబడిదారులు యూఏఈ, సింగపూర్ దేశాల వైపు చూస్తున్నారు.

### ఆర్‌ఎస్‌ఎస్ బిజెపి నేతలతో చైనా కమ్యూనిస్టుల భేటీ



**న్యూఢిల్లీ,జనవరి 13:** రాజధానిలోని ఆర్‌ఎస్‌ఎస్ కార్యాలయంలోచైనా కమ్యూనిస్టు ప్రతినిధిబృందం ఉన్నతస్థాయి ప్రతినిధులతో భేటీ అయింది. ఆర్‌ఎస్‌ఎస్‌లో సెకండ్ ఇన్ కమాండ్‌గా ఉన్న దత్తాత్రేయ హోసబాలేతో సమావేశం అయింది. చైనా అంతర్జాతీయ విభాగం పమంత్రి సన్ హైయాన్ అద్యక్షతన ఉన్న బృందం ఆర్‌ఎస్‌ఎస్ కార్యాలయంలో సుమారు రెండుగటలపాటు ఉన్నతస్థాయి ప్రతినిధులతో భేటీ అయింది. ఇది కేవలం మర్యాదపూర్వక కలయిక మాత్రమే అని ఇరువైపులా ప్రకటించారు. చైనీయులవైపునుంచే విజ్ఞప్తిరావడంతో ఆర్‌ఎస్‌ఎస్ మర్యాదపూర్వకంగా స్వాగతించిందని ఆర్‌ఎస్‌ఎస్ నేత అరుణ్‌సింగ్ తెలిపారు. 2014లో బిజెపి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తొలిసారి చైనా కమ్యూనిస్టు ప్రతినిధిబృందం ఆర్‌ఎస్‌ఎస్‌నేతలతో సమావేశం కావడం ఇదే ప్రథమం.

# బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్‌కు మరో అంతర్జాతీయ గౌరవం

## కొలంబియా బిజినెస్ స్కూల్‌లో ప్రసంగించాలని ఆహ్వానం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 13:** మాజీమంత్రి, బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి రామారావుకు అంతర్జాతీయ స్థాయిలో మరో ప్రతిష్ఠాత్మక ఆహ్వానం లభించింది. మంత్రిగా ఆయన హయాంలో చేసిన అసాధారణ కృషిని, తెలంగాణను ప్రపంచ పటంలో సమున్నత స్థాయిలో నిలిపిన తీరును గుర్తిస్తూ, అంతర్జాతీయ వేదికలపై తన ఆలోచనలను పంచుకోవాల్సిందిగా ఆయనకు ఆహ్వానం అందింది. సాంకేతికత, పాలన, సుస్థిర అభివృద్ధి, పట్టణ అభివృద్ధి, ఆర్థిక వృద్ధిపై ఆయనకున్న లోతైన అవగాహన ప్రపంచవ్యాప్తంగా విద్యా, విధాన నిర్ణేత, వ్యాపార వేదికలపై బలమైన ముద్ర వేసింది. ఈ క్రమంలో, న్యూయార్క్ నగరంలోని కొలంబియా బిజినెస్ స్కూల్(సిబిఎస్)లో ఏప్రిల్ 4, 2026న జరగనున్న 21వ వార్షిక ఇండియా బిజినెస్ కాన్ఫరెన్స్ (ఐబిసి)లో ప్రసంగించాలని కెటిఆర్‌కు ఆహ్వానం అందింది. ఈ సదస్సును నిర్వహించే విద్యార్థి విభాగం సౌత్ ఆసియా బిజినెస్ అసోసియేషన్ (ఎస్ఎబిఎ) ఈ మేరకు ఆయనను ఆహ్వానించింది.

భారతదేశ వ్యాపారం, ఆవిష్కరణ, విధాన నిర్ణయ రంగాలపై మేధోమథనం జరిగే ప్రపంచంలోని అత్యున్నత వేదికల్లో ఇండియా బిజినెస్ కాన్ఫరెన్స్ ఒకటి. గత 21 యేళ్లుగా న్యూయార్క్‌లో నిర్వహిస్తున్న ఈ సదస్సు, ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో భారతదేశం పోషిస్తున్న పాత్రపై చర్చించేందుకు ప్రభుత్వం, పరిశ్రమలు, విద్యాసంస్థలు, ప్రవాస భారతీయులకు ఒక వేదికగా నిలుస్తోంది. 2026 ఎడిషన్ కాన్ఫరెన్స్‌లో జెరోధా వ్యవస్థాపకుడు నిఖిల్‌కామత్ ప్రధాన వక్తగా వ్యవహరించనున్నారు. గతంలో కేంద్రమంత్రి పీయూష్‌గోయల్, పాలో ఆల్టో నెట్‌వర్క్స్ సిఇఒ నికేష్ అరోరా, డ్రీమ్ 11 సహ వ్యవస్థాపకుడు హర్ష్ జైన్ వంటి ప్రముఖులు ఈ వేదికపై ప్రసంగించారు.ఇటీవలే హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో జరిగే హార్వర్డ్ ఇండియా కాన్ఫరెన్స్‌కు ఆహ్వానం అందిన తరుణంలోనే, ఇప్పుడు కొలంబియా బిజినెస్ స్కూల్ నుండి కూడా ఆహ్వానం రావడం విశేషం. కేటీఆర్ నాయకత్వం,విజన్ పట్ల అంతర్జాతీయ స్థాయిలో ఉన్న ఆసక్తికి ఇది నిదర్శనం.

గత ఏడాది కూడా ఆయన ఆక్స్‌ఫర్డ్ ఇండియా వీక్ సందర్భంగా ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంలో ప్రసంగించి, తన స్పష్టమైన ముందుచూపుతో కూడిన ప్రసంగంతో అందరి ప్రశంసలు అందుకున్నారు. కేటీఆర్‌ను విశిష్ట వక్తగా ఆహ్వానించడం తమకు దక్కిన గౌరవంగా భావిస్తున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.



ప్రజాభవన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్న డా.జి.చిన్నారెడ్డి.

# సిఎం ప్రజావాణికి అందిన దరఖాస్తులు 285

**హైదరాబాద్ (బేగంపేట), జనవరి 13, ప్రభాతవార్త:** మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్‌లో మంగళవారం నిర్వహించిన సిఎం ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 285 దరఖాస్తులు అందాయి. వీటిలో పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 74 దరఖాస్తులు, రెవెన్యూ శాఖకు సంబంధించి 27 దరఖాస్తులు, ఇందిరమ్మ ఇళ్ల కోసం 146 దరఖాస్తులు, ప్రవాసీ ప్రజావాణికి 2 దరఖాస్తులు వచ్చాయి. ఇతర శాఖలకు సంబంధించి 36 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. సిఎం ప్రజావాణి ఇన్‌చార్జి, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్‌ఛైర్మన్ డా. జి.చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్య దేవరాజన్ దరఖాస్తులు స్వీకరించి ప్రజల సమస్యలు విని సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పలు సమస్యలను పరిష్కరించారు.




సమావేశంలో మాట్లాడుతున్న ప్రొ.జి.హరగోపాల్. చిత్రంలో లక్ష్మణ్, నారాయణరావు తదితరులు

# క్రాంతిచైతన్య, ఇన్నయ్యను విడుదల చేయాలి

## పౌర హక్కుల సంఘం డిమాండ్

**హైదరాబాద్ (సైఫాబాద్), జనవరి 13, ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌర హక్కుల సంఘం ఉపాధ్యక్షుడు క్రాంతి చైతన్యపై పోలీసులు అక్రమంగా కేసు పెట్టి అరెస్టు చేయడాన్ని తెలంగాణ పౌర హక్కుల సంఘం నాయకులు తీవ్రంగా ఖండించారు. తక్షణమే క్రాంతి చైతన్య, ఇన్నయ్య, దుగ్గనేని మోహన్‌కృష్ణలను విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. మంగళవారం ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రొఫెసర్ జి.హరగోపాల్ పౌర హక్కుల సంఘం నాయకులు ప్రొ. గడ్డం లక్ష్మణ్, ఎన్. నారాయణరావు, గుంటి రవి, మాదన కుమారస్వామి, తిరుమలయ్య మాట్లాడుతూ ఎపి పౌర హక్కుల సంఘం 20వ రాష్ట్ర మహాసభలను పురస్కరించుకుని తిరుపతిలో ప్రచార కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న క్రాంతి చైతన్యపై పోలీసులు అక్రమంగా కేసుపెట్టి అరెస్టు చేశారని, అలాగే వందలాది మంది చిన్న పిల్లలను చేరదీసి చూస్తున్న ఇన్నయ్యను కూడా పోలీసులు అరెస్టు చేయడం దారుణమన్నారు. తక్షణమే వారిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

# ఆరోగ్య తెలంగాణే లక్ష్యం



మంగళవారం కోఠిలోని ఉస్మానియా మెడికల్ కాలేజీ గ్రౌండ్స్‌లో ల్యాబ్ టెక్నీషియన్ నియామకపత్రాలను అందజేస్తున్న వైద్య మంత్రి దామోదర రాజనర్సింహ, తదితరులు

## రెండేళ్లలో 9,572 ఉద్యోగాలు భర్తీ చేశాం
## త్వరలో మరిన్ని నోటిఫికేషన్లు ఇస్తాం
## వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ

**హైదరాబాద్, జనవరి 13, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రాన్ని ఆరోగ్య తెలంగాణగా మార్చడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. తాము అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో 9,572 ఉద్యోగాలు భర్తీ చేశామని, మరో 7,267 ఉద్యోగాల భర్తీ చివరి దశలో ఉందన్నారు. త్వరలో మరిన్ని నోటిఫికేషన్లు ఇవ్వనున్నట్టు మంత్రి తెలిపారు. రాష్ట్రంలో ల్యాబ్ టెక్నీషియన్ ఉద్యోగాలకు ఎంపికైన 1,257 మందికి మంత్రి మంగళవారం నియామక పత్రాలను అందజేశారు. ఒకేసారి 1,257 మంది ల్యాబ్ టెక్నీషియన్లకు (గ్రేడ్-2) నియామక పత్రాలను అందజేత కార్యక్రమం మంగళవారం కోఠిలోని ఉస్మానియా మెడికల్ కాలేజీ గ్రౌండ్స్‌లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి దామోదర్ రాజ నర్సింహ.. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్‌లతో కలిసి అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ.. గతంలో ఎన్నడూ లేని విధంగా వేగంగా ఈ నియామక ప్రక్రియను పూర్తి చేశామన్నారు. 2024 సెప్టెంబర్ 11న నోటిఫికేషన్ విడుదల చేయగా, 2025 నవంబర్ నాటికి నియామక ప్రక్రియను పూర్తి చేశామన్నారు. మొత్తం 23,323 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకాగా, 1257 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారని మంత్రి తెలిపారు. డీఎంఈ పరిధిలో 764, డీపీహెచ్‌లో 300, టీవీవీపీలో 180, ఎంఎన్‌జేలో 13 మందికి పోస్టింగ్స్ ఇచ్చామన్నారు. ఒకప్పుడు రోగి లక్షణాలను బట్టి వైద్యం చేసేవారని, కానీ నేడు రోగ నిర్ధారణ జరిగిన తర్వాతే చికిత్స ప్రారంభిస్తున్నారని తెలిపారు. ఇందుకు ల్యాబ్ టెక్నీషియన్లు ఇచ్చే రిపోర్టులే డాక్టర్లకు ప్రామాణికమన్నారు. వైద్య వ్యవస్థకు ల్యాబ్ టెక్నీషియన్లు కళ్లు, చెవుల్లాంటి వారని, వారి రిపోర్టుల్లో కచ్చితత్వం ఎంతో ముఖ్యమని మంత్రి స్పష్టం చేశారు. ఎన్ఏబీఎల్ ప్రమాణాలకు అనుగుణంగా ప్రభుత్వ ల్యాబ్స్‌ను తీర్చిదిద్దాల్సిన బాధ్యత ల్యాబ్ టెక్నీషియన్లు తీసుకోవాలని మంత్రి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం గత రెండేళ్లలో 70 వేలకు పైగా ఉద్యోగాలను భర్తీ చేసిందని మంత్రి దామెదర్ రాజనర్సింహ గుర్తుచేశారు. ఒక్క ఆరోగ్య శాఖలోనే ఇప్పటివరకు 9,572 పోస్టులను భర్తీ చేశామని, మరో 7,267 పోస్టుల నియామక ప్రక్రియ వివిధ దశల్లో ఉందని తెలిపారు. ఆర్థిక శాఖ అనుమతి ఉన్న మరో 996 పోస్టులకు త్వరలోనే నోటిఫికేషన్ విడుదల చేస్తామని చెప్పిన మంత్రి.. అదనంగా 2,344 పోస్టుల భర్తీకి ప్రతిపాదనలు పంపామని తెలిపారు. తెలంగాణను ఆరోగ్య రాష్ట్రంగా మార్చేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని మంత్రి స్పష్టం చేశారు. ఉస్మానియా ఆసుపత్రి నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన, ఆరోగ్యశ్రీ పరిమితి రూ.10 లక్షలకు పెంపు, ప్రతీ జిల్లాలో ఎన్‌సీడీ క్లినిక్స్, క్యాన్సర్ డే కేర్ సెంటర్లు, ట్రాన్స్‌జెండర్ల కోసం మైత్రి క్లినిక్స్, గాంధీ ఆసుపత్రిలో ఉచిత ఐవీఎఫ్ సేవలు అందుబాటులోకి తెచ్చామని వివరించారు. తెలంగాణ వైద్య విధాన పరిషత్‌ను సెకండరీ హెల్త్ కేర్‌గా మారుస్తున్నామని మంత్రి వెల్లడించారు. త్వరలోనే నూతన హెల్త్ పాలసీని రూపొందించి, అమలు చేయబోతున్నామని మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు.

# తెలంగాణ స్ఫూర్తిప్రదాత మర్రి చెన్నారెడ్డి

## కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి
## ప్రజల మనిషి మర్రి చెన్నారెడ్డి: హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ

**హైదరాబాద్ (ముషీరాబాద్), జనవరి 13, ప్రభాతవార్త:** తెలంగాణ స్ఫూర్తి ప్రదాత డాక్టర్ మర్రి చెన్నారెడ్డి అని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి కొనియాడారు. మంగళవారం డాక్టర్ మర్రి చెన్నారెడ్డి 107 జయంతి సందర్భంగా ఇందిరాపార్కు లోని డాక్టర్ మర్రి చెన్నారెడ్డి రాక్‌గార్డెన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయతో కలసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి, మాజీ గవర్నర్ మర్రి చెన్నారెడ్డి ఆనాడు తెలుగు రాష్ట్రాలలో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకున్నారని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధన లో ఆయన పాత్ర కీలకమైనదని, తెలంగాణ రాష్ట్రం కోసం ఆయన తన సొంత పార్టీని సైతం వ్యతిరేకించారని తెలిపారు. ఆయన స్ఫూర్తితో, ప్రతి సంవత్సరం ఆయనను స్మరించుకుంటూ ఆయన కుటుంబసభ్యులు మర్రి శశిధర్‌రెడ్డి తదితరులు ఇటువంటి కార్యక్రమాన్ని నిర్వహించటం అభినందనీయమని కొనియాడారు. అనంతరం బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ మర్రి చెన్నారెడ్డి ప్రజల మనిషి అని, పార్టీలకు అతీతంగా అందరూ ఆయనను అభిమానిస్తారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రామచంద్రరావు, కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంతరావు, బీసీ కమీషన్ మాజీ ఛైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్, మర్రి శశిధర్‌రెడ్డి, స్థానిక కార్పోరేటర్ రచనశ్రీ, బీజేపీ నేతలు భరత్‌గౌడ్, రమేష్‌రాం, మహేందర్ బాబు, మర్రి చెన్నారెడ్డి కుటుంబసభ్యులు, అభిమానులు పాల్గొని, డాక్టర్ మర్రి చెన్నారెడ్డి సమాధి వద్ద, ఆయన విగ్రహం వద్ద ఘనంగా నివాళులర్పించారు.



డాక్టర్ మర్రి చెన్నారెడ్డి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ తదితరులు

# పిఎంశ్రీ నిధులు సక్రమంగా వినియోగించాలి

## నిధుల దుర్వినియోగానికి పాల్పడిన హెచ్‌ఎంలపై చర్యలు తీసుకోవాలి: ప్రభుత్వానికి బిటిఎఫ్ విజ్ఞప్తి

**హైదరాబాద్, జనవరి 13, ప్రభాతవార్త :** పిఎంశ్రీ పథకంలో భాగంగా కేంద్రం ప్రభుత్వ పాఠశాలలకు ఇస్తున్న నిధులను సక్రమంగా వినియోగించేలా చర్యలు తీసుకోవాలని బహుజన టీచర్స్ ఫెడ రేషన్(బిటిఎఫ్) డిమాండ్ చేసింది. నిధులను దుర్వినియోగం చేస్తున్న ప్రధానోయపాధ్యా యులపై చర్యలు తీసుకోవాలని సంఘం రాష్ట్ర అధ్యక్షులు కల్పదర్శి చైతన్య డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన మంగళవారం పాఠశాల విద్య డైరెక్టర్‌కి వినతిపత్రం సమర్పించినట్టు తెలిపారు. రాష్ట్రంలోని 832 పిఎంశ్రీ ప్రభుత్వం పాఠశాలలకు కేటాయించిన నిధులను కొంత మంది ప్రధానోపాధ్యాయులు దుర్వినియోగం చేస్తున్నారని, అట్టి ప్రధానోపాధ్యాయులపై సమగ్రమైనా విచారణ చేపట్టి కఠినమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల లక్ష్యం కొరకు సక్రమంగా ఉపయోగించేలా చర్యలు ఉండాలన్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో ప్రతిష్టంగా చెప్పట్టిన పిఎంశ్రీ పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలలకు అన్ని మౌలిక వసతుల కల్పించి సర్వోన్నతంగా తీర్చిదిద్దాలని, పాఠశాలల నిర్వహణ కోసం ఒక్కో పాఠశాలకు 5 సంవత్సరాలకు కోటిన్నర రూపాయలు కేటా యించి అన్ని రకాల మౌలిక వసుతుల కల్పన కోసం చెప్పట్టిన ఒక గొప్ప కార్యాచరణతో ముందుకు పోవాలని చూస్తుందన్నారు. కాని ఇందుకు భిన్నంగా రాష్ట్రంలో కొన్ని పిఎంశ్రీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు నిధులను దుర్వి నియోగం చేస్తున్నట్లు అనేక సంఘటనల ఆధారంగా తెలుస్తుందన్నారు. అలా నిధులను దుర్వినియోగం చేసిన ప్రధానో పాధ్యాయులపై సమగ్రమైన విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నట్టు తెలిపారు. పాఠశాల విద్య డైరెక్టర్ అందుబాటులో లేకపోవడంతో సర్వశిక్ష అభియాన్ ఏఎస్‌పిడికి వినతిపత్రం సమర్పించినట్టు చైతన్య తెలిపారు.

# కర్ల రాజేష్ మృతిపై జ్యుడీషియల్ విచారణ జరిపించాలి

## ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ

**హైదరాబాద్ (ముషీరాబాద్), జనవరి 13, ప్రభాతవార్త:** అక్రమ నిర్బంధానికి గురై, లాకప్ డెత్ అయిన కర్ల రాజేష్‌పై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో జ్యుడీషియల్ విచారణ జరిపించాలని ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్య క్షుడు మందకృష్ణమాదిగ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ముషీరాబాద్ తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి, ఆయన ఈనెల 17వ తేదీ జరిగిన రాజేష్ పోస్టుమార్టానికి సంబంధిం చిన వివరాలపై ఆరాతీశారు. అనంతరం ఆయన విలేఖ రులతో మాట్లాడుతూ రాజేష్ మృతిలో పోలీస్ వ్యవస్థతో పాటు డాక్టర్ల నిర్లక్ష్యం కూడా ఉందని ఆరోపించారు. ఎమర్జెన్సీ పేషెంట్‌గా గాంధీ హాస్పిటల్‌కు వచ్చిన రాజేష్‌కు 50 నిమిషాల పాటు ఎటువంటి వైద్యం అందించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాజేష్ వ్యవహారంలో కేవలం బీసీ బిడ్డ అయిన సీఐని మాత్రమే సస్పెండ్ చేసి, మిగిలిన దోషులను కాపాడు తున్నారని, తక్షణమే స్పష్టమైన విచారణకై జ్యుడిషియల్ విచారణకు ఆదేశించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు గోవింద్ నరేష్ మాదిగ, టి.వి. నరసింహ మాదిగ, గజ్జల రాజశేఖర్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.



ముషీరాబాద్ తహసీల్దార్‌తో మాట్లాడుతున్న మందకృష్ణ మాదిగ

# ఉగాది పర్వదినం నాటికి సనత్‌నగర్ టిమ్స్ ప్రారంభిస్తాం

## వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ

**హైదరాబాద్, జనవరి 13, ప్రభాతవార్త :** హైదరాబాద్‌లోని సనత్‌నగర్ టిమ్స్ హాస్పిటల్‌ను ఉగాది నాటికి ప్రారంభిస్తామని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామెదర్ రాజనర్సింహ తెలిపారు. ఇందుకు సంబంధించిన పనులను మంత్రి మంగళవారం పరిశీలించారు. పనులను పరిశీలించిన అనంతరం మంత్రి మాట్లాడుతూ.. ఉగాది నాటికి హాస్పిటల్‌ను ప్రారంభిస్తామని వెల్లడించారు. హాస్పిటల్ బిల్డింగ్ నిర్మాణ పనులు దాదాపు పూర్తయ్యాయని, ఎలక్ట్రికల్ వర్క్స్ కొన్ని ఇంకా చేయాల్సి ఉందన్నారు. ఆపరేషన్ థియేటర్లు, డయాగ్నస్టిక్స్ ఇతర ఎక్విప్‌మెంట్ ఏర్పాటు కూడా చివరి దశలో ఉందని తెలిపారు. ఇప్పటికే అత్యాధునిక టెక్నాలజీతో కూడిన ఎంఆర్ఐ వంటి భారీ యంత్రాల ఏర్పాటు పూర్తయిందన్నారు. తమ ప్రభుత్వానికి ప్రచార ఆర్భాటం ఉండదని, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నదే తమ తాపత్రయమన్నారు.

అన్నిరకాలుగా పూర్తి స్థాయి సౌకర్యాలతో ఉగాది నాటికి పేషెంట్లకు ఇక్కడ వైద్య సేవలు అందిస్తామని మంత్రి స్పష్ట చేశారు. వెయ్యి బెడ్ల ఈ హాస్పిటల్‌లో అన్నిరకాల వైద్య సేవలు అందుబాటులోకి తీసుకొస్తున్నామని చెప్పిన మంత్రి దామోదర్ గుండె సంబంధిత వ్యాధుల చికిత్సలకు సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా సనత్‌నగర్ టిమ్స్ ఉంటుందన్నారు. ఇక్కడే అవసరమైన రీసెర్చ్ జరుగుతుందని, ఇక్కడే అత్యాధునిక ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంటేషన్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నామన్నారు.

అన్నిరకాల అవయవమార్పిడి సర్జరీలు చేసేలా అత్యాధునిక ఆపరేషన్ థియేటర్లు అందుబాటులో తెస్తున్నామని, ఆరోగ్యశాఖలో గత రెండేళ్లలోనే సుమారు 10 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని చెప్పిన మంత్రి.. మరో 7 వేలకుపైగా ఉద్యోగాల భర్తీ అవుతున్నాయన్నారు. త్వరలో మరిన్ని నోటిఫికేషన్లు ఇవ్వబోతున్నామని దీంతో డాక్టర్లు, నర్సులు, పారామెడికల్ సిబ్బందికి ఎలాంటి కొరత ఉండదని మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు.

# తెలంగాణ తల్లి విగ్రహంలోనే స్పష్టంగా సంస్కృతి, సంప్రదాయాలు

## జిల్లా ఇన్‌చార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:** తెలంగాణ తల్లి విగ్రహంలోనే తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు స్పష్టంగా ప్రజలకు కనబడుతున్నాయని కార్మిక, జిల్లా ఇన్‌చార్జి మంత్రి గడ్డం వివేక్‌వెంకటస్వామి అన్నారు. జిల్లా కలెక్టరేట్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆయన మంగళవారం ఆవిష్క రించి మాట్లాడారు. స్వర్గీయ అందెశ్రీ రాసిన జయజయహే తెలంగాణ గీతం, తెలంగాణ తల్లి విగ్రహాలు తెలంగాణలో ప్రజా పాలనను ప్రజలకు తెలియజేస్తున్నాయన్నారు. ప్రజాపాలనలో ప్రజలు కోరుకున్న విధంగా ప్రజాసంక్షేమమే లక్ష్యంగా అన్ని వర్గాల ప్రజలకు అభివృద్ధి, సంక్షేమ పథకాలను పారదర్శకంగా అందించడం జరుగుతుందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన 6 గ్యారెంటీలలతో పాటు ఇందిరమ్మ ఇండ్లు, కొత్త రేషన్ కార్డులు, సన్న బియ్యం పంపిణీ తదితర అనేక అభివృద్ధి కార్యక్రమాలను పేద ప్రజల కోసం అమలు చేయడం జరుగుతుందన్నారు. తెలంగాణ ప్రజలు కుటుంబ పాలన పోవాలని కోరుకుంటూ ప్రజాపాలనకు స్వాగతం పలికారన్నారు. ప్రజలకు ఏ అవసరాలు ఉన్నాయో ప్రభుత్వం అదే చేస్తుందన్నారు. గతంలో ప్రభుత్వ పథకాలు కొంత మందికే అందేవని కాంగ్రెస్ సర్కార్‌లో పేద ప్రజలకు అందేలా కృషి చేయడం జరుగుతుందన్నారు.

త్వరలోనే సిద్దిపేట పట్టణంలో రూ.15 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతామన్నారు. జిల్లా కలెక్టర్ హైమావతి ఆధ్వర్యంలో ప్రజలందరికీ సంక్షేమ పథకాలు వేగంగా చేరుకునేలా జిల్లా అధికార యంత్రాంగా కృషి చేస్తుందన్నారు.కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కె.హైమావతి, జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కెడం లింగమూర్తి, ఆర్డీఓ సదానందం, జిల్లా రవాణ శాఖ సభ్యులు డాక్టర్ లక్కరసు సూర్యచంద్రవర్మ, వివిధశాఖల అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎం.డి.ఇమామ్(అత్తు), దేవులపల్లి యాదగిరి, బొమ్మల యాదగిరి, సాకి అనంద్ తదితరులు పాల్గొన్నారు.




సిద్దిపేట కలెక్టరేట్‌లో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ప్రారంభిస్తున్న మంత్రి, చిత్రంలో కలెక్టర్

# 20న ఎర్ర బ్యాడ్జీలతో పోరాట దినం

## తీర్మానించిన ఆర్‌టిసి జెఎసి

**హైదరాబాద్, జనవరి 13, ప్రభాతవార్త :** రాష్ట్రంలోని ఆర్‌టిసిలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 20న ఎర్ర బ్యాడ్జిలతో పోరాట దినంగా నిర్వహించాలని ఆర్‌టిసి జేఏసీ నిర్ణయించింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 2 సంవత్సరాలు పూర్తయిప్పటికీ ఎన్నికల మేనిఫెస్టోలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు కాకపోవడంతో ఆర్టీసి కార్మికవర్గం తీవ్ర అసంతృప్తితో ఉన్నారని టిజిఎస్ ఆర్టీసి జెఎసి ఛైర్మన్ ఈదురు వెంకన్న, వైస్ ఛైర్మన్ ఎన్.కమలాకర్ రెడ్డి, కో కన్వీనర్లు కత్తుల యాదయ్య, బి.యాదగిరి అన్నారు.

మంగళవారం ఎంప్లాయీస్ యూనియన్ కేంద్ర కార్యాలయంలో జెఎసి అత్యవసర సమావేశం జరిగింది. సమావేశాన్ని ఉద్దేశించి జెఎసి నేతలు మాట్లాడుతూ... గత బిఆర్ఎస్ ప్రభుత్వం అవలంబించిన విధానాలనే ఈ ప్రభుత్వం కూడా అవలంబిస్తోందని, ఎన్ని మార్లు ఆర్టీసి కార్మికుల సమస్యలను ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్ళినప్పటికీ పరిష్కారం చేయటంలో తగిన శ్రద్ధ చూపకపోవడంతో.. జెఎసి ఆధ్వర్యంలో గతంలో అనేక పోరాటాలు చేశామని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కార్మిక దినోత్సవమైన మే 1, 2025న స్వయంగా స్పందించి ఆర్టీసి కార్మిక సమస్యలను పరిష్కరించేందుకు సానుకూలంగా ఉన్నామని బహిరంగంగా చెప్పి 7 నెలలు కావస్తున్నప్పటికీ ఒక్క డిమాండ్ కూడా పరిష్కరింపచేయలేదన్నారు. ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై నిరసనగా మరో పోరాటానికి జెఎసి శ్రీకారం చుట్టనుందని తెలిపారు. అందులో భాగంగా మంగళవారం నుంచి ఈ నెల 19 వరకు పోస్టుకార్డు ఉద్యమం చేయాలని జెఎసి నిర్ణయించినట్టు తెలిపారు.

అనంతరం ఈ నెల 20న రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసి కార్మికులు, ఉద్యోగులు అందరూ ఎర్ర బ్యాడ్జీలు (రిబ్బన్లు) ధరించి "పోరాట దినం" పాటించాలని నిర్ణయించినట్టు తెలిపారు. జెఎసి ఇచ్చిన ఈ ఉద్యమ కార్యాచరణను కార్మికవర్గమంతా ఐక్యంగా విజయవంతం చేయాలని కోరారు. జేఏసీ సమావేశంలో జె.రాఘవులు, కె.రామిరెడ్డి (ఈయు), బి.యాదయ్య కోశాధికారి, సి.సత్తయ్య, ఎం.హెచ్.ఆలీ, బుద్ధ విశాల్, జి.రాములు (బికెయు), రాంచందర్, బి.శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.

# కవితను కాంగ్రెస్ పార్టీలో చేర్చుకునే అవకాశమే లేదు

## పిసిసి అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ స్పష్టీకరణ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 13:** తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కాంగ్రెస్ పార్టీలో చేరబోతున్నారంటూ కొద్దిరోజులుగా వస్తున్న వార్తలపై పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్‌గౌడ్ స్పందించారు. మంగళవారం గాంధీభవన్‌లో మీడియా ప్రతినిధులతో నిర్వహించిన చిట్‌చాట్‌లో పీసీసీ చీఫ్ మాట్లాడుతూ.. కవితను కాంగ్రెస్ పార్టీలో చేర్చుకునే అవకాశమే లేదని స్పష్టం చేశారు. తెలంగాణాలో బీఆర్ఎస్ పార్టీకి గతం తప్ప.. భవిష్యత్తు లేదంటూ వ్యాఖ్యానించారు. కేసీఆర్ కుటుంబ అవినీతి గురించి కవిత నిజాలు చెప్తున్నారన్నారు. తాము చేసిన ఆరోపణలపై కవిత సమాధానం రూపంలో రుజువైందని చెప్పారు. కవిత మాటలతో కేసీఆర్ అవినీతి నిజమని ప్రజలు అర్థం చేసుకుంటున్నారని ఆయన చెప్పారు.సీఎం రేవంత్ రెడ్డికి తెలంగాణా ప్రయోజనాలే ముఖ్యమని.. ఒక్క నీటి బొట్టును కూడా వదలమని తేల్చిచెప్పారు. అజారుద్దీన్, కోదండరామ్ ఎమ్మెల్సీల విషయంలో మంచి స్పందన వస్తోందని నమ్ముతున్నట్లు తెలిపారు. ఏప్రిల్‌లో కార్పొరేషన్ ఛైర్మన్లను భర్తీ చేస్తామని ప్రకటించారు. పదవులు తక్కువ అయ్యాయని... ఆశావహులు ఎక్కువ అయ్యారని తెలిపారు. మున్సిపల్ ఎన్నికల కోసం పార్టీ తరఫున ఒక కమిటీ వేస్తామని.. సర్వేల ఆధారంగా టికెట్లు ఇస్తామని చెప్పారు. గెలిచే అభ్యర్థులకే టికెట్ ఇస్తామని మహేశ్ కుమార్ పేర్కొన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో పొత్తుపై పీఏసీలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని టిపిసిసి చీఫ్ తెలిపారు. బీజేపీని తెలంగాణాలో నమ్మే పరిస్థితి లేదన్నారు. మత రాజకీయాలు రాష్ట్రంలో నడవవని అన్నారు. రాముడికి, బీజేపీకి సంబంధమేంటి అని ఆయన ప్రశ్నించారు. తాము హిందూ ఆచారాలను పాటిస్తామని.. కానీ హిందూ సెంటిమెంట్‌తో ఓట్లు అడగమని తెలిపారు. తనకు, సీఎం రేవంత్ మధ్య మంచి సాన్నిహిత్యం ఉందన్నారు.మంత్రులకు, సీఎంకు మధ్య ఎలాంటి గ్యాప్ లేదని మహేశ్ తేల్చిచెప్పారు. ఇతర మంత్రుల శాఖల్లో ముఖ్యమంత్రి తలదూర్చరన్నారు. మంత్రులకు పూర్తి స్వేచ్ఛ ఇస్తున్నారని వెల్లడించారు. డీ సెంట్రలైజేషన్ కోసమే మేడారంలో కేబినెట్ సమావేశం ఏర్పాటు చేస్తున్నారని పీసీసీ చీఫ్ తెలిపారు. కెసిఆర్.. కుమారుడికి ఒక జిల్లా, కూతురికి ఒక జిల్లా, అల్లుడికి ఒక జిల్లా ఇచ్చారని పీసీసీ చీఫ్ ఆరోపణలు గుప్పించారు. కేసీఆర్ అశాస్త్రీయంగా జిల్లాలను విభజించారని మండిపడ్డారు. శాస్త్రీయంగా జిల్లాల పునర్విభజన చేయాలని కమిటీ వేస్తున్నామని తెలిపారు. సికింద్రాబాద్‌ను ఎవరు ముట్టుకున్నారని తలసాని శ్రీనివాస్ యాదవ్ గాబరాపడుతున్నారని ప్రశ్నించారు. వ్యక్తిగత జీవితాలతో ఆడుకునే హక్కు ఎవరికీ లేదన్నారు. మహిళా అధికారులపై ఆధారాలు లేకుండా వార్తలు రాస్తే ఎంత ఇబ్బంది పడతారో అర్థం చేసుకోవాలన్నారు. సోషల్ మీడియాను కట్టడి చేయాలన్నారు. పదేళ్లలో వచ్చిన ఉద్యోగాలు ఎన్ని? రెండేళ్లలో ఇచ్చిన ఉద్యోగాలు ఎన్నో నిరుద్యోగులు అర్థం చేసుకోవాలని మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

# ఆపరేషన్ సిందూర్ అవసరమైతే కొనసాగిస్తాం!

### ఆర్మీ చీఫ్ ఉపేంద్ర ద్వివేది

**న్యూఢిల్లీ, జనవరి 13:** ఆపరేషన్ సిందూర్‌ను అత్యంత కచ్చితత్వంతో అమలు చేశామని, 88 గంటల పాటు సాగిన ఈ ఆపరేషన్‌లో మన సైనిక దళాలు అత్యంత సమర్థంగా పనిచేశాయని ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది వెల్లడించారు. ఇది త్రివిధ దళాల సమన్వయానికి నిదర్శనమని తెలిపారు.



భద్రతా సవాళ్లను ఎదుర్కోవడంలో భారత సైనిక సంసిద్ధత దీని ద్వారా స్పష్టమైందని అన్నారు. ఆపరేషన్ సిందూర్ కొనసాగుతుందని పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్ ద్వారా ఉగ్రవాద శిబిరాలను నేలమట్టం చేశామని ఆయన దాదాపు 100 మంది ఉగ్రవాదులు హతమయ్యారని అన్నారు. ఆ సమయంలో పెద్ద ఎత్తున బలగాలను సరిహద్దులకు తరలించినట్లు చెప్పారు. పాకిస్తాన్ చిన్న పొరపాటు చేసినా భూతల దాడులను ప్రారంభించేందుకు కూడా అప్పుడు తాము సిద్ధంగా ఉన్నామని ఆయన స్పష్టం చేశారు. ఈశాన్య సరిహద్దుల్లో పరిస్థితులపై కూడా ఆయన స్పందించారు.

ఈశాన్య సరిహద్దులు స్థిరంగానే ఉన్నాయని, అప్రమత్తంగా ఉండటం కీలకమని వెల్లడించారు. చైనా సరిహద్దుల్లోని భద్రత గురించి ఆయన మాట్లాడుతూ, భారత బలగాలు బలంగా ఉన్నాయని అన్నారు. భవిష్యత్తులో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు ఎదురైనా వాటిని సమర్థవంతంగా ఎదుర్కొంటామని వ్యాఖ్యానించారు. జమ్ము కశ్మీర్ పరిస్థితులు సున్నితంగా ఉన్నప్పటికీ, నియంత్రణలోనే ఉన్నాయని ఆయన అన్నారు.

# తగ్గుతున్న విద్యుత్ పంపిణీ నష్టాలు

### ఓపెన్ యాక్సిలరీ చార్జీల హేతుబద్ధీకరణ
### వినియోగదారులకు మెరుగైన సేవలు
### కొత్త నిబంధనలు తెచ్చిన విద్యుత్ మంత్రిత్వ శాఖ

**హైదరాబాద్, జనవరి 13, ప్రభాతవార్త :** విద్యుత్ రంగాన్ని సంస్కరించే లక్ష్యంతో కేంద్రం తీసుకున్న కీలక నిర్ణయాలు సత్ఫలితాలను ఇస్తున్నాయి. ఇప్పటికే చేపట్టిన చర్యల కారణంగా 2021లో 21.91 శాతం ఉన్న విద్యుత్ పంపిణీ నష్టాలు 2025కి 16.16 శాతానికి గణనీయంగా తగ్గించడంలో సహాయపడ్డాయి. దీన్ని మరింతగా తగ్గించే లక్ష్యంతో మరిన్ని సంస్కరణలను అమల్లోకి తీసుకొస్తోంది. ఇందులో భాగంగా విద్యుత్ పంపిణీ సంస్థల నష్టాలను తగ్గించడంతో పాటు, ఓపెన్ యాక్సలరీ చార్జీల హేతుబద్ధీకరణ, వినియోగదారులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు చర్యలు చేపట్టింది. ఇందుకు కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ కొత్త నిబంధనలను తీసుకొచ్చింది.

ప్రధానంగా గ్రీన్ హైడ్రోజన్ తదితర వాటితో విద్యుత్ ఉత్పత్తి చేపట్టే వాటికి ఇంధన ఇంటెన్సిటివ్‌ను ఇవ్వడంతో పాటు, పరిశ్రమలకు వ్యాపారాన్ని సులభతరం చేస్తోంది. ఇదే సమయంలో ఇంధన పరివర్తన మరియు భద్రతను పెంచేలక్ష్యంతో విద్యుత్ మంత్రిత్వ శాఖ అవసరమైన చర్యలు చేపట్టింది. ఈ నిబంధనలు, విద్యుత్ పరివర్తన మరియు భద్రతను పెంపొందించే విస్తృత వ్యూహంలో భాగంగా, పంపిణీ కంపెనీల నష్టాలను తగ్గించేందుకు దోహద పడతాయని మంత్రిత్వ శాఖలోని సీనియర్ అధికారి ఒకరు వెల్లడించారు. కొత్త నిబంధనల ప్రకారం, ఇంటర్‌స్టేట్ ట్రాన్స్‌మిషన్ సిస్టమ్‌లో 25 ఐదు మెగావాట్ల కంటే తక్కువ లోడ్ కలిగిన వినియోగదారులు మరియు ఎనర్జీ స్టోరేజ్ సిస్టం పదిమెగా వాట్లను ఇప్పుడు స్థాపించుకోవడమే కాకుండా వాటిని నిర్వహించుకునే వీలును కల్పిస్తోంది. లైసెన్స్ అవసరం లేకుండా ట్రాన్స్‌మిషన్స్, ఇప్పటికే ఉత్పత్తిచేసే కంపెనీలు తదితర వాటికి అందుబాటులోకి తెస్తోంది. ఇది మరింత సరసమైన విద్యుత్‌తో పాటు, మెరుగైన గ్రిడ్ విశ్వసనీయత నుండి ప్రయోజనం పొందగలదని భావిస్తోంది. ఫలితంగా విద్యుత్ పంపిణీ నష్టాలను మరింత తగ్గించి, వాటి సాధ్యతను పెంచుతాయని అధికారులు చెబుతున్నారు.

అంతేకాకుండా వినియోగదారులకు మరిన్ని మెరుగైన సేవలను అందించడానికి దారితీస్తుందని అన్నారు. పారిశ్రామిక వృద్ధిని వేగవంతం చేయడానికి, ఉద్యోగాల సృష్టిని పెంచడానికి మరియు పునరుత్పాదక శక్తిని స్వీకరించడాన్ని వేగవంతం చేయడానికి, తద్వారా ఉద్గారాలను తగ్గించడానికి ఈ మార్పుల సామర్థ్యాన్ని కూడా ఆయన నొక్కి చెప్పారు.

కొత్త నిబంధనలలోని మరో కీలక అంశం ఓపెన్‌యాక్సెస్ ఛార్జీల హేతుబద్ధీకరణ చేపట్టింది. కొన్ని రాష్ట్ర నియంత్రణ కమిషన్లు విధించిన అధిక ఛార్జీలు గతంలో వినియోగదారులచే ఓపెన్ యాక్సలరీలను సమర్థవంతంగా ఉపయోగించడాన్ని అడ్డుకున్నాయి. సవరించిన నియమాలు దేశవ్యాప్తంగా ఈ ఛార్జీలను మరింత సహేతుకమైన మరియు ఏకరీతిగా ఉండేలా చేయడం, వాణిజ్య సంస్థలు, పరిశ్రమలు పోటీ ధరలకు విద్యుత్తు పొందేందుకు వీలుకల్పిస్తాయని అంటున్నారు. అదనంగా, నియమాలు ఖర్చు ప్రతిబింబించే టారిఫ్లను తప్పనిసరి చేయడం ద్వారా విద్యుత్ రంగం ఆర్థిక స్థిరత్వాన్ని సూచిస్తాయని స్పష్టం చేస్తున్నారు. ఆమోదించబడిన వార్షిక రాబడి అవసరాలు, ఆమోదించబడిన టారిఫ్ నుండి అంచనా వేయబడిన వార్షిక రాబడి మధ్య ఏదైనా అంతరం సహజ వైపరీత్యాలు వంటి అసాధారణ పరిస్థితులలో మినహా కనిష్టంగా ఉంచబడుతుందని వారు నిర్ధారిస్తారు. ప్రస్తుతం ఉన్న ఆదాయ అంతరాలను సకాలంలో పరిసమాప్తి చేయడానికి నిబంధనలు ఫ్రేమ్‌వర్క్‌ను కూడా అందిస్తాయి.

## మీడియాపై సిట్ వేశారు సరే..

# కాంగ్రెస్ నేతల స్కాంలపై ఎందుకు వేయలేదు?

### బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 13:** పాలనాపరమైన వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మరల్చడానికే ప్రభుత్వం తరచూ కమిషన్‌లు, ప్రత్యేక దర్యాప్తు బృందాల (సిట్) పేరుతో అటెన్షన్ డైవర్షన్ డ్రామాలు ఆడుతోందని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ధ్వజమెత్తారు. ఒక మంత్రికి సంబంధించిన వార్తను ఉటంకించినందుకు మీడియా సంస్థలపై సిట్ వేయడాన్ని తప్పుబట్టిన కేటీఆర్, సొంత పార్టీ నేతలు చేసిన తీవ్రమైన ఆరోపణలపై మాత్రం ఎందుకు విచారణ జరపడం లేదని సూటిగా ప్రశ్నించారు.

ఒక మంత్రి పీఏ, రేవంత్ సహచరుడు కలిసి పారిశ్రామికవేత్త తలకు తుపాకీ పెట్టి రూ.300 కోట్లు డిమాండ్ చేస్తే దానిపై సిట్ లేదు. ములుగు జిల్లాలో మంత్రి పీఏ ఇసుక దందాలో కోట్లు దండుకుంటే చర్యలు లేవు. రెవెన్యూ మంత్రి కుమారుడు వందల కోట్ల భూకబ్జాకు పాల్పడితే, కేసు పెట్టిన పోలీస్ అధికారి బదలీ అయ్యారు కానీ, కబ్జాపై విచారణ లేదు అని కేటీఆర్ ఆరోపించారు.

అంతేకాకుండా, ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ ఓ కాంట్రాక్టర్‌ను రూ.8 కోట్ల కోసం బెదిరించారని, కస్తూర్బాగాంధీ పాఠశాలల బంకర్ బెడ్స్ కొనుగోలులో రూ.100 కోట్ల కుంభకోణం జరిగిందని, లిక్కర్ హోలోగ్రామ్ టెండర్ వివాదం, చీప్ లిక్కర్ కంపెనీలకు అక్రమ అనుమతులు వంటి అనేక స్కామ్‌లపై ప్రభుత్వం ఎందుకు సిట్ వేయలేదని ఆయన ప్రశ్నించారు.

యూనివర్సిటీ భూముల అమ్మకంలో భారీ మోసం జరిగిందని సుప్రీంకోర్టు కమిటీయే తేల్చినా విచారణ జరపకపోవడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు.



# గుజరాత్ జెయింట్స్‌పై ముంబయి ఇండియన్స్ జయభేరి

### ఏడు వికెట్ల తేడాతో గుజరాత్ మహిళా జట్టు ఓటమి

### ప్లేయర్ ఆఫ్‌ది మ్యాచ్‌గా హర్మన్‌ప్రీత్‌కౌర్

**నవీముంబయి, జనవరి 13:** మహిళా ప్రీమియర్‌లీగ్‌లో ఆరోమ్యాచ్ ఆద్యంతం ఉత్కంఠగా సాగింది. నవీముంబయిలోని డివైపాటిల్‌స్టేడియంలో జరిగిన గుజరాత్ జైంట్స్ వర్సస్ ముంబయి ఇండియన్స్ జట్లమధ్య జరిగిన మ్యాచ్‌లో ముంబయి మహిళా జట్టు ఏడు వికెట్ల తేడాతో నాలుగు బంతులు మిగిలి ఉండగానే విక్టరీ సాధించింది. తొలుత టాస్ గెలిచిన ముంబయి ఇండియన్స్ ఫీల్డింగ్ ఎంచుకోవడంతో గుజరాత్ జట్టు బ్యాటింగ్‌చేసింది. ఐదు వికెట్ల నష్టానికి 192 పరుగులుచేసి ముంబయి మహిళలకు 193 పరుగుల టార్గెట్ విధించింది. లక్ష్యఛేదనలో ముంబయి జట్టు మూడు వికెట్ల నష్టానికి 193 పరుగులుచేసి ఏడు వికెట్ల తేడాతో విజయం అందుకుంది. గుజరాత్ విధించిన లక్ష్యంతో ముంబయి బ్యాటర్లు దూకుడు పెంచారు. ఓపెనర్లు త్వరగానే ఔట్ అయినా అమన్‌జోత్‌కౌర్ 40 పరుగులుచేయగా కెప్టెన్ హర్మన్‌ప్రీత్ 43 పరుగులుచేసి నాటౌట్‌గా నిలిచింది. ప్రమాదకరంగా మారుతున్న ఈజట్టును సోఫీ డెవినె విడదీసింది. సిక్సర్‌కు ప్రయత్నించిన అమన్‌జోత్ బౌండరీలైన్‌వద్ద గార్డనర్ చేతికిచిక్కి మూడో వికెట్‌గా వెనుదిరిరింది. హర్మన్‌ప్రీత్‌కౌర్ 73 పరుగులుచేస్తే నికోలా క్యారీ 38అత్యధికంగా స్కోరుచేయగలిగారు. జట్టులో మాథ్యూస్ 22, జి.కమలిని 13 పరుగులుచేయగా గుజరాత్ బౌలర్లలో రేణుకాసింగ్, కష్వీగౌతమ్, సోఫిడివైన్ తలో వికెట్‌తీసారు. 16వ ఓవర్‌లో ఏణుకాసింగ్ బౌలింగ్‌లోనికోలా కేరీ నాలుగుఫోర్లు బాదేసింది. ఒక్క ఓవర్‌లోనే 20 పరుగులవరకూ సాధించారు. ప్లేయర్ ఆఫ్‌ది మ్యాచ్‌గా హర్మన్‌ప్రీత్‌కౌర్ నిలిచింది. తొలుత బ్యాటింగ్‌చేపట్టిన గుజరాత్ జట్టు 200కు చేరువగామాత్రమే రాగలిగింది. ముంబై ఇండియన్స్ బౌలర్ల ధాటికి 99కే నాలుగు వికెట్లు పడిన వేళ జార్జియా వరేహం(43 నాటౌట్), భారతి ఫుల్‌మాలి(36 నాటౌట్)లు గుజరాత్ స్కోర్ 150 అతికష్టంమీద దాటింది. కానీ, డెత్ ఓవర్లలో వరేహం, భారతి విధ్వంసం సృష్టించారు. అమన్‌జోత్ కౌర్ వేసిన ఆఖరి ఓవర్లో రెచ్చిపోయిన భారతి 23 రన్స్ రాబట్టగా గుజరాత్ నిర్ణీత ఓవర్లలో 192 పరుగులు చేయగలిగింది. కనికా అహూజా 35, బెత్‌మూనీ 33, భారతి పుల్మాలి 36, ఆష్లీన్ గార్డనర్ 20 పరుగులుచేసి దూకుడుగా ఆడినా ఎక్కువ సేపు క్రీజులో నిలవలేకపోయారు. ఆయుషి సోనీ 11కే వెనుదిరిగింది. చివరిమూడు ఓవర్లలో గుజరాత్‌జట్టు 49 పరుగులుచేయడంతో ఐదు వికెట్ల నష్టానికి 192 పరుగులుచేసింది. ముంబయి బౌలర్లలో షబ్నిమ్, హేలి మాథ్యూస్, నికోలి కేరీ, అమేలియా కేర్ తలొక వికెట్ తీసారు.

# కూ లూవెన్ వర్సిటీతో ఇసిఐ తెలంగాణ బృందం కీలక భేటీ

### బెల్జియం పర్యటనలో భారత ఎన్నికల విధానాలపై విస్తృత చర్చలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 13:** బెల్జియం అధికారిక పర్యటనలో భాగంగా ఎన్నికల కమిషన్ ఆఫ్ ఇండియా (ఇసిఐ) తెలంగాణ కార్యాలయానికి చెందిన బృందం ప్రపంచ ప్రసిద్ధ కూ లూవెన్ యూనివర్సిటీతో ముఖ్యమైన పరస్పర చర్చలు నిర్వహించింది. ప్రజాస్వామ్య ప్రక్రియలు, ఎన్నికల నిర్వహణ విధానాలపై భారత్–బెల్జియం దేశాల మధ్య పోలికలు ప్రధాన అంశంగా ఈ భేటీ సాగింది. కూ లూవెన్ యూనివర్సిటీలోని సోషల్ సైన్సెస్ విభాగం డీన్, ప్రొఫెసర్లు బెల్జియం ఎన్నికల వ్యవస్థ, ఓటింగ్ విధానాలు, సంస్థాగత భద్రతా చర్యలు, ఆధునిక సవాళ్లపై భారత బృందానికి సమగ్రంగా వివరించారు. అనంతరం భారత ప్రతినిధులు దేశంలోని ఎన్నికల వ్యవస్థ విస్తృతి, సామాజిక వైవిధ్యం, సమాఖ్య స్వరూపం వంటి విశిష్ట లక్షణాలను ప్రస్తావిస్తూ భారత ఎన్నికల ప్రక్రియపై తులనాత్మక సమీక్షను ప్రవేశపెట్టారు. తెలంగాణ ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ, ఇండియా ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డెమోక్రసీ అండ్ ఎలెక్షన్ మేనేజ్‌మెంట్ ఎన్నికల అధికారుల సామర్థ్య వృద్ధి, అంతర్జాతీయ అనుభవాల మార్పిడిలో కీలక పాత్ర పోషిస్తున్నదన్నారు. శిక్షణ, సంయుక్త పరిశోధనలు, గ్లోబల్ ఉత్తమ విధానాల పంచకంలో భాగస్వామ్యానికి కూ లూవెన్ యూనివర్సిటీ ముందుకు రావాలని ఆయన ఆహ్వానించారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యమైన భారత్‌లో 99 కోట్ల మందికిపైగా ఓటర్ల విశ్వాసాన్ని నిలబెట్టేలా ఈసీఐ అమలు చేస్తున్న కఠిన చర్యలు, పారదర్శకత, ఎన్నికల సమగ్రత పరిరక్షణ అంశాలను కూడా భారత బృందం వివరించింది. ఈ సమావేశంలో సుదర్శన్‌రెడ్డితో పాటు అనుదీప్ దురిశెట్టి, బోయపాటి చెన్నయ్య, కె. అనంత్‌రెడ్డి, ధృవ కుమార్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ భేటీతో భారత్–బెల్జియం దేశాల మధ్య ఎన్నికల నిర్వహణ రంగంలో అకడమిక్ సహకారం మరింత బలోపేతం కానుందని అధికారులు అభిప్రాయపడ్డారు.

# గ్రీన్‌లాండ్ స్వాధీనం కోసం యుఎస్ ప్రతినిధుల సభలో బిల్లు!

**వాషింగ్టన్, జనవరి 13:** అంతర్జాతీయ రాజకీయాల్లో ఒక ఆసక్తికర పరిణామం చోటు చేసుకుంది. డెన్మార్క్ పరిధిలోని స్వయంప్రతిపత్తి గల ప్రాంతమైన గ్రీన్‌ల్యాండ్‌ను అమెరికాలో విలీనం చేసి, దానిని 51వ రాష్ట్రంగా ప్రకటించాలంటూ యూఎస్ ప్రతినిధుల సభలో ఒక బిల్లును ప్రవేశపెట్టారు. ఆర్కిటిక్ ప్రాంతంలో పెరుగుతున్న చైనా, రష్యాల ప్రభావాన్ని అడ్డుకుని, అమెరికా జాతీయ భద్రతా ప్రయోజనాలను కాపాడటమే లక్ష్యంగా ఈ బిల్లును తీసుకొచ్చినట్లు రిపబ్లికన్లు చెపుతున్నారు. ఫ్లోరిడాకు చెందిన రిపబ్లికన్ కాంగ్రెస్ సభ్యుడు రాండీ ఫైన్, గ్రీన్‌ల్యాండ్ విలీనం, రాష్ట్ర హోదా చట్టం పేరుతో ఈ బిల్లును జనవరి 12న సభ ముందు ఉంచారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో ఈ బిల్లుకు ప్రాధాన్యత ఏర్పడింది. "మనం గ్రీన్‌ల్యాండ్‌ను స్వాధీనం చేసుకోవాలి. అలా చేయకపోతే రష్యా లేదా చైనా ఆ పని చేస్తాయి. నేను అధ్యక్షుడిగా ఉన్నంతకాలం అది జరగనివ్వనని ట్రంప్ స్పష్టం చేశారు. ఈ బిల్లు ప్రకారం, గ్రీన్‌ల్యాండ్‌ను స్వాధీనం చేసుకోవడానికి లేదా విలీనం చేయడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకునే అధికారాన్ని అమెరికా అధ్యక్షుడికి కట్టబెట్టారు. గ్రీన్‌ల్యాండ్‌ను ఒక రాష్ట్రంగా చేర్చుకోవడానికి అవసరమైన చట్టపరమైన మార్పులపై కాంగ్రెస్‌కు ఒక నివేదిక సమర్పించాలని కూడా ఈ బిల్లు ఆదేశిస్తోంది. గ్రీన్‌ల్యాండ్‌ను నియంత్రించేవారే ఆర్కిటిక్ సముద్ర రవాణా మార్గాలను, అమెరికా భద్రతా వ్యవస్థను నియంత్రిస్తారు. మన విలువలను ద్వేషించే శత్రు దేశాల చేతుల్లోకి మన భవిష్యత్తును వదిలేయ లేమని రాండీ ఫైన్ వ్యాఖ్యానించారు. ఈ ప్రతిపాదన కొత్తేమీ కాదు. గతంలో కూడా గ్రీన్‌ల్యాండ్‌ను కొనుగోలు చేసేందుకు అమెరికా ప్రయత్నించగా, డెన్మార్క్, గ్రీన్‌ల్యాండ్ ప్రభుత్వాలు ఆ ప్రతిపాదనలను తీవ్రంగా వ్యతిరేకించాయి.



గ్రీన్‌ల్యాండ్ అమ్మకానికి కాదని స్పష్టంగా చెప్పాయి. డెమోక్రటిక్ పార్టీ సభ్యుడు జిమ్మీ గోమెజ్ ఈ బిల్లును వ్యతిరేకిస్తూ, గ్రీన్‌ల్యాండ్‌ను స్వాధీనం చేసుకునేం దుకు ప్రభుత్వ నిధులు వాడకుండా నిరోధిం చేందుకు గ్రీన్‌ల్యాండ్ సార్వభౌమత్వ పరిరక్షణ చట్టం అనే పోటీ బిల్లును తీసుకువస్తానని ప్రకటించారు. ఈ వారం చివర్లో అమెరికా చట్టసభ సభ్యుల బృందం డెన్మార్క్‌లో పర్యటించనుండటం, విదేశాంగ మంత్రి మార్కో రూబియో కూడా ఆ దేశ అధికారులతో సమావేశమయ్యే అవకాశం ఉండటంతో ఈ అంశంపై దౌత్యపరమైన చర్చలు ఊపందు కున్నాయి. ప్రస్తుతం ఈ బిల్లు ప్రతిపాదన దశలోనే ఉన్నప్పటికీ, అంతర్జాతీ యంగా తీవ్ర చర్చకు దారితీసింది.

# వరి ధాన్యం కొనుగోలులో తెలంగాణ రికార్డ్


### ఈ ఖరీఫ్ సీజన్‌లో 70.82 లక్షల మె.ట ధాన్యం కొనుగోలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 13:** ధాన్యం కొనుగోలులో రాష్ట్రం రికార్డ్ సృష్టించిందని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. 2025–26 ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్‌లో రాష్ట్ర ప్రభుత్వం ముందెన్నడూ లేని రీతిలో 70.82 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసే రికార్డ్ నెలకొల్పిందని పేర్కొన్నారు. గతంలో కొనుగోలు చేసిన 70.2 లక్షల మెట్రిక్ టన్నుల రికార్డ్‌ను ఈ ఖరీఫ్ సీజన్‌లో అధిగమించిందని చెప్పారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో చారిత్రక మైలురాయిగా అభివర్ణించారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పౌర సరఫరాల శాఖ, నీటిపారుదల శాఖలు సమన్వయం చేయడంతో పాటు తెలంగాణా రైతాంగం భాగస్వామ్యం ఈ రికార్డులో భాగస్వామ్యం ఉందన్నారు. ధాన్య సంపదకు ప్రతీకగా నిలిచే సంక్రాంతి పర్వదినం జరుపుకుంటున్న రాష్ట్ర రైతాంగానికి, ప్రజలకు పర్వదినాన్ని పురస్కరించుకుని రంగవల్లులు అద్దుతున్న మహిళా మణులకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ధాన్యం దిగుబడిలో రైతులు కృషిని అభినందిస్తూ వ్యవసాయ రంగంపట్ల సీఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కల ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న అనుకూల విధానాలకు అద్దం పడుతుందన్నారు. ప్రభుత్వం కొనుగోలు చేసిన 70.82 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యంలో 32.45 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దొడ్డు రకం కాగా 38.37 లక్షల మెట్రిక్ టన్నులు సన్నాలు కొనుగోలు చేసినట్లు వివరించారు. రాష్ట్రంలో సాధించిన దిగుబడికి గాను రాష్ట్ర వ్యాప్తంగా 13.97 లక్షల మంది రైతులకు మద్దతు ధర అందించామన్నారు. కొనుగోలు చేసిన ధాన్యం మొత్తానికి రూ.16,912 కోట్లు కాగా ఇందులో ఇప్పటికి రూ.16,602 కోట్లు చెల్లించినట్లు వెల్లడించారు. రాష్ట్రంలో సన్నాలను పండించేందుకు ముందెన్నడూ లేని రీతిలో రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రూ.500 బోనస్ ను సన్నాలు పండించిన రైతాంగం ఖాతాలో జమ చేశామని ఇప్పటి వరకు రూ.1,425 కోట్లు చెల్లించినట్లు వెల్లడించారు. కొనుగోలు ప్రక్రియను ప్రభుత్వం ఒక సవాల్ గా స్వీకరించి 8,448 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించడంతో పాటు అధికార యంత్రాంగం క్షేత్రస్థాయిలో ఎప్పటి కప్పుడు పర్యవేక్షించడంతో ధాన్యం కొనుగోలు ప్రక్రియ విజయవంతంగా ముగిసిందన్నారు. ధాన్యం దిగుబడిలోనే కాదు, ధాన్యం కొను గోలులోనూ రాష్ట్రం రికార్డు సృష్టించిందని ఇందులో ప్రధాన భాగస్వామ్మల తెలంగాణా రైతాంగానిదేనని అభినందించారు.

# బిసి రిజర్వేషన్లు పెంచాకే మున్సిపల్ ఎన్నికలు నిర్వహించాలి

### రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య

**హైదరాబాద్, జనవరి 13, ప్రభాతవార్త :** బీసీ రిజర్వేషన్లు పెంచాకే మున్సిపల్, ఎంపీటీసీ జెడ్పీటిసి ఎన్నికలు నిర్వహించాలని రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య డిమాండ్ చేసారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. బీసీ రిజర్వేషన్లు 42 శాతం పెంచకుండా మున్సిపల్, ఎంపీటీసీ, జెడ్పిటిసి ఎన్నికలు నిర్వహిస్తే సహించేది లేదని యుద్ధమే జరుగుతుందని రాజ్యసభ సభ్యుడు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు, బీసీ జేఏసీ చైర్మన్ ఆర్. కృష్ణయ్య హెచ్చరించారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో బీసీ రిజర్వేషన్ల అంశాన్ని ప్రస్తావనకు తీసుకురాకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. ఈ సమావేశాల్లోనే బీసీ రిజర్వేషన్ల అమలుపై చర్చించి, భవిష్యత్ కార్యాచరణపై స్పష్టమైన నిర్ణయం తీసుకుంటామని ప్రకటించారు. కనీసం చర్చ కూడా చేయలేదు. ప్రతిపక్షం చర్చకు తీసుకు రాకపోవడం దారుణం అని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రెండేళ్లగా 42 శాతానికి పెంచిన తర్వాతనే ఎన్నికలకు వెళతామని కొన్ని వందల సార్లు ప్రకటించి మోసం చేసి ఎన్నికలకు వెళ్లారు.



రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య

బీసీలకు అన్యాయం చేశారన్నారు. స్థానిక సంస్థల రిజర్వేషన్ల విషయంలో మహారాష్ట్ర, ఉత్తర ప్రదేశ్, మధ్యప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో కూడా బీసీలకు వ్యతిరేకంగా తీర్పులు వచ్చాయి. కానీ ఆ రాష్ట్రాలలో బీసీలు తిరగబడలేదు. కానీ మన రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్ల రక్షణ కోసం రాష్ట్ర బంద్ జరపడం గర్వించదగిందని అన్నారు. ఇది మన రాష్ట్రంలోని బీసీల చైతన్యానికి ప్రతీక అన్నారు. సర్పంచ్ ఎన్నికల సమయంలో ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఆర్. కృష్ణయ్య గుర్తు చేశారు. కేంద్ర నిధులు, హైకోర్టు తీర్పుల మేరకు గ్రామ పంచాయతీ ఎన్నికలు మాత్రమే నిర్వహిస్తామని, 42 శాతం బీసీ రిజర్వేషన్లు పెంచిన తర్వాతే ఎంపీటీసీ, జెడ్పిటిసి ఎన్నికలు జరిపిస్తామని సీఎం అప్పట్లో చెప్పారని తెలిపారు. ఇప్పుడు మాట మార్చి మున్సిపల్ ఎన్నికలకు సన్నాహాలు చేయడం ఆమోదయోగ్యం కాదని స్పష్టం చేశారు. అసెంబ్లీ సమావేశాల్లో బీసీ రిజర్వేషన్లపై కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు అఖిలపక్ష సమావేశం నిర్వహించి, ఢిల్లీకి అఖిల పక్షాన్ని తీసుకొని పోవడానికి రాజకీయ కార్యాచరణను ప్రకటించాలని సూచించారు. ఈసారి కోర్టుల్లో కేసులు వాదించేందుకు సీనియర్, జాతీయ స్థాయి గుర్తింపు ఉన్న ప్రముఖ న్యాయవాదులను నియమించాలని, హైకోర్టులో దాఖలైన 62 కేసులపై సమగ్రంగా చర్చించాలని కోరారు. గల్లీ నుంచి ఢిల్లీ వరకు పోరాటాలు చేశామని, ఇకముందు బీసీ జేఏసీ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా గెలిచిన 5,380 మంది బీసీ సర్పంచులతో జనవరి రెండో వారంలో బీసీ సర్పంచుల రాష్ట్ర ఆత్మీయ అభినందన సభ నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

## ట్రంప్ సుంకాల వేళ..

# అమెరికాకు ఖమేనీ హెచ్చరికలు

**టెహ్రాన్, జనవరి 13:** ఇరాన్‌తో వాణిజ్యం జరిపే అన్ని దేశాలపైనా 25 శాతం సుంకాలు విధిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరికలు చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇరాన్ సుప్రీంలీడర్ అయతొల్లా అలీ ఖమేనీ హెచ్చరికలు చేశారు. ఈ మేరకు ఎక్స్‌వేదికగా ఒక పోస్టు పెట్టారు. 'మా ఇరాన్ దేశం శత్రువుల ముందు తలొగ్గదని పలుమార్లు చాటిచెప్పాం. ఇప్పటికైనా అమెరికా రాజకీయ నాయకులు తమ మోసపూరిత చర్యలు ఆపాలని, మా దేశానికి ద్రోహం చేస్తోన్న కిరాయి వ్యక్తులపై ఆధారపడటం మానేయాలని హెచ్చరిస్తున్నాం. ఇరాన్ బలమైన, శక్తిమంతమైన దేశం. మాకు శత్రువు గురించి తెలుసు. వారిని ఎదుర్కోవడానికి మేం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటాం' అని ఖమేనీ ఖాతాలో రాసుకొచ్చారు. ఇరాన్‌పై చర్యల్లో భాగంగా ఆ దేశంపై వైమానిక దాడులు చేపట్టడం ఇక ఆప్షన్ కావొచ్చని ఇటీవల ట్రంప్ యంత్రాంగం ప్రకటించింది. ఈ క్రమంలోనే 25 శాతం సుంకాలు విధిస్తున్నట్లు, అవి తక్షణమే అమలులోకి వస్తాయని అధ్యక్షుడు ట్రంప్ వెల్లడించారు. ఇరాన్‌తో ఎక్కువగా వాణిజ్యం చేసే దేశాల్లో చైనా, తుర్కియే, యుఎఇ, ఇరాక్, భారత్ ఉన్నాయి. ఆర్థిక సంక్షోభం వల్ల ఇరాన్‌లో ఆందోళనలు జరుగుతున్నాయి. అదే సమయంలో ప్రభుత్వానికి అనుకూలంగా రాజధాని నగరం టెహ్రాన్‌లోని ఎంఘెలాబ్ స్క్వేర్ వద్ద వేలమంది ప్రదర్శనకారులు గుమిగూడారు.

## చైనా మాంజా వ్యవహారంలో

# సిటీ కొత్వాల్‌కు హెచ్‌ఆర్‌సి నోటీసులు

**హైదరాబాద్, జనవరి 13, ప్రభాతవార్త:** జంట నగరాలలో చైనా మాంజా కారణంగా అమాయకులు గాయపడుతున్న ఘటనలపై తెలంగాణ మానవ హక్కుల సంఘం స్పందించింది. దీనిపై సిటీ కొత్వాల్ సజ్జనార్‌కు మంగళవారం నోటీసులు జారీ చేసింది. న్యాయవాది ఇమ్మానేని రామారావు దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ చేబట్టిన హెచ్‌ఆర్‌సి ఈ మేరకు సజ్జన్నార్‌కు నోటీసులు ఇచ్చింది. దీనిపై ఫిబ్రవరి 26వ తేదీలోగా సమగ్ర నివేదిక ఇవ్వాలని హెచ్‌ఆర్‌సి ఆదేశించింది. చైనా మాంజాపై నిషేధం వున్నా అనేకచోట్ల వ్యాపా రులు యధేచ్ఛగా విక్రయా లు చేస్తున్నారని, దీని వల్ల రోడ్డుపై ప్రయాణించే వారు గాయపడుతు న్నారని ఆయన తెలిపారు. పక్షులు పెద్ద సంఖ్యలో ఇప్పటికే చని పోయాయని ఆయన తెలిపారు. దీనిపై పోలీసులు కేసులు నమోదు చేస్తున్నా విక్రయాలు ఆగడం లేదని న్యాయవాది ఆరోపించారు. దీనిపై హెచ్‌ఆర్‌సి విచారణ చేబట్టి వివరాల కోసం సిటీ కొత్వాల్‌ను ఆదేశించింది.

## కట్టమైసమ్మ ఆలయ అపవిత్ర ఘటనపై

# ఎమ్మెల్యే రాజాసింగ్ ఆగ్రహం

### నిందితుడికి బెయిల్ ఇవ్వరాదని డిమాండ్

**హైదరాబాద్ (నేరేడ్‌మెట్), జనవరి 13, ప్రభాతవార్త :** సఫిల్‌గుడా కట్ట మైసమ్మ దేవాలయంలో జరిగిన అపవిత్ర ఘటనను తీవ్రంగా ఖండిస్తూ గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ మంగళవారం ఆలయాన్ని సందర్శించి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై ప్రభుత్వం, పోలీసులు కఠినంగా వ్యవహరించకపోతే హిందూ సమాజం ఊరుకోదని హెచ్చరించారు. ఈ సందర్భంగా రాజసింగ్ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం హిందువుల పట్ల పక్షపాత ధోరణితో వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఇతర మతాల విషయంలో ఒకలా, హిందువుల విషయంలో మరోలా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. 2023 నుంచి రాష్ట్రంలో దేవాలయాలపై దాడులు పెరుగుతున్నాయని, ఎన్నికల వేళ మాత్రమే హిందూ ఓట్ల కోసం నాయకులు వస్తారని మండిపడ్డారు. కట్ట మైసమ్మ ఆలయంలో అపవిత్రానికి పాల్పడిన వ్యక్తి కర్ణాటక నుంచి వచ్చినవాడని పేర్కొంటూ, అతడిని పిచ్చివాడిగా చిత్రీకరించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. హిందువులు ఇలాంటి ఘటనకు పాల్పడితే పోలీసులు ఎలా స్పంది స్తారో ఆలోచించాలని ప్రశ్నిం చారు. ఇలాంటి ఘటనలకు కావా లనే శిక్షణ ఇచ్చి పంపిస్తు న్నారన్న అనుమానం వ్యక్తం చేశారు. అమ్మవారి సన్నిధిలో అపవిత్రం చేసిన షేక్ అల్తాఫ్‌కు బెయిల్ రాకుండా చూడాల్సిన బాధ్యత పోలీసులదేనని స్పష్టం చేశారు. ప్రభుత్వం వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యకర్తలను ఉద్దేశించి రాజసింగ్ మాట్లాడుతూ, ఎవరి మీద ఆధారపడకుండా హిందువులే ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ప్రివెంటివ్ అరెస్టులు చేసినా వెనక్కి తగ్గవద్దని సూచించారు. కట్ట మైసమ్మ ఆలయ ఘటనపై ప్రభుత్వం తక్షణమే స్పందించి నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని రాజసింగ్ మరోసారి డిమాండ్ చేశారు.

**బహిరంగ ప్రకటన**

తేది: 14.01.2026

గౌరవనీయ తెలంగాణ హైకోర్ట్ వారి ఎదుట శ్రీమతి ఎ.సునీల, నాంపల్లి XII అడిషనల్ చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ వారి ఎదుట పెండింగ్ వున్న CC No. 350 of 2017 లో ప్రొసీడింగ్స్ ఛాలంజింగ్ చేస్తూ Crl.P.No. 14219 of 2024 దాఖలు చేసారు. ప్రతివాది నం.లు 2, 5 మరియు 6. బి.జ్ఞానేశ్వర్, డి.కృష్ణారెడ్డి మరియు మోహన్‌రాజ్ అయి ఉన్నారు. న్యాయస్థానం 23-12-2025న ఈ ప్రతివాదులకు బదులు నోటీస్ నిర్దేశించి మరియు మేటర్‌ను 22-01-2026కు పోస్ట్ చేసింది. న్యాయస్థానం ఉత్తర్వు ఆదేశం ప్రకారం ఆ రోజుగానీ లేదా ఏ ఇతర తేదీన గానీ ప్రతివాదులు హాజరు కావడం విఫలమైతే, రికార్డుపై మెటీరియల్ యొక్క ఆధార ప్రాతిపదికన మేటర్ నిర్ణయించబడుతుంది.

సుహృద్భావంతో
సం/- TPS హర్ష, న్యాయవాది
మొబైల్: + 919493920888

**తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం వద్ద ఒక క్రొత్త రాజకీయ పార్టీగా రిజిస్ట్రేషన్ కావడానికి జారీ చేయబడిన నోటీసు**

(తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలతో ప్రచురించబడినది)

తేది: 07-01-2026

రాజకీయ పార్టీల రిజిస్ట్రేషన్ మరియు గుర్తుల కేటాయింపు ఉత్తర్వు, 2018 యొక్క నిబంధనలకు లోబడి "రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (భీంరావ్ అంబేద్కర్)" (పార్టీ పేరు) జాతీయ అధ్యక్షులు అయిన శ్రీ డా. భీంరావ్ యశ్వంత్ అంబేద్కర్ గారు తమ పార్టీని 'రిజర్వు గుర్తు లేని రాజకీయ పార్టీగా' తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం వద్ద నమోదు చేసుకొనుటకై అభిలషిస్తున్నట్లు సాధారణ ప్రజానీకానికి తెలియజేసేందుకు ఈ నోటీసు ఇవ్వడమైనది. ఈ పార్టీలో (1) ప్రొఫెసర్ డా. గాలి వినోద్ కుమార్, రాష్ట్ర అధ్యక్షులు గారు, (2) శ్రీ వల్లెపు మైసయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షులు గారు, (3) శ్రీ తొంట బాబు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గారు, (4) శ్రీ కమ్మంపల్లి మురళీకృష్ణ, కోశాధికారి గారు, ప్రధాన కార్యవర్గ సభ్యులు మరియు పార్టీ యొక్క కేంద్ర కార్యాలయం: సూరత్: 71, 3వ అంతస్తు, మాత్రు ఆశిష్ అపార్ట్‌మెంట్, త్రిభువన్ నగర్, సూరత్, గుజరాత్ - 395004, రాష్ట్ర కార్యాలయం: ఇం.నెం. 12-13-132/1, కీర్తియా రెసిడెన్సీ, ఫ్లాట్ నెం. 202, రోడ్ నెం. 3, తార్నాక, సికింద్రాబాద్ - 500017, తెలంగాణ రాష్ట్రం.

సదరు పార్టీ రిజిస్ట్రేషన్‌పై ఎవరికైనా ఏ విధమైన అభ్యంతరాలు ఉన్నట్లయితే, అట్టి అభ్యంతరాలను కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం, మొదటి అంతస్తు, టిటిసిపి భవనం, ఎ.సి. గార్డ్స్, హైదరాబాద్ - 500004 గారికి ఈ ప్రకటన ప్రచురితమైన పదిహేను రోజుల్లోగా పంపవలెను. నిర్ణీత గడువులోగా అభ్యంతరాలు రానియెడల, తెలంగాణ రాష్ట్రంలో పార్టీల పరంగా జరిగే స్థానిక సంస్థల ఎన్నికలలో పోటీ చేసేందుకు "రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (భీంరావ్ అంబేద్కర్)" (పార్టీ పేరు)ను ఒక రాజకీయ పార్టీగా నమోదు చేయు ప్రక్రియను రాష్ట్ర ఎన్నికల సంఘం చేపడుతుంది.

సం/- రాష్ట్ర అధ్యక్షులు, "రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (భీంరావ్ అంబేద్కర్)"
రాజకీయ పార్టీ పేరు, తెలంగాణ రాష్ట్రం.


# ప్రపంచ పర్యాటక కేంద్రంగా ఎపి

## ఆత్రేయపురంలో జరిగిన సంక్రాంతి సంబరాలలో మంత్రి కందుల దుర్గేష్

## కోనసీమలో వైభవంగా సర్ ఆర్థర్ కాటన్ గోదావరి ట్రోఫీ సంక్రాంతి సంబరాలు.

## పడవ పందేల ద్వారా విశ్వవ్యాప్తమైన ఆత్రేయపురం పేరు

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో జనవరి 13 (ప్రభాతవార్త):** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో పర్యాటక రంగానికి పూర్వవైభవం వచ్చిందని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. మంగళవారం ఆత్రేయపురంలో స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "సర్ ఆర్థర్ కాటన్ గోదావరి ట్రోఫీ సంక్రాంతి సంబరాలు 2026" మరియు బోట్ ఫెస్టివల్ ను మంత్రులు వంగలపూడి అనిత కొండపల్లి శ్రీనివాస్ తో కలిసి తిలకించారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ కీలక అంశాలను ప్రస్తావించారు. ఆత్రేయపురం గుర్తింపు దేశవ్యాప్తంగా కోనసీమ గొప్పతనాన్ని చాటిచెప్పేలా పడవ పందాలను నిర్వహించడం అభినందనీయం. ఆత్రేయపురం పేరును విశ్వవ్యాప్తం చేయాలన్న ఎమ్మెల్యే సత్యానందరావు కృషిని ప్రతి ఒక్కరూ అభినందించాలని మంత్రి దుర్గేష్ అన్నారు. గత ఐదేళ్లలో కుదేలైన పర్యాటక రంగాన్ని పునరుద్ధరిస్తున్నాం. ఒకప్పుడు పర్యాటకం అంటే కేరళ, రాజస్థాన్ గుర్తొచ్చేవి, కానీ నేడు ఆంధ్రప్రదేశ్ పర్యాటకానికి చిరునామాగా మారిందని పేర్కొన్నారు. ప్రధాని మోడీ, సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నేతృత్వంలో రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమంలో దూసుకుపోతోందని అన్నారు. పర్యాటక రంగానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ..పారిశ్రామిక హోదా.... కల్పించారని, దీనివల్ల పరిశ్రమలకు అందే రాయితీలు పర్యాటక ఇన్వెస్టర్లకు కూడా అందుతున్నాయని తెలిపారు. 202429 ద్వారా వేలాది కోట్ల పెట్టుబడులు వచ్చాయని, ప్రముఖ స్టార్ హోటళ్లు, రిసార్టులు రాష్ట్రానికి వస్తున్నాయని పేర్కొన్నారు. ఎకో టూరిజం, టెంపుల్ టూరిజం, అడ్వెంచర్, క్యారావాన్ టూరిజం వంటి విభిన్న పాలసీలతో ఆంధ్రప్రదేశ్‌ను ప్రపంచ స్థాయి పర్యాటక గమ్యస్థానంగా తీర్చిదిద్దుతామని మంత్రి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో హోం మంత్రి వంగలపూడి అనిత కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, ఇతర ప్రజాప్రతినిధులు మరియు అధికారులు పాల్గొన్నారు.




## సార్లంకపల్లె అగ్ని ప్రమాద బాధిత కుటుంబాలకు రూ.25 వేల ఆర్థిక సాయం

### సిఎం చంద్రబాబునాయుడు

**విజయవాడ,జనవరి 13,ప్రభాతవార్తప్రతినిధి:** సార్లంకపల్లెలో జరిగిన అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితులందరికి ప్రభుత్వం అండగా నిలుస్తుందని ఏపీ చంద్రబాబు స్పష్టం చేసారు. అగ్ని ప్రమాదంలో ఇళ్ళు కాలిపోయి, నిరాశ్రయులైన బాధితులకు తక్షణం ప్రత్యా మ్నయం కల్పిస్తామన్నారు. వారికి శాశ్వత గృహాలు నిర్మించి ఇచ్చేందుకు వీలుగా చర్యలు తీసుకుంటామన్నారు. కాకినాడ జిల్లా సార్లంకపల్లెలో జరిగిన అగ్నిప్రమాదంపై మంత్రులు, అధికారులతో ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. సిఎం మాట్లాడుతూ సంక్రాంతి పండుగ సమయంలో ఈ అగ్నిప్రమాదం విషాదాన్ని తెచ్చిందన్నారు. గ్రామంలో ఉన్న 38 తాటాకు ఇళ్లు కాలిపోయాయని.. బాధితులకు అన్ని విధాలుగా అండగా ఉండాలని అధికారులను ఆదేశించారు. బాధిత కుటుంబాలకు అందిస్తున్న సాయాన్ని హోం మంత్రి అనిత, ఇతర అధికారులు ఆయనకు వివరించారు. తక్షణసాయంగా ఒక్కో కుటుంబానికి రూ.25 వేల నగదు అందజేస్తున్నామని ప్రకటించారు. ఇల్లు కోల్పోయిన ప్రతి కుటుంబానికి కొత్త ఇల్లు మంజూరు చేయాలని చంద్రబాబు ఆదేశించారు. అప్పటివరకు వారికి అవసరమైన వసతి, ఇతర సహాయం అందించాలన్నారు. ప్రమాదంలో కాలిపోయిన డాక్యుమెంట్లు, ఆధార్ కార్డులు ఇచ్చేందుకు ప్రత్యేక క్యాంపులు నిర్వహించాలని సిఎం ఆదేశాలు జారీ చేశారు. బాధితులకు అందే సాయంపై మంత్రులు, జిల్లా ఉన్నతాధికారులు పర్యవేక్షించాలని సూచించారు.

# రాయచోటికి జరిగిన అన్యాయాన్ని పునర్విభజనలో సరిదిద్దుకుందాం: మంత్రి మండిపల్లి

**రాయచోటి జనవరి 13 ప్రభాతవార్త** అన్నమయ్య జిల్లా రాయచోటికి జరిగిన అన్యాయాన్ని పునర్విభజనలో సరిదిద్దుకుందాం అని రవాణా యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అన్నారని రాయచోటి జిల్లా సాధన జేఏసీ నాయకులు వార్తకు తెలిపారు. వివరాల లోకి వెళితే : ..మండిపల్లి ని కలిసిన రాయచోటి జిల్లా సాధన జేఏసీ జేఏసీ డిమాండ్‌ను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తా నని ఆయన జేఏసీ కి హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. జేఏసీ నాయకులు మంత్రి మండి పల్లి క్యాంప్ ఆఫీసులో కలిసి 14 మండలాల కేంద్రంగా ఉన్న రాయచోటిని ప్రత్యేక జిల్లా చేయడానికి కృషి చేయాలని రాయచోటి ప్రత్యేక జిల్లా చిత్రపటం తో కలిపి వినతి పత్రం అందజేశారు. 3 లక్షల 49 వేల జనాభాతో పోలవరం, 6 లక్షల 4వేలతో అల్లూరి సీతారామ రాజు జిల్లాలో ప్రభుత్వం ఏర్పాటు చేసిందని అదేవిధంగా రాయచోటి కేంద్రంగా ఉన్న 14 మండలాలలో 8 లక్షల పైబడి జనాభా ఉన్న రాయచోటిని ప్రత్యేకంగా గుర్తించి జిల్లా చేయడానికి కృషి చేయాలని మంత్రిని జేఏసీ నాయకులు కోరారు. దీనికి స్పందించిన మండిపల్లి అన్నమయ్య జిల్లాలోని రైల్వే కోడూరు ను తిరుపతిలోనూ రాజంపేట ని కడప లోను మదనపల్లి ను ప్రత్యేక జిల్లా చేయడం వలన భౌగోళికంగా రాయచోటి ఏకాకి అయిందని ఈ పరిస్థితుల దృష్ట్యా రాయచోటిని మదనపల్లిలో కలిపే పరిస్థితి వచ్చిందని అన్నారు. రాష్ట్రంలో నియోజకవర్గాల పునర్విభజన జరగబోయే సందర్భంలో ముఖ్యమంత్రి చంద్ర బాబు దృష్టికి రాయచోటికి జరిగిన అన్యాయాన్ని పూర్తిగా చర్చించి రాయచోటికి ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుందామని జేఏసీ నాయకులతో అన్నట్లు వారు తెలిపారు . జేఏసీ వారు ఇచ్చిన 14 మండలాల రాయచోటి ప్రత్యేక జిల్లా చిత్రపటాన్ని తాను పూర్తిగా పరిశీలించానని ఈ విషయాన్ని కూడా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని జేఏసీ నాయకులతో ఆయన అన్నారు. మంత్రిగారిని కలిసిన వారిలో జిల్లా సాధన జేఏసీ అధ్యక్షులు టి.ఈశ్వర్, ప్రధాన కార్యదర్శి ఎస్.రామాంజనేయులు జేఏసీ నాయకులు,జీవానందం గిరి బాబు యాదవ్, వీరబల్లి శ్రీనివాసులు రమేష్, చంద్రశేఖర్, మారుతి శంకర్, పల్లం తాతయ్య , శివ కుమార్, ఉత్తేజ్ కుమార్, మల్లి కార్జున శ్రీనివాసు రాజు, నాగరాజు శ్రీకాంత్, లక్ష్మీ నారా యణ, రాయచోటి చెన్న కృష్ణ, నూరుల్లా జనసేన నాయకులు వినయ్

# తిరుమల సమాచారం

## ఎస్వీఅన్నప్రసాదం ట్రస్ట్‌కు మాజీ సివిఎస్ఓ రూ.20లక్షలు విరాళం



**తిరుమల,జనవరి 13ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలకు వచ్చిన భక్తులకు ఆకలి అనేది తెలియకుండా రుచిగా శుచిగా అన్నప్రసాదాలు అందిస్తున్న శ్రీవేంకటేశ్వర అన్నప్రసాదం ట్రస్ట్‌కు దాత ,టిటిడి మాజీ సివిఎస్ఓ దామోదరం కుటుంబంతో 20లక్షలు రూపాయలు చెక్కులను విరాళంగా అందించారు. హైదరాబాద్‌కు చెందిన కృష్ణకాంత్, అజయ్‌చౌదరి కుటుంబం సభ్యులు ఈ విరాళాలను మంగళవారం టిటిడి అదనపు ఇఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరికి అందజేశారు.

## 'భర్తమహాశయులకు విజ్ఞప్తి' చిత్రం విజయవంతం

### శ్రీవారి సేవలో చిత్రబృందం



**తిరుమల,జనవరి 13ప్రభాత**
**వార్తప్రతినిధి:** సంక్రాంతి పండుగ ముందుగానే తెలుగు ప్రేక్షకులను ఆనందంలో ముంచెత్తడానికి మంగళవారం విడుదలైన భర్తమహాశయులకు విజ్ఞప్తి చిత్రం విజయవంతం కావాలని చిత్ర బృందం ఆకాంక్షించింది. చిత్రం నటి ఆషికారంగనాథ్, దర్శకుడు కిశోర్, తమిళనటుడు విజయకుమార్, నటి ప్రీతిహరి, దర్శకుడు హరి కుటుంబంతో కలసి తిరుమలకు వచ్చారు. మంగళవారం ఉదయం టిటిడి అధికారులు వీరికి స్వామివారి దర్శనం చేయించారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. టిటిడి ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయం వెలుపలకు వచ్చిన సినీనటులను అభిమానులు చూసి ఫోటోలు దిగేందుకు ఉత్సాహం చూపారు.

## పాదరక్షల భద్రతకు క్యూఆర్ కోడ్ ఆధారిత ఆధునిక వ్యవస్థ

### - టిటిడి అదనపు ఇఓ వెంకయ్యచౌదరి



**తిరుమల,జనవరి 13ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలకు వస్తున్న భక్తులు తమతమ పాదరక్షలను భద్రపరిచే కౌంటర్ల వద్ద క్యూఆర్ కోడ్ ఆధారిత ఆధునిక వ్యవస్థ ఏర్పాటుచేసినట్లు టిటిడి అదనపు ఇఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి తెలిపారు. తిరుమలకు వచ్చిన భక్తులు ఎదుర్కొంటున్న పాదరక్షల నిర్వహణ సమస్యకు శాశ్వత పరిష్కారంగా టిటిడి క్యూఆర్ కోడ్ ఆధారిత ఆధునిక పాదరక్షల నిర్వహణ వ్యవస్థను విజయవంతంగా అమలుచేస్తోందని వెల్లడించారు. వైకుంఠం క్యూకాంప్లెక్స్ 2 వద్ద పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించిన ఈ విధానం అద్భుత ఫలితాలు ఇవ్వడంతో తిరుమలలోని పలు ప్రాంతాల్లో ఎనిమిది కౌంటర్లను ప్రారంభించినట్లు ఆయన చెప్పారు. భక్తులు తమ పాదరక్షలను కౌంటర్ వద్ద అప్పగించగానే వారికి క్యూఆర్ కోడ్‌తో కూడిన రశీదు ఇస్తారని, ఆ రశీదులో పాదరక్షల సంఖ్య, సైజు, ర్యాక్ నంబర్, నిల్వ చేసిన స్థానం వంటి పూర్తి వివరాలు ఉంటాయని తెలిపారు. భక్తులు తిరిగి వచ్చి ఆ రశీదును స్కాన్ చేయగానే పాదరక్షలు ఉన్న ఖచ్చితమైన స్థానం డిస్‌ప్లే అవుతుందన్నారు. తద్వారా అతి తక్కువ సమయంలోనే భక్తులకు పాదరక్షలు తిరిగి అందజేయడం జరుగుతుందని అదనపు ఇఓ చౌదరి తెలిపారు. ఈ వ్యవస్థ అమలుతో 99శాతం మంది భక్తులు తమ పాదరక్షలను తిరిగి పొందుతున్నారని, గతంలో గుట్టలుగా పడిపోవడం వల్ల భక్తులు ఇబ్బందులు పడేవారన్నారు. ఈ వినూత్న ప్రాజెక్టును కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ సంస్థ తమ సిఎస్ఆర్ కార్యక్రమంలోభాగంగా పూర్తి స్థాయిలో అమలుచేస్తోందని తెలిపారు. భక్తులు తమ పాదరక్షలను ఎక్కడబడితే అక్కడ వదలకుండా, నిర్దేశిత కౌంటర్లలోనే డిపాజిట్ చేయాలని విజ్ఞప్తి చేశారు.

# వైభవంగా గోదాదేవి - శ్రీరంగనాధ స్వామి కల్యాణం

**జగ్గయ్యపేట, జనవరి 13, ప్రభాతవార్త :** ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేట పట్టణంలో అంగరంగ వైభవంగా గోదాదేవి-శ్రీరంగనాధ స్వామి వారి కళ్యాణ వేడుక జరిగింది. మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర నివాసంలో పూర్తిగా సంప్రదాయ సిద్ధంగా, శాస్త్రోక్తంగా నిర్వహించిన ఈవేడుకలో పాల్గొన్న మహిళలంతా సంప్రదాయ దుస్తులతో అలరించారు. స్థానిక ఎంఎల్ఏ, టిడిపి జాతీయ కోశాధికారి శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య), యువనేత శ్రీరాం ధనుంజయ, పలువురు కౌన్సిలర్లు, ప్రముఖులు ఈవేడుకలో పాల్గొన్నారు. శ్రీభగవద్రామానుజగోష్టి ప్రతినిధుల ఆధ్వర్యంలో జెఆర్‌సి విద్యాసంస్థల చైర్మన్ రంగాపురం నరసింహారావు-రుక్మిణి దంపతులు అత్యంత నియమ నిష్టలతో అమ్మవారు స్వామివార్ల కళ్యాణం సోమవారం రాత్రి పొద్దుపోయేవరకు కమనీయంగా నిర్వహించారు. కాగా పట్టణానికి చెందిన గృహిణి మామిడి హర్షిత ధనుర్మాసం పురస్కరించుకుని ముగ్గులతో గోదాదేవి అమ్మవారి కళ్యాణ ఘట్టాన్ని అత్యద్భుతంగా ఆవిష్కరించింది. ప్రకృతిలో లభించే సహజ రంగులను ఉపయోగించి లిఖించిన ఈ రంగవల్లి సందర్శకులను మంత్రముగ్ధుల్ని చేసింది. మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర కుటుంబ సభ్యురాలైన హర్షిత గత సంవత్సరం జనవరిలో ఆంధ్రప్రదేశ్ అమెరికన్ అసోసియేషన్ ప్రపంచస్థాయి ఆన్‌లైన్ ముగ్గుల పోటీల్లో పాల్గొని పలు రంగుల సమ్మేళనంతో శ్రీనివాసుని కళ్యాణ ఘట్టాన్ని పరమాద్భుతంగా ఆవిష్కరించి ప్రథమ బహుమతి రూ.15 లక్షల బహుమతిని గెలుచుకున్నారు. హర్షిత మూడు రోజులపాటు శ్రమించి లిఖించిన ఈ చిత్రం రంగవల్లిలా అనిపించలేదని, ఒక కళాఖండాన్ని తివాచీపై ముద్రించిన రీతిలో చూడగానే భావన కలుగుతోందని పలువురు సందర్శకులు అభిప్రాయం వ్యక్తంచేస్తూ హర్షితను అభినందించారు.



గోదాదేవి అమ్మవారి రంగవల్లి. (రంగులతో లిఖించిన మామిడి హర్షిత). గోదాదేవి, శ్రీరంగనాధ స్వామి వారి కళ్యాణ వేడుకలో ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్, మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర

## తెలుగు ప్రజలకు మంత్రి సుభాష్ సంక్రాంతి శుభాకాంక్షలు

**విజయవాడ,జనవరి13,ప్రభాతవార్తప్రతినిధి:** తెలుగు రాష్ట్రాల్లో సంక్రాంతి వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా తెలుగు ప్రజలకు, దేశ విదేశాల్లో ఉన్న తెలుగుజాతి ప్రజలందరికీ రాష్ట్ర కార్మిక శాఖ మాత్యులు వాసంశెట్టి సుభాష్ సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ మహా సంక్రాంతి పర్వదినాన ప్రజలందరి మనోవాంఛలు నెరవేరాలని, వారి కుటుంబాల్లో భోగ భాగ్యాలు, సిరి సంపదలు, ఎల్లలు లేని ఆనందం నింపాలని మనస్ఫూర్తిగా భగవంతుని కోరుకుంటున్నానని అన్నారు. తెలుగువారి సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి అని, ఈ పండుగ శుభవేళ రాష్ట్ర ప్రజలందరు, రామచంద్రపురం నియోజవర్గంలోని ప్రతి కుటుంబంలో సుఖ సంతోషాలుతో నిండి పోవాలని కోరుకుంటున్నానన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు వారందరికీ మంత్రి సుభాష్ గారు భోగి, సంక్రాంతి, కనుమ శుభాకాంక్షలు తెలిపారు.

## అమరావతిలో పలు ప్రాజెక్టులకు ల్యాండ్ పూలింగ్ జరుగుతోంది :మంత్రి నారాయణ

**విజయవాడ,జనవరి 13,ప్రభాతవార్తప్రతినిధి:** అమరావతిలో పలు ప్రాజెక్టులకు ల్యాండ్ పూలింగ్ జరుగుతోందని ఏపీ పురపాలక శాఖ మంత్రి నారాయణ వ్యాఖ్యానించారు. అమరావతి మండలంలోని 3 గ్రామాల్లో మొదటి రోజే 1000 ఎకరాలు పూలింగ్‌కు ఇచ్చారని పేర్కొన్నారు. అంటే మూడు గ్రామాల్లో 25 శాతం ల్యాండ్ పూలింగ్ పూర్తైందని చెప్పుకొచ్చారు. అమరావతి మండలం కర్లపూడిలో మంగళవారం రోడ్డు పనులకు మంత్రి నారాయణ, ఎమ్మెల్యే బాష్యం ప్రవీణ్ శంకుస్థాపన చేశారు. నిన్న ల్యాండ్ పూలింగ్ ప్రారంభానికి వెళ్లిన మంత్రిని రోడ్డు వేయాలని రైతులు కోరారు. రైతులు అడిగిన వెంటనే రోడ్డు నిర్మాణానికి అంచనాలు సిద్ధం చేయించి.. కాంట్రాక్ట్ సంస్థకు పనులు అప్పగించారు. కర్లపూడి నుంచి అనంతవరం వరకు.. 2.9 కిలోమీటర్ల రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. వారం రోజుల్లో రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని కాంట్రాక్ట్ సంస్థకు మంత్రి ఆదేశాలు జారీ చేశారు. భూములిచ్చిన రైతులను తాను ప్రత్యేకంగా అభినందిస్తున్నానని అన్నారు. ఎమ్మెల్యే ప్రవీణ్ దగ్గరుండి రైతులను ఒప్పిస్తున్నారని తెలిపారు.

## లేపాక్షి దుకాణాల్లో కళాకృతుల విక్రయాలపై 30 శాతం రాయితీ

**విజయవాడ.జనవరి13,ప్రభాతవార్తప్రతినిధి:** లేపాక్షి దుకాణాల్లో కళాకృతుల విక్రయాలపై 30 శాతం వరకూ రాయితీ అందిస్తున్నట్లు చేనేత జౌళిశాఖ మంత్రి ఎస్ సవిత తెలిపారు. సంక్రాంతి పండగ దృష్ట్యా రాయితీపై అమ్మకాలు చేపట్టినట్లు వెల్లడించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో లేపాక్షి అధికారులతో సమీక్షా సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. విశాఖపట్నం, అనంతపురం, కడప లేపాక్షి దుకాణాలు వినియోగదారులను ఆకట్టుకునేలా అభివృద్ధి చేయనున్నట్లు చెప్పారు. ఇందుకోసం ఒక్కో

# సంక్రాంతికి అదనపు బస్‌చార్జీలు లేవు

## - ప్రైవేట్ బస్‌లు చార్జీలు పెంచి అక్రమ వసూళ్లు చేస్తే సీజ్ చేస్తాం : మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

**సచివాలయం,జనవరి 13,ప్రభాతవార్త :** సంక్రాంతి పండుగ సందర్భంగా సొంత ఊళ్ళకు వెళ్ళే ప్రయాణీకుల సౌకర్యార్థం రాష్ట్ర ప్రభుత్వం పలు కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు రవాణా శాఖమంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి కార్యాలయం నుండి మంగళవారం ప్రకటన విడుదల చేశారు. పండుగ రద్దీ దృష్ట్యా మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం యధావిధిగా కొనసాగుతుందని, సంక్రాంతి సందర్భంగా ఎలాంటి అదనపు చార్జీలు విధించబోమని స్పష్టంచేశారు. ఈ ఏడాది ఆర్టీసీ చార్జీల్లో కూడా ఎలాంటి పెంపు లేదన్నారు. సొంత వాహనాలు, ప్రైవేట్ వాహనాల్లో ప్రయాణించే వారు జాగ్రత్తగా నిబంధనలు పాటిస్తూ క్షేమంగా సొంతూళ్ళకు చేరుకోవాలని మంత్రి ఆకాంక్షించారు. సంక్రాంతికి సొంతూళ్ళకు వెళ్ళే ప్రయాణీకులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరపున ఇది పండుగ కానుక అని అన్నారు. అదే విధంగా ప్రైవేట్ బస్సుల అక్రమంగా చార్జీలు పెంచితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నిబంధనలకు విరుద్ధంగా అధిక చార్జీలు వసూలు చేస్తే సంబంధిత బస్సులను సీజ్ చేయడం జరుగుతుందని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి స్పష్టం చేశారు. పండుగను ప్రజలు ఆనందంగా, సురక్షితంగా జరుపుకోవాలని మంత్రి ఆకాంక్షించారు.

# ఏప్రిల్ ఆఖరుకల్లా 98 ఎఐ ఆధారిత యూస్ కేసెస్ సిద్ధం

## : ఐటి ఆర్టీజి శాఖల కార్యదర్శి భాస్కర్ కాటంనేని

**విజయవాడ,జనవరి 13,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రభుత్వంలోని ప్రతి శాఖ ప్రజలకు అందించే అన్ని సేవలను తప్పనిసరిగా ఆన్‌లైన్‌లోనూ, మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్‌లోనే అందించాలని ఐటీ, ఆర్టీజీ శాఖ కార్యదర్శి భాస్కర్ కాటంనేని అన్నారు. వాట్సాప్ గవర్నెన్స్ మనమిత్ర ద్వారా ప్రజలకు ప్రభుత్వ సేవలన్నీ ఎలాంటి అంతరాయం లేకుండా అందించాలనేది ముఖ్యమంత్రి ఆశయమన్నారు. దానికి అనుగుణంగా ఇప్పటికే అన్ని చర్యలు తీసుకున్నామన్నారు. అయితే ఇప్పటికీ కొన్ని శాఖలు మాన్యువల్‌గా సేవలందిస్తున్నాయని, ఇకపైన ప్రజలకు ప్రభుత్వ శాఖలు అందించే సేవలన్నీ కూడా ఆన్‌లైన్ ద్వారా, మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా మాత్రమే అందించాలని కోరారు. ఈ దిశగా ఆయా శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. వాట్సాప్ గవర్నెన్స్ వినియోగిత పెరిగేలా క్షేత్రస్థాయిలో జిల్లా కలెక్టర్లు అవగాహన కల్పించే చర్యలు చేపట్టాలని కోరారు. డేటా అనుసంధానం ప్రక్రియ పూర్తైందని, దీనిద్వారా ఆయా శాఖలకు ఉపయోగపడేలా యూస్ కేసెస్ సిద్ధం చేస్తున్నామని ఏప్రిల్ నెలాఖరుకు ఈ యూస్ కేసెస్ అందుబాటులోకి తెస్తామన్నారు. అవేర్ వల్ల బహుళ ప్రయోజనాలు రియల్ టైములో వాతావరణం గురించి తెలుసుకోవడమే కాకుండా బహుళ ప్రయోజనాలుండేలా ఆర్టీజీఎస్ అవేర్ విభాగం పనిచేస్తోందని తెలిపారు. అవేర్‌ను అన్ని శాఖలు సమర్థవంతంగా వినియోగించుకోవాలని కోరారు. అవేర్ ద్వారా విస్తృత ప్రయోజనాలు కలిగేలా 50 వరకు యూస్ కేసెస్ సిద్ధం చేస్తున్నామని చెప్పారు. ఏ శాఖ అయినా ఈ విభాగాన్ని తమ అవసరాలకు తగ్గట్టు ఉపయోగించుకోవచ్చని తెలిపారు. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ ఆధారితంగా ఉపయోగపడే 98 యూస్ కేసెస్‌ను ఇప్పటికే సిద్ధం చేసినట్లు తెలిపారు. ఆయా శాఖలు తాము మరింత సులభంగా సరళతరంగా సేవలించడానికి వీలుగా ఎలాంటి యూస్ కేసెస్ కావాలని కోరుకుంటున్నారో తమకు తెలియజేయాలని ఇప్పటికే కోరామని, ఆయా శాఖలు ఆ దిశగా తమ అవసరాలను తెలియజేస్తే ఇప్పుడు సిద్ధం చేస్తున్న యూస్ కేసెస్‌తో పాటు శాఖలు కోరిన విధంగా కూడా యూస్ కేసెస్ సిద్ధం చేసి ఇస్తామని తెలిపారు.

# పవన్ కల్యాణ్‌ను అభినందించిన ప్రధాని నరేంద్ర మోడీ






**విజయవాడ, జనవరి13,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పురాతన జపనీస్ సమురాయ్ యుద్ధ కళ అయిన కెంజుట్సులో అధికారికంగా ప్రవేశం పొందారు. ఈ క్రీడలో ఉన్నతస్థాయిని సాధించినందుకు ప్రధాని నరేంద్ర మోదీ ఆయనను ప్రత్యేకంగా అభినందించారు. ఒక ప్రజా ప్రతినిధిగా ఉంటూ మరోవైపు సినిమా కెరీర్ కొనసాగిస్తూ క్రమశిక్షణ, నిజా యితీతో మార్షల్ ఆర్ట్స్ అభ్యసించడం యువతకు స్ఫూర్తిదాయకమని ప్రధాని పేర్కొన్నారు. పవన్ సాధించిన విజయం ద్వారా వృత్తిపరమైన బాధ్యతలు కొత్త విషయాలు నేర్చుకునేందుకు అడ్డంకి కాదన్న బలమైన సందేశాన్ని యువతకు ఇచ్చారన్నారు. ఇంతటి కఠినమైన సంప్రదా యాన్ని అనుసరించడం ఆయన వ్యక్తిత్వాన్ని తెలియజేస్తోందని చెప్పుకొచ్చారు. ఫిట్‌నెస్ పట్ల తనకున్న క్రమశిక్షణ, నిబద్ధత ఎంతో మందికి ప్రేరణ ఇస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. యుద్ధ కళలు అభ్యసించడానికి శారీరక బలంతోపాటు మానసిక సమతుల్యత, సహనం, స్వీయ నియంత్రణ అవసరం. ఇంతటి కఠినమైన సంప్రదాయాన్ని అనుసరించడం మీ వ్యక్తిత్వాన్ని తెలియజేస్తోంది. ఆరోగ్యకరమైన, చురుకైన సమాజాన్ని నిర్మించాలన్న లక్ష్యంతో రూపొందించిన ఫిట్ ఇండియా లాంటి కార్యక్రమాలకు ప్రజా జీవితంలో ఉన్న మీలాంటి వ్యక్తులు స్ఫూర్తినివ్వాల్సిన అవసరం ఉంది. ఫిట్నెస్ పట్ల మీకున్న క్రమశిక్షణ, నిబద్ధత ఎంతో మందికి ప్రేరణ ఇస్తుంది. మీరు సాధించిన ఈ విజయానికి మరోసారి అభినందనలు. భవిష్యత్తులో మీరు చేసే ప్రతి ప్రయత్నంలో విజయాలు సాధించాలని కోరుకుంటున్నాను" అని శ్రీ మోదీ గారు తమ సందేశంలో పేర్కొన్నారు. భవిష్యత్తులో పవన్ చేసే ప్రతి ప్రయత్నంలో విజయాలు సాధించాలని ప్రధాని మోదీ ఆకాంక్షించారు మోదీజీ పంపిన ఆత్మీయ అభినందన సందేశం నాకు గొప్ప గౌరవం. ప్రధాని మోదీ ప్రశంసలపై పవన్ కల్యాణ్ స్పందిస్తూ.. "మోదీజీ పంపిన ఆత్మీయ అభినందన సందేశం నాకు గొప్ప గౌరవం. ప్రేమపూర్వకమైన మీ సందేశం నాకు మరింత ప్రోత్సాహాన్ని ఇస్తుంది. యుద్ధకళలు శారీరక శ్రమ, ఏకాగ్రతతోపాటు ఒత్తిడిని తట్టుకునే శక్తినిస్తాయి. మీ నాయకత్వంలో బలమైన, దృఢమైన భారతదేశం నిర్మితమవుతుంది. స్వామి వివేకానంద ఆకాంక్షించిన బలమైన సమాజం ఆవిష్కృతమవుతుంది. ఈ అభినందన సందేశం పంపించిన నరేంద్ర మోదీకి కృతజ్ఞతలు అని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

# ప్రజలకు మేలు చేసే ప్రభుత్వం ఎన్‌డిఏ కూటమి

## - దేవాదాయ మంత్రి ఆనం - ఎంపి వేమిరెడ్డితో కలిసి అభివృద్ధి పనులకు శ్రీకారం

**అనుమసముద్రంపేట (నెల్లూరు), జనవరి 13, ప్రభాతవార్త :** ఏఎస్‌పేట మండలంలోని మదారాబాద్, కావలి యడవల్లి గ్రామంలో ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి తో కలిసి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. మంగళవారం విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్మించిన విపిఆర్ అమృతధార మినరల్ వాటర్ ప్లాంట్‌ను మంత్రి ఆనం, ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. మదారాబాద్‌లో జలజీవన్ మిషన్ కింద 22లక్షలతో చేపట్టిన తాగునీటి పథకాన్ని ప్రారంభించారు.

మదారాబాదు గ్రామంలో నేతలకు స్థానిక ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు భారీగా పల్లె పండుగ ర్యాలిని నిర్వహించి ఘనస్వాగతం పలికారు. మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఎన్ని ఆర్థిక ఇబ్బందులున్నా వాటిని అధిగమిస్తూ గ్రామాల్లో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులను చేపడుతున్నామన్నారు. సంగం-కలిగిరి రహదారిని డబుల్ రోడ్డుగా మార్చేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలతో రాష్ట్ర రహదారుల శాఖామంత్రి బిసి జనార్ధన్‌రెడ్డి అనుమతి ఉత్తర్వులిచ్చారన్నారని ఇది చాలా సంతోషకరమైన విషయమన్నారు. త్వరలోనే మంత్రుల సమక్షంలో వైభవంగా భూమిపూజ కార్యక్రమాన్ని నర్విహిస్తామన్నారు. తమ ప్రభుత్వం పల్లె పండుగ కార్యక్రమంలో గ్రామాలకు సరికొత్త సంక్రాంతి శోభను తీసుకొచ్చిందని మంత్రి ఆనం పేర్కొన్నారు. ఈగ్రామంలోని ఆలయ నిర్మాణాన్ని పూర్తి చేస్తామని, కళ్యాణ మండపం నిర్మాణానికి కూడా ప్రభుత్వం ద్వారానే నిధులు మంజూరు చేస్తామని ఆనం స్పష్టం చేశారు. ఒకవైపు అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతూ ప్రజల ఆకాంక్షల మేరకు ప్రజా సంక్షేమ కార్యక్రమాలను చేపడుతూ ప్రజలకు అన్ని విధాల మేలు చేసే ప్రభుత్వం కూటమి ప్రభుత్వమన్నారు. ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ పేద ప్రజలకు సేవ చేసేందుకు విపిఆర్ ఫౌండేషన్ ఏర్పాటు చేశామన్నారు. విపిఆర్ నేత్ర కార్యక్రమం ద్వారా ఉదయగిరి నియోజకవర్గంలోని వరికుంటపాడు, సీతారామపురం, ఉదయగిరిలో 15వేల మందికి కంటి పరిక్షలు చేసి 8వేల మందికి ఉచితంగా అద్దాలు అందజేశామన్నారు. అనుభవం ఉన్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సారథ్యంలో ప్రతి చోటా అభివృద్ధి కన్పిస్తోందన్నారు. ప్రతి వాటర్‌ప్లాంట్ మెయింటైన్ తామే నిర్వహిస్తామన్నారు.

తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, ఉచిత బస్సు వంటి సూపర్‌హిట్ పథకాలను అమలు చేస్తూ ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారని గుర్తు చేశారు. ఈకార్యక్రమంలో ఆర్‌డిఓ పావని, వివిధ శాఖల అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



మినరల్ వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభించిన వేమిరెడ్డి



# గోదాదేవి కల్యాణం

గోదాదేవి చిన్ననాటి నుంచి కృష్ణుడి లీలలను ఆడుతూపాడుతూ పెరిగిందే. యుక్తవయసు వచ్చేసరికి ఆ భక్తి కాస్తా ప్రేమగా మారిపోయింది. కళ్లుమూసినా, తెరిచినా ఆ నల్లనివాడే కనిపించసాగాడు. తన చుట్టూ ఉన్న స్నేహితురాళ్లంతా ఒకప్పటి గోపికలనీ, తానుండే విల్లిపుత్తూరు ఒకనాటి గోకులమని భావించసాగింది. అంతేకాదు! తన తండ్రి విష్ణుచిత్తుడు రోజూ భగవంతుని కోసం రూపొందించే మాలలను ముందు తనే ధరించి, తనలో ఆ కృష్ణుని చూసుకుని మురిసిపోయేది. ఈ దృశ్యం ఒకరోజు విష్ణుచిత్తుని కంట పడనే పడింది. తన కూతురు చేసిన పని వల్ల ఇన్నాళ్లూ ఆ దేవదేవుని పట్ల అపచారం జరిగిందని బాధపడ్డాడు.

కానీ ఆ రోజు కృష్ణుడు అతనికి కలలో కనిపించి, గోదాదేవి సాక్షాత్తూ భూదేవి అవతారమేననీ, ఆమె వేసుకున్న మాలలను ధరించిడం వల్ల తనకు అపచారం కాదు కదా, ఆనందం కలుగుతుందనీ తెలియచేశాడు. ఇలాంటి సంఘటనలన్నీ గోదా మనసులో కృష్ణప్రేమని మరింతగా పెంచాయి. తనకు పెళ్లంటూ జరిగితే ఆయనతోనే జరగాలని అనుకుంది. అందుకోసం ఒకప్పుడు గోపికలు చేసిన కాత్యాయని వ్రతాన్ని మొదలుపెట్టింది. ఈ వ్రతం చేయాలంటే ఆహారానికీ, అలంకారానికీ సంబంధించిన చాలా కఠినమైన నియమాలని పాటించాల్సి ఉంటుంది. అలా గోదాదేవి తాను వ్రతాన్ని పాటించడమే కాకుండా తన చెలికత్తెలని కూడా ప్రోత్సహించింది. తన స్నేహితురాళ్లను మేలుకొలిపేందుకు, వారికి వ్రత విధానాలను తెలియచేసేందుకు, తనలో కృష్ణభక్తిని వెల్లడించేందుకు 30 పాశురాలను పాడింది గోదా. అవే ధనుర్మాసంలో ప్రతి వైష్ణవభక్తుని ఇంట్లోనూ వినిపించే తిరుప్పావై! ఇలా సాగుతున్న గోదాదేవి ప్రేమకు, ఆ కృష్ణుడు లొంగక తప్పలేదు. దాంతో ఆయన విష్ణుచిత్తునికి కనిపించి, గోదాదేవిని శ్రీరంగానికి తీసుకురమ్మనీ.. అక్కడ రంగనాథునిగా వెలసిన తాను గోదాదేవిని వివాహం చేసుకుంటాననీ చెప్పాడు. కృష్ణుని ఆదేశాలను విన్న విష్ణుచిత్తుని సంతోషానికి అవధులు లేకుండా పోయాయి. వెంటనే గోదాదేవినీ, విల్లిపుత్తూరులోని ప్రజలనూ తీసుకుని శ్రీరంగానికి బయల్దేరాడు. అక్కడ వారి రాక గురించి ముందే తెలిసిన అర్చకులు వారిని ఆలయంలోకి తీసుకువెళ్లారు. పెళ్లికూతురిగా గర్భగుడిలోకి ప్రవేశించిన గోదాదేవి, అందరూ చూస్తుండగా ఆ రంగనాథునిలో ఐక్యమైపోయింది. ఇదంతా మకర సంక్రాంతికి ముందు భోగిరోజు జరిగింది. అందుకే ప్రతి వైష్ణవాలయంలో భోగినాడు గోదాదేవికి, విష్ణుమూర్తితో కళ్యాణం జరుపుతారు. ◻

# తిరుప్పావై

## 30వ పాశురము



వంగక్కడల్ కడైంద మాదవనై
కేశవనై
తింగళ్ తిరుముగత్తు చ్చేయిళై
యార్ శెనిరైంజి,
అంగప్పఱై కొండవాత్తై:
యణిపుదువై
పైంగమల తణ్తెరియల్
పట్టర్పిరాన్ కోదై శొన్న
శంగ తమిళ్ మాలై ముప్పదుం
తప్పామే,
ఇంగు ఇప్పరిశురైప్పార్
ఈరిరండు మాల్వరైత్తోళ్
శెంగణ్ తిరుముగత్తు చ్చెల్వత్తిరు
మాలాల్,
ఎంగుం తిరువరుళ్ పెత్తు

పాలసముద్రమును మధించగా వచ్చిన లక్ష్మీ ్మదేవిని పొందిన మాధవుడు, బ్రహ్మరుద్రులను నియమించిన వాడు, చంద్రుని పోలిన ముఖముగలవాడు, అందమైన ఆభరణములు ధరించి గోపికలచే స్తుతించబడినవాడు అయిన కృష్ణుణ్ణి సర యసు సాధనమును లోకుల కొరకు, తమకు భగవత్ దాస్యము గోపికలు కోరుతున్నారు. శ్రీవిల్లిపుత్తూరులో కల విష్ణుచిత్తుడి కుమార్తె అయిన గోదా తామర పూలతో తయారైన పూలమాలలు ధరించి గోపికలను నమూ హములుగా అనుభవించిన ద్రవిడభాషలో వ్రాసిన ముప్పది పాశురములు క్రమము తప్పకుండా పాడిన నాలుగు భుజ ములు గలవాడు ఎర్రనైన వాత్సల్య పూర్వకమగు నేత్రములు కలవాడు ఐశ్వర్యముచే పూర్ణుడు అయిన శ్రీవల్లభుడగు నారాయణుడు మనపై కరుణజూపును. ఆనందము నిచ్చును. ఫలం : "శ్రీపతికటాక్షం"

# సంక్రాంతి భోగి పండ్లు

మకర సంక్రాంతి ముందు రోజు జరుపుకొనేదే భోగి పండుగ. ఇది ముఖ్యంగా వ్యవసాయం ఆధారంగా జీవనం సాగించే రైతుల పండుగ. ప్రతి లోగిలీ ధాన్యరాశులతో కళకళలాడుతూ దర్శనమిస్తుంది. గతంలో అనుభవించిన కష్టాలకు ముగింపు పలుకుతూ 'భోగి'తో భోగ భాగ్యాలను తమ జీవితంలోకి ఆహ్వానిస్తారు. గోదాదేవి రంగనాథుణ్ని చేపట్టిన రోజు కూడా ఇదే.



మకర సంక్రాంతి ముందు రోజు జరుపుకొనేదే భోగి పండుగ. ఇది ముఖ్యంగా వ్యవసాయం ఆధారంగా జీవనం సాగించే రైతుల పండుగ. ప్రతి లోగిలీ ధాన్యరాశులతో కళకళలాడుతూ దర్శనమిస్తుంది. గతంలో అనుభవించిన కష్టాలకు ముగింపు పలుకుతూ 'భోగి'తో భోగ భాగ్యాలను తమ జీవితంలోకి ఆహ్వానిస్తారు. గోదాదేవి రంగనాథుణ్ని చేపట్టిన రోజు కూడా ఇదే. భోగి నాడు చిన్నపిల్లలకు భోగి పండ్లు పోసే సంప్రదాయం ఉన్నది. రేగు పండ్లను తల మీద పోయడం వల్ల పిల్లల మీద ఉన్న చెడు దృష్టి తొలగిపోయి నారాయణుడి అనుగ్రహం లభిస్తుందని భావిస్తారు. తల పైభాగంలో బ్రహ్మరంధ్రం ఉంటుంది. భోగి పండ్లను పోసి దాన్ని ప్రేరేపితం చేస్తే, పిల్లల్లో జ్ఞానం పెరుగుతుందని ఒక నమ్మకం. రేగుపండ్లు, చెరకుగడలు, బంతిపూల రెక్కలు, చిల్లర నాణేలను భోగి పండ్లుగా వాడతారు. రేగు పండ్లకు బదరీఫలాలని పేరు. శివుణ్ని ప్రసన్నం చేసుకోవడానికి నర, నారాయణులు బదరికావనంలో తపస్సు చేస్తుండగా, వారి తలల మీద దేవతలు బదరీ ఫలాలను కురిపించారట. ఆనాటి సంఘటనకు ప్రతీకగా పిల్లలను నారాయణుడిగా భావించి భోగి పండ్లను పోసే సంప్రదాయం ఏర్పడిందని చెబుతారు. ఎరుపు రంగులో ఉండే రేగు పండ్లను సూర్యుడికి ప్రతీకగా భావిస్తారు. అలా ఆదిత్యుడి ఆశీస్సులు పిల్లలకు లభిస్తాయని భోగిపండ్లు పోస్తారు. ◻

# పండుగ వేళ పట్టందాలు



**చిన్నాపెద్ద కుచ్చులతో నిండిన రంగుల్లో జరీ అంచు మెరుపులతో కళ్లను కట్టిపడేసే పరికిణీ... బారసాల వేడుకైనా సంక్రాంతి పండుగొచ్చినా ఏంచుకునే అందమైన సంప్రద వస్త్రధారణ... దక్షి ణాదిన పుట్టిన ఏ అమ్మాయికైనా ఓ మధుర జ్ఞాపకం!**

పూర్వం సంపన్నులకీ రాజకుటుంబీకులకీ మాత్రమే సొంతమైన పట్టు పరికిణీ క్రమేణా సామాన్యులకీ వచ్చింది. అప్పట్లో కంచిపట్టు వాడకమే ఎక్కువ. ఇప్పుడైతే ఆరణి, ధర్మవరం, పోచంపల్లి, ఉప్పాడ, నారాయణపేట, టిష్యూ, చందేరి, పైతానీ, గద్వాల... ఇలా అన్నింట్లోనూ పరికిణీకోసం నేస్తున్నారు. వీటికి ఇమిటేషన్లూ వస్తున్నాయి. దాంతో పేదాగొప్పా. తమ స్థాయికి తగ్గ పట్టు పరికిణీలతో పాపాయిల్ని ముద్దుగా రెడీ చేస్తున్నారు. ఏమయినా పరికిణీ కట్టిన అమ్మాయి అందమే వేరు. అందుకే ఫ్యాన్సీ డ్రెస్సులెన్ని వచ్చినా పట్టుపరికిణీ మరిన్ని కుచ్చులతో ఇంకాస్త అందంగా విచ్చుకుంటోంది. వివిధ ఎంబ్రాయిడరీలతో డిఫినిషన్ హోదాని సంతరించుకుంది, కుచ్చుల్లోనూ దానిమీద వేసుకునే బ్లౌజుల్లోనూ వైవిధ్యమైన డిజైన్లతో అమ్మాయి మనసు దోచుకుం టుంది. ఇందుకు కాదూ, పట్టు పరికిణీ అమ్మాయి జీవితంలో అందమైనది జ్ఞాపకంగా నిలిచిపోయేది! ◻

## పాటించేద్దాం..

అల్లం వెల్లుల్లి పేస్ట్ తయారు చేసేటప్పుడు కొద్దిగా ఉప్పు, నూనె వేసి మిక్సీ చేయాలి. అలానే రుబ్బాక కొద్దిగా నిమ్మరసం, పసుపు కలిపి ఫ్రిడ్జ్‌లో పెట్టుకుంటే ఎక్కువ రోజులు పాడవ్వకుండా ఉంటుంది. పప్పులు త్వరగా పురుగు పట్టకుండా ఉండాలంటే నిల్వ ఉంచిన డబ్బాలో నాలుగైదు వెల్లుల్లి రెబ్బలను సగానికి కట్ చేసి వేసుకోవాలి. ◻

## రంగవల్లి



18 చుక్కలు
6 వరుసలు
ఇటు అటు వదిలి
6 వరకు



- భార్గవి
సరూర్‌నగర్





-సుమతి
విద్యానగర్
హైదరాబాద్

16 చుక్కలు,
6 వరుసలు, ఇటు
అటు వదిలి
6 వచ్చే వరకు

# 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' ఎంజాయ్ చేసే సినిమా: -కిషోర్ తిరుమల



మాస్ మహారాజా రవితేజ, కిషోర్ తిరుమల దర్శకత్వంలో, సుధాకర్ చెరుకూరి ఎస్ఎల్‌వి సినిమాస్ బ్యానర్‌పై నిర్మిస్తున్న ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'భర్త మహాశయులకు విజ్ఞప్తి'. డింపుల్ హయతి, ఆషిక రంగనాథ్ కథానాయి కలుగా నటించిన ఈ చిత్రం, డైరెక్టర్ కిషోర్ తిరుమల విలేకరుల సమావేశంలో సినిమా విశేషాల్ని పంచుకున్నారు.

**భర్త మహాశయులకు విజ్ఞప్తి కథ ఎలా ఉండబోతుంది?**

ఒక భర్త తన అనుభవం వల్ల మిగతా భర్తలకి ఏం చెప్తున్నాడు.. తను ఎలాంటి స్ట్రగుల్స్ ఎదుర్కొన్నాడు అనేది కథలోని ప్రధాన అంశం. ఈ సినిమాలో సత్య నటించిన ఒక పాటకి కొరియోగ్రఫీ కూడా చేశాను. అదొక చిన్న బిట్ సాంగ్. ఆ పాట ఎంటర్టైనింగ్‌గా ఉంటుంది.

**ఈ కథకి ముందు రవితేజ గారిని అనుకున్నారా?**

అవునండి. రవితేజ గారితో చేద్దామని అనుకున్న తర్వాతే కథని డెవలప్ చేయడం జరిగింది. ఆయన దగ్గర చాలా ప్రాజెక్ట్స్ ఉన్నాయి. అయితే ఈ సినిమా స్క్రిప్ట్ చక్కగా వచ్చిన విధానం చూసి ముందు ఈ సినిమానే చేద్దామని అన్నారు.

**సినిమా చేస్తున్నప్పుడు రవితేజ గారు ఏమన్నారు?**

ఆయన చాలా ఎంజాయ్ చేశారండి. రామ్ సత్యనారాయణ క్యారెక్టర్ నేనేదైతే రాశానో దాన్ని ఫాలో అయ్యారు. నాకోసం అస్సలు కన్ఫ్యూజ్ అవ్వద్దు నువ్వు ఏం చేయాలను కుంటున్నావో నేను అదే చేస్తానని చెప్పారు. రవితేజ గారు సినిమా చాలాసార్లు చూశారు. మేమందరం కూడా చాలా హ్యాపీగా ఉన్నాము. ఆడియన్స్ కూడా చాలా ఎంజాయ్ చేస్తారు

**ఈ టైటిల్ ఆలోచన ఎవరిది?**

రంగబలి డైరెక్టర్ పవన్ ఈ సినిమా స్క్రిప్ట్‌కి పని చేశారు. ఈ టైటిల్ ఆలోచన ఆయనదే.

**హీరోయిన్స్ గురించి?**

ఆషికా, డింపుల్.. ఇద్దరి క్యారెక్టర్‌లో డిఫరెంట్‌గా ఉంటాయి. ఇద్దరికీ మంచి పర్ఫార్మెన్స్ స్కోప్ ఉంది. ఆషికా పెర్ఫార్మెన్స్ స్ట్రాంగ్ గా ఉంటుంది. డింపుల్ కూడా ఇప్పటివరకు కనిపించని ఒక డిఫరెంట్ రోల్ లో కనిపించబోతున్నారు.

# 'నారి నారి నడుమ మురారి' చూసి ఎంజాయ్ చేస్తారు: - శర్వా



చార్మింగ్ స్టార్ శర్వా, రామ్ అబ్బరాజు, రామబ్రహ్మం సుంకర, ఎకె ఎంటర్‌టైన్‌మెంట్స్ నారి నారి నడుమ మురారి హిలేరియస్ ట్రైలర్ లాంచ్‌చార్మింగ్ స్టార్ శర్వా పర్ఫెక్ట్ సంక్రాంతి ఎంటర్‌టైనర్ నారి నారి నడుమ మురారితో అలరించబోతున్నారు. జనవరి 14న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కానుంది. సామజవరగమన ఫేమ్ కామెడీ మస్ట్రో రామ్ అబ్బరాజు దర్శకత్వం వహించిన ఈ చిత్రం టీజర్, మొదటి రెండు పాటల ద్వారా భారీ అంచనాలను పెంచింది. అడ్వెంచర్స్ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్ సహకారంతో ఎకె ter f బ్యానర్‌పై రామబ్రహ్మం సుంకర నిర్మించిన ఈ చిత్ర ట్రైలర్ ఈరోజు విడుదలైంది. దర్శకుడు రామ్ అబ్బరాజు క్లిన్ అండ్ ఎంగేజింగ్ కామెడీని అద్భుతంగా తెరపైకి తీసుకొచ్చారు. ఎ.కె. ఎంటర్‌టైన్‌మెంట్స్ , అడ్వెంచర్స్ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్ నిర్మాణ విలువలు సినిమాకు మరో బలంగా నిలిచాయి. .

# తెర


తెలుగు ప్రేక్షకులు మెచ్చే అన్ని అంశాలతో నిండిన పండుగ సినిమా 'అనగనగా ఒక రాజు' : నిర్మాత సూర్యదేవర నాగవంశీఈ సంక్రాంతికి భారీ అంచనాల

## 'అనగనగా ఒక రాజు' పండుగలా ఉంది



నడుమ విడుదలవుతున్న అసలు సిసలైన పండుగ సినిమా 'అనగనగా ఒక రాజు' పండుగలా ఉంది 'అనగనగా ఒక రాజు' మూడు వరుస ఘన విజయాలతో ప్రేక్షకుల హృదయాలలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న స్టార్ ఎంటర్‌టైనర్ నవీన్ పొలిశెట్టి కథానాయకుడిగా నటించిన ఈ చిత్రాన్ని.. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించారు. శ్రీకర స్టూడియోస్ సమర్పిస్తోంది. నూతన దర్శకుడు మారి దర్శకత్వం వహించిన ఈ సినిమాలో మీనాక్షి చౌదరి కథానాయిక. మిక్కీ జె మేయర్ సంగీతం అందించారు. మొదటి నుంచి ప్రచార చిత్రాలలో వైవిధ్యం చూపిస్తూ ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించిన ఈ చిత్రం..నవీన్ పొలిశెట్టి మాట్లాడుతూ.. "అందరికీ ముందుగా సంక్రాంతి శుభాకాంక్షలు. మన తెలుగువారికి సంక్రాంతి అనేది ప్రత్యేకమైన పండుగ. ఎన్ని బాధలున్నా అవన్నీ మర్చిపోయి మన వాళ్ళను కలుసుకొని సంతోషంగా ఉంటాం. ఒత్తిడిని పక్కన పెట్టి, పిండి వంటలు తింటూ, నలుగురితో నవ్వుకుంటూ చాలా సరదాగా ఉంటాం. అన్నారు. కథానాయిక మీనాక్షి చౌదరి మాట్లాడుతూ.."మేమందరం ఎంతో కష్టపడి పని చేసి.. ఒక మంచి సినిమాతో మీ ముందుకు వస్తున్నాము. చిత్ర దర్శకుడు మారి మాట్లాడుతూ.. "సినిమా చాలా బాగా వచ్చింది. పర్ఫెక్ట్ ఫెస్టివల్ ఎంటర్టైనర్ ఇది. సంక్రాంతి అనేది తెలుగు ప్రజలకు ప్రత్యేకమైన

# 'పుష్ప కున్రిన్' జపాన్‌లో విడుదల



ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ కెరీర్‌లోనే అతిపెద్ద బ్లాక్‌బస్టర్‌గా నిలిచి, భారత సినీ పరిశ్రమను షేక్ చేసిన చిత్రం 'పుష్ప 2: ది రూల్'. ఇప్పుడీ చిత్రం జపాన్‌లో సందడి చేయనుంది. విడుదలైన రోజు నుంచే ఓ సెన్సేషనల్‌గా మారిన ఈ సినిమా ఇండియన్ సినీ బాక్సాపీస్ దగ్గర తిరుగు లేని బ్లాక్‌బస్టర్ విజయాన్ని సాధించింది. ఈ సినిమాలో జపాన్‌కు సంబంధించి ఓ స్పెషల్ రెఫరెన్స్ కూడా ఉన్న సంగతి తెలిసిందే. పుష్ప ఎంట్రీ ఫైట్ సీన్ జపాన్ నేపథ్యంలో సాగుతుంది. ఇందులో అల్లు అర్జున్ స్వయంగా జపనీస్‌లో డైలాగ్స్ చెప్పటం ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ ఎలిమెంట్స్ ఇప్పుడు జపాన్ ప్రేక్షకుల్లో పుష్ప 2పై మరింత ఆసక్తిని పెంచ నున్నాయి. పుష్ప 2 సినిమాను జపాన్‌లో 'పుష్ప కున్రిన్'గా జనవరి 16న విడుదలవు తోన్న సందర్భంగా అల్లు అర్జున్ తన కుటుంబ సభ్యులతో కలిసి టోక్యో చేరుకున్నారు. తన అధికారిక ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ అందమైన నగరం ఉన్న ఫొటోను తీసి పోస్ట్ చేశారు. దీనికి సింపుల్‌గా టోక్యో అనే క్యాప్షన్ పెట్టారు. గీక్ పిక్చర్స్, షోచికు సంస్థలు మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్‌తో కలిసి పుష్ప మ్యాడ్‌నెస్‌ను జపాన్ సిల్వర్ స్క్రీన్స్ మీదకు తీసుకు వస్తున్నాయి. ఇప్పటికే జపాన్ ప్రేక్షకులకు ఇండియన్ బ్లాక్ బస్టర్స్ సినిమాలకు మంచి ఆదరణ చూపారు. ఈ నేపథ్యంలో పుష్ప కున్రిన్ ఘన విజయం సాధిస్తుందని నిర్మాతలు నమ్మకంగా ఉన్నారు. ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ ప్రధాన పాత్రలో నటించి రికార్డులు తిరగరాసిన బ్లాక్‌బస్టర్ చిత్రం పుష్ప 2 మూవీ జపాన్‌లో 'పుష్ప కున్రిన్' అనే పేరుతో విడుదలకు సిద్ధమైంది. ఈ చిత్రం జనవరి 15, 2026న జపాన్ థియేటర్లలో ప్రీమియర్స్‌గా ప్రదర్శితం కానుంది. సుకుమార్ దర్శకత్వం వహించిన ఈ సినిమాకు దేవి శ్రీ ప్రసాద్ సంగీతం అందించారు. రష్మిక మందన్న కథానాయిక. ఇందులో ఫహాద్ ఫాజిల్ పోలీస్ అధికారిగా కీలక పాత్రను పోషించారు. ఈ చిత్రాన్ని నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్‌లు నిర్మించారు.

# 'నేను రెడీ' టీజర్ రిలీజ్



యంగ్ హీరో హవిష్, దర్శకుడు త్రినాధ రావు నక్కినతో కలిసి కంప్లీట్ ఎంటర్టైనర్ ఖినేను రెడీఖి చేస్తున్నారు. హర్నిక్స్ ఇండియా లిలిశ బ్యానర్‌పై నిఖిల కొనేరు నిర్మిస్తున్న ఈ చిత్రంలో హవిష్ సరసన కావ్య థాపర్ కథానాయికగా నటిస్తోంది. పోస్టర్లు, టైటిల్ గ్లింప్స్‌తో మంచి బజ్ క్రియేట్ చేసిన ఈ చిత్రం టీజర్‌ను మేకర్స్ ఈరోజు విడుదల చేశారు. ఈ టీజర్‌ను ఇంతకు ముందు ప్రభాస్ ఖిరాజా సాబ్ఖి చిత్రంతో పాటు థియేటర్లలో ప్రదర్శించారు. ఈ టీజర్ ఒక ఎంటర్టైనింగ్ కథాంశాన్ని పరిచయం చేస్తుంది. ఒక ప్రైవేట్ కంపెనీలో పనిచేసే బాధ్యత గల మధ్యతరగతి ఆంధ్ర యువకుడికి, ఒక మధ్యతరగతి తెలంగాణ అమ్మాయితో నిశ్చితార్థం జరగడం, దానివల్ల కల్చర్, లైఫ్ స్టయిల్ మధ్య హిలేరియస్ కాన్ఫ్లిక్ట్ కి దారితీయడం ఆసక్తికరంగా వుంది. త్రినాధ రావు నక్కిన మరోసారి కంప్లీట్ ఎంటర్టైనర్ రూపొందించడంలో తన మార్క్ ని చూపించారు. హవిష్ బాధ్యత గల మధ్యతరగతి కుర్రాడి పాత్రలో ఒదిగిపోయి, తన స్క్రీన్ ప్రెజెన్స్, అద్భుతమైన కామెడీ టైమింగ్‌తో ఆకట్టుకున్నాడు.

# 'వెంకీ పింకీ జంప్' సినిమా ఆడియో..



విక్రమ్, రమ్య హీరో హీరోయిన్లు గా నటిస్తున్న సినిమా "వెంకీ పింకీ జంప్". ఈ చిత్రాన్ని శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర ఫిలింస్ బ్యానర్ పై వెంకట్, బాబా నిర్మిస్తున్నారు. యూత్ ఫుల్ రొమాంటిక్ లవ్ స్టోరీతో దర్శకుడు అజయ్. యన్ రూపొందిస్తున్నారు. త్వరలో గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రాబోతున్న "వెంకీ పింకీ జంప్" సినిమా ఆడియో రిలీజ్ ఈవెంట్ ఆదివారం హైదరాబాద్ లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రముఖ దర్శకుడు వి. సముద్ర, బెజవాడ బేబక్క, ప్రముఖ దర్శకనిర్మాత సాయివెంకట్ ముఖ్య అతిథిలు గా హాజరై ఆడియో బిగ్ సీడీ రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా బిగ్ బాస్ ఫేమ్ బేబక్క మాట్లాడుతూ హీరో విక్రమ్ మాటల్లో నిజాయితీ కనిపిస్తోంది. ఈ మూవీకి ఆనంద్ రాజా గారు చేసిన సాంగ్స్ చాలా బాగున్నాయి. హీరోయిన్ రమ్య బ్యూటిఫుల్ గా ఉంది. "వెంకీ పింకీ జంప్" మూవీ మంచి హిట్ కావాలని కోరుకుంటున్నా. అన్నారు. మ్యూజిక్ డైరెక్టర్ ఆనంద్ రాజా మాట్లాడుతూ నేను ఎన్నో చిత్రాలకు మ్యూజిక్ అందించాను. పాటలు రాశాను. "వెంకీ పింకీ జంప్" చిత్రంతో మా అబ్బాయి విక్రమ్ ను హీరోగా పరిచయం చేస్తున్నందుకు దర్శక నిర్మాతలకు థ్యాంక్స్ చెబుతున్నా. . అన్నారు. హీరో విక్రమ్ మాట్లాడుతూ నేను అందంగా ఉండను. హీరోగా నన్ను నేను స్క్రీన్ మీద చూసుకుంటుంటే ఎమోషనల్ అయ్యాను. ఈ చిత్రంలో హీరోగా నటించే అవకాశం ఇచ్చిన మా డైరెక్టర్ అజయ్, ప్రొడ్యూసర్స్ వెంకట్, బాబా గారికి థ్యాంక్స్. హీరోగా మంచి పేరు తెచ్చుకుని మా నాన్న గర్వపడేలా చేస్తాను.

## హాకీ ఇండియా లీగ్‌లో..
# హైదరాబాద్ ఓటమి
### పైపర్స్ విజయం



**న్యూఢిల్లీ:** హాకీ ఇండియా లీగ్ 2025-26 సీజనులో హైదరాబాద్ టూఫాన్స్‌పై 2-1 తేడాతో ఎస్‌జి పైపర్స్ తొలి విజయాన్ని నమోదు చేసింది. విజేతల తరఫున టోమస్ డొమెనే 2 గోల్స్ సాధించగా, గోల్ కీపర్ టోమస్ శాంటియాగో అద్భుతంగా గోల్ చేశాడు. టూఫాన్స్ తరఫున అమన్‌దీప్ లక్రా గోల్ చేశాడు. ఈ పోటీలో పైపర్స్ అద్భుతంగా రాణించి వరుసగా పెనాల్టీ కార్నర్‌లను సాధించగా, థామస్ డొమెనే (8వ నిముషం) డ్రాగ్‌ఫ్లిక్ ద్వారా ఒకదాన్ని గోల్‌గా మార్చాడు. తొలి 15 నిమిషాల్లో పైపర్స్‌కు మొత్తం 6 పెనాల్టీ కార్నర్లు లభించింది. హైదరాబాద్ 5 సర్కిల్ ఎంట్రీలను నమోదు చేస్తూ ఆటలోకి అడుగుపెట్టింది. రెండవ క్వార్టర్‌ను ప్రారంభించే సమయానికి టూఫాన్స్ తమ ప్రత్యర్థిని వెనక్కి నెట్టి, గోల్‌పై 12 సర్కిల్ ఎంట్రీలు, 4 పెనాల్టీ కార్నర్‌లను నమోదు చేసింది. గోల్‌పై 7 షాట్లు నమోదు చేసినా అవి ఎటువంటి ఫలితాన్ని ఇవ్వలేదు. టోమస్ డొమెనే(29) ద్వారా పైపర్స్ తమ రెండవ గోల్‌ను సాధించడంతో హాఫ్ టైంలో పైపర్స్‌కు 2-0 ఆధిక్యాన్ని అందించింది. హైదరాబాద్ మూడవ క్వార్టర్‌లో 8 సర్కిల్ ఎంట్రీలు, 2 పెనాల్టీ కార్నర్‌లను నమోదు చేశారు. అమన్‌దీప్ లక్రా(41) తన డ్రాగ్‌ఫ్లిక్‌తో గోల్ సాధించడంతో చివరి క్వార్టర్‌లోకి 2-1 స్కోరుతో టూఫాన్స్‌కు పోరాడే అవకాశం ఇచ్చాడు. హైదరాబాద్ చివరి క్వార్టర్‌లో 16 సర్కిల్ పెనెట్రేషన్‌లు, 6 పెనాల్టీ కార్నర్‌లను సాధించినా, టోమస్ శాంటియాగో జాకరీ వాలెస్‌నుగోల్ చేయనీయకుండా అడ్డుకోవడంతో పైపర్స్ టోర్నమెంట్‌లో తమ మొదటి విజయాన్ని నమోదు చేసింది.

# అండర్19 ప్రపంచ కప్‌లో భారత్ ఓటమి
### ఇంగ్లండ్ 20 రన్స్ తేడాతో గెలుపు



**న్యూఢిల్లీ:** అండర్19 ప్రపంచ కప్ 2026లో భాగంగా చివరి మ్యాచ్‌లో భారత్ ఇంగ్లాండ్ చేతిలో 20 పరుగుల (డబ్ల్యుఎల్‌ఎస్ పద్ధతి) తేడాతో ఓడిపోయింది. బులవాయోలో జరిగిన ఈ మ్యాచ్‌లో కెప్టెన్ థామస్ రెవ్ అజేయంగా 71 పరుగులు చేయడంతో ఇంగ్లాండ్ మూడు వికెట్లకు 196 పరుగులు చేసింది. అయితే 34.3 ఓవర్ల తర్వాత వర్షం ఆటను నిలిపివేసింది. ఈ సమయానికి ఇంగ్లాండ్ 177 పరుగుల పార్‌స్కోర్ కంటే చాలా ముందుంది. 295 పరుగుల బరిలోకి దిగిన భారత్, రెండో ఓవర్లోనే ఓపెనర్ బెన్ డాకిన్స్‌ను హెనిల్ పటేల్ ఔట్ చేయడంతో అద్భుతమైన ఆరంభాన్ని పొందింది. జోసెఫ్ మూర్స్, బెన్ మేయస్ రెండో వికెట్‌కు 77 పరుగులు జోడించి కోలుకున్నారు. ఎడమచేతి వాటం బ్యాట్స్‌మెన్ ఖిలాన్ పటేల్ ఇద్దరికీ బాటలు వేయడంతో, 19వ ఓవర్‌లో ఇంగ్లాండ్ 104 పరుగులకే 3 వికెట్లు కోల్పోయింది. కానీ రెవ్ 6 ఫోర్లు, 3 సిక్సర్లతో జట్టుకు స్కోరు పెంచాడు. కాలెబ్ ఫాల్కనర్(29) కూడా ఇంగ్లాండ్ భారత్ ఓటమిలో కీలక పాత్ర పోషించాడు. తొలి ఇన్నింగ్స్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఆయుష్ మాత్రే భారత్‌కు మంచి ఆరంభాన్ని అందించి టాప్ ఆర్డర్‌లో (49) రాణించాడు. వైభవ్ సూర్యవంశీ ఘోరంగా విఫలమై ఒక పరుగుకు ఔటయ్యాడు. విహాన్ మల్హోత్రా(10), వేదాంత్ త్రివేది(14) తేలిపోయారు. జేమ్స్ మింటో బౌలింగ్‌లో మాత్రే క్యాచ్ అవుట్ అయ్యే సమయానికి, భారత్ 4 వికెట్లకు 79 పరుగులు చేసి కష్టాల్లో పడింది. కానీ అభిజ్ఞాన్ కుండు 82 పరుగుల ఇన్నింగ్స్‌తో భారత్‌ను క్లిష్ట పరిస్థితి నుంచి బయటపడేశాడు. వికెట్ కీపర్‌బ్యాటర్ ఆర్‌ఎస్ అంబ్రిష్‌తో కలిసి ఐదవ వికెట్‌కు 97 పరుగులు జోడించాడు. కనిష్క్ చౌహాన్ కేవలం(45) జట్టుకు విజయాన్ని అందించాడు, భారత్ ఎనిమిది వికెట్లకు 295 పరుగులు చేసింది. ఇంగ్లాండ్ బౌలర్లలో మింటో ఎనిమిది ఓవర్లలో 34 పరుగులకు ఐదు వికెట్లు పడగొట్టాడు.




# ఇండియా ఓపెన్ బ్యాడ్మింటన్
### మెయిన్ డ్రాకు తన్వి

**న్యూఢిల్లీ:** ప్రపంచ జూనియర్ ఛాంపియన్‌షిప్‌లో రజత పతక విజేత తన్వి శర్మ, మహిళల డబుల్స్ జాతీయ ఛాంపియన్‌లు అశ్విని భట్, కె శిఖా గౌతమ్, మన్నెపల్లి తరుణ్ బిడబ్ల్యూఎఫ్ ఇండియా ఓపెన్ 2026 ప్రధాన డ్రాకు ప్రమోట్ చేయబడ్డారు. ఈ టోర్నమెంట్ ముందు కొంతమంది అగ్రశ్రేణి క్రీడాకారులు వైదొలగడంతో ఈ అవకాశం లభించింది. ప్రపంచ ఛాంపియన్ మరియు పురుషుల సింగిల్స్ ప్రపంచ నంబర్ 1 చైనాకు చెందిన షి యుకి మలేషియా ఓపెన్ 2026 ఫైనల్‌లో కున్లావుట్ విటిడ్సర్న్‌తో తలపడాల్సి రావడంతో టోర్నమెంట్ నుంచి వైదొలిగాడు. అతని స్వదేశీయుడు వెంగ్ హాంగ్ యాంగ్ కూడా వైదొలిగాడు. అలాగే మహిళల సింగిల్స్‌లో మలేషియా ఓపెన్ క్వార్టర్ ఫైనల్స్‌లో పివి సింధు చేతిలో రిటైర్ అయిన మహిళల 3వ సీడ్, ప్రస్తుత ప్రపంచ ఛాంపియన్ అకానె యమగుచి కూడా వైదొలిగింది. దీంతో తన్వి ఇండియా ఓపెన్‌లో అరంగేట్రం చేయడానికి మార్గం సుగమం చేసింది. తన్వి తొలి రౌండ్‌లో చైనాకు చెందిన రెండో సీడ్ వాంగ్ ఝీ యితో తలపడనుంది. అలాగే రిజర్వ్‌డ్ కేటగిరీ నుంచి తరుణ్ ఎంపిక కావడం వల్ల పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో రెండు అఖిల భారత పోటీలు జరుగుతాయి. లక్ష్య సేన్, శెట్టి ఆయుష్ ఒకరితో ఒకరు తలపడనుండగా, తరుణ్ తొలి రౌండ్‌లో కిదాంబి శ్రీకాంత్‌తో తలపడనున్నాడు. మహిళల డబుల్స్‌లో అశ్విని-శిఖా జోడీ తొలి రౌండ్‌లో ఫ్రాన్స్‌కు చెందిన మార్గోట్ లాంబెర్ట్‌కామిల్లె పోగ్నాంటేతో తలపడనుంది.

# టి20లు ఆడకుండానే లక్కీ కెప్టెన్స్
## ఈ దిగ్గజాల రూటే వేరు

**న్యూఢిల్లీ:** సాధారణంగా ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) వంటి భారీ లీగ్‌లో ఒక జట్టుకు నాయకత్వం వహించాలంటే టీ20 ఫార్మాట్‌లో ఎంతో అనుభవం ఉండాలి. కానీ, ఐపీఎల్ చరిత్రలో కొందరు దిగ్గజాలు ఒక్క అంతర్జాతీయ టీ20 మ్యాచ్ కూడా ఆడిన అనుభవం లేకుండానే కెప్టెన్సీ బాధ్యతలు చేపట్టారు. షేన్ వార్న్ నుంచి కరుణ్ నాయర్ వరకు ఐదుగురు ఆటగాళ్లు ఈ జాబితాలో ఉన్నారు.



ఆస్ట్రేలియా స్పిన్ మాంత్రికుడు షేన్ వార్న్ ఈ లిస్టులో టాప్‌లో ఉన్నాడు. ఆస్ట్రేలియా తరఫున ఒక్క అంతర్జాతీయ టీ20 మ్యాచ్ కూడా ఆడకుండానే, ఐపీఎల్ తొలి సీజన్ (2008)లో రాజస్థాన్ రాయల్స్ జట్టుకు కెప్టెన్సీ చేశారు. అంతేకాదు అండర్ డాగ్స్‌గా ఉన్న ఆ జట్టును ఏకంగా ఛాంపియన్‌గా నిలబెట్టి తన నాయకత్వ పటిమను ప్రపంచానికి చాటారు. అలాగే టీమిండియా మాజీ సారథి దాదా సౌరవ్ గంగూలీకి టీ20 అంతర్జాతీయ అనుభవం సున్నా. అతడు భారత్ తరఫున కేవలం వన్డేలు, టెస్టులు మాత్రమే ఆడాడు. అయినప్పటికీ, ఐపీఎల్ ఆరంభ సీజన్లలో కోల్‌కతా నైట్ రైడర్స్, పూణే వారియర్స్ జట్లకు కెప్టెన్‌గా వ్యవహరించాడు. లెగ్ స్పిన్ దిగ్గజం అనిల్ కుంబ్లే కూడా భారత్ తరఫున ఒక్క టీ20 కూడా ఆడలేదు. అయితే, ఐపీఎల్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టును అద్భుతంగా నడిపించాడు. 2009 సీజన్‌లో రాయల్ ఛాలెంజర్స్‌ను ఫైనల్ వరకు తీసుకెళ్లిన ఘనత కుంబ్లేదే. ఇక క్లాసిక్ బ్యాటర్ వివిఎస్ లక్ష్మణ్ టీ20 ఫార్మాట్‌కు సెట్ కారనే విమర్శలు ఉన్నప్పటికీ, 2008లో డెక్కన్ ఛార్జర్స్ జట్టుకు ఆయన కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. లక్ష్మణ్ తన కెరీర్‌లో భారత్ తరఫున కేవలం టెస్టులు, వన్డేలు మాత్రమే ఆడాడు. ఒక్క టీ20 ఇంటర్నేషనల్‌లో కూడా ప్రాతినిధ్యం వహించలేదు. ఈ జాబితాలో అత్యంత ఆశ్చర్యకరమైన పేరు కరుణ్ నాయర్. మిగిలిన నలుగురు దిగ్గజాలు రిటైర్మెంట్ దశలో ఐపీఎల్ ఆడగా, కరుణ్ నాయర్ మాత్రం యువ ఆటగాడిగా ఉన్నప్పుడే ఈ అరుదైన ఫీట్ సాధించాడు. 2017లో ఢిల్లీ డేర్‌డెవిల్స్ (ప్రస్తుత ఢిల్లీ క్యాపిటల్స్) జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించాడు. అప్పటికి ఆయనకు టీ20 అంతర్జాతీయ అనుభవం లేదు.

## క్లాసిక్ ఓపెన్‌లో
# యూకీ బాంబ్రీ జోడీ తొలి విజయం



**న్యూఢిల్లీ:** కొత్త ఏడాదితో భారత్ డబుల్స్ టెన్నిస్ స్టార్ యూకీ బాంబ్రీ తొలి జోడీ తొలి విజయాన్ని అందుకుంది. న్యూజిలాండ్‌లో మొదలైన ఏఎస్‌బీ క్లాసిక్ ఓపెన్ ఏటీపీ-250 టెన్నిస్ టోర్నీలో యూకీ బాంబ్రీ (భారత్)-ఆండ్రీ గొరాన్‌సన్ (స్వీడన్) జోడీ శుభారంభం చేసింది. పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో టాప్ సీడ్ యూకీ-గొరాన్‌సన్ ద్వయం 8-3, 6-2తో అజీత్ రాయ్ (న్యూజిలాండ్)-జీన్ జూలియన్ రోజర్ (నెదర్లాండ్స్) జంటను ఓడించి క్వార్టర్ ఫైనల్ చేరుకుంది. 66 నిముషాల పాటు జరిగిన ఈ మ్యాచ్‌లో ఇండో-స్వీడిష్ జోడీ మూడు ఏస్‌లు సంధించి, ఒక డబుల్ ఫాల్ట్ చేసింది. తొలి సర్వీస్‌లో 32 పాయింట్లకు గాను 27 పాయింట్లు, రెండో సర్వీస్‌లో 16 పాయింట్లకుగాను 8 పాయింట్లు స్కోరు చేసింది. తమ సర్వీస్‌ను ఒకసారి కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను నాలుగుసార్లు బ్రేక్ చేసింది. కాగా యూకీ-గొరాన్‌సన్ ద్వయం బ్రిస్బేన్ ఓపెన్ ఏటీపీ-250 టోర్నీతో కొత్త సీజన్ ఆరంభించింది. ఆ టోర్నీలో తొలి రౌండ్‌లో బై పొంది నేరుగా రౌండ్ మ్యాచ్ ఆడిన ఈ జంట 5-7, 4-6తో ఒర్లాండో లుజ్-మటోస్ (బ్రెజిల్) ద్వయం చేతిలో చిత్తయింది.

## ప్రైవేటు ఈక్విటీ పెట్టుబడులు 3.7బిలియన్ డాలర్లు

**న్యూఢిల్లీ, జనవరి 13:** భారత్‌ప్రైవేటు ఈక్విటీ కార్యకలాపాలు నాలుగోత్రైమాసికంలో పటిష్టం అయ్యాయి. పెట్టుబడులు 3.7 బిలియన్ డాలర్లకు చేరడంతో గత త్రైమాసికంకంటే 44.3శాతం వృద్ధినమోదు చేసినట్లు తేలింది. లండన్ స్టాక్ ఎక్స్ఛేంజి గ్రూప్(ఎల్‌ఎస్‌ఇజి) తన నివేదికలో మొత్తం నాలుగో త్రైమాసికంలో ప్రైవేటు ఈక్విటీ పెట్టుబడులు 2024 నాలుగో త్రైమాసికం కంటే అత్యధికంగా ఉన్నట్లు వెల్లడించింది. పూర్తిసంవత్సరానికిగాను ప్రైవేటు ఈక్విటీ పెట్టుబడులు 23.7శాతంపెరిగాయి. అంటే 12.1 బిలియన్‌డాలర్లుగా ఉన్నట్లు ఎల్లెస్‌ఈజీ తెలిపింది. అయితే పెట్టుబడులు పరంగా ఎంతో అప్రమత్తంగా జరిగినట్లు తేలింది. మొత్తంగాచూస్తే పెట్టుబడులు కొంత మందగమనంతో ఉన్నప్పటికీ టెక్నాలజీ ఆధారిత రంగాలు మాత్రం వృద్ధిలో ఉన్నట్లు తేలింది.కృత్రిమ మేధ, గ్రీన్‌పోర్టులు, క్విక్‌కామర్స్‌రంగాల్లో ఈ పిఈ పెట్టుబడులు పెరుగుతున్నట్లు అంచనా వేసింది.

## ఎఐ ఆధారిత నియామకాలు: 3.8 లక్షలు అంచనా!

**బెంగళూరు, జనవరి 13:** కృత్రిమమేధ ఇపుడు నియామకాల్లో అగ్రస్థానంలో ఉంది. గత ఏడాది భారత్ లో జరిగిన ఉద్యోగ నియామకాల్లో కృత్రిమమేధ మెళకువలున్నవారికే ఎక్కువ సంఖ్య లభించింది. ఎఐ లింక్డ్ ఉద్యోగాలు గత ఏడాది 2,90,256 వరకూ జరిగినట్లు ఒకసర్వేలో తేలింది. ఎఐ నియామకాలు 32శాతం వార్షికపద్ధతిలో వృద్ధి ఉంది. 2026లో సుమారు 3.8 లక్షలమందికి ఉద్యోగాలు రావచ్చని ఫౌండిట్ సర్వేలో తేలింది. భారత్ జాబ్ మార్కెట్ గత ఏడాదినుంచే కొత్త నమ్మ కాలను పంచుతోంది. సుస్థిర నియామకాలు, ఇంటర్వ్యూల్లో వృద్ధి వంటి వాటితో విభిన్నరంగాలు, వివిధ హోదాలు, నగరాలో కూడా మెరుగుపడుతున్నట్లు సర్వేలో తేలింది. నెలవారీగాచైస్తే ఐదుశాతం వృద్ధిఉంటే వార్షిక పద్ధతిలో అయితే 15శాతం ఎఐ నియామకాలున్నట్లు ఫౌండిట్ సిఇఒ తరుణ్‌శర్మ వెల్లడించారు.

## ఆల్‌టైమ్ గరిష్టానికి ప్యాసింజర్ వాహనాల సేల్స్

**ముంబయి, జనవరి 13:** భారత్‌లో ఈ ఏడాది మూడోత్రైమాసికంలో ప్యాసింజర్ వాహనాల విక్రయాలు భారీగా ఉన్నాయి. వినియోగరంగం నుంచి డిమాండ్ పెరగడంతో అమ్మకాలు మెరుగయినట్లు చెపుతున్నారు. దీనికి తోడు పండుగ సీజన్‌కూడా వారికి కలిసొచ్చింది. ఆటోమొబైల్ ఉత్పత్తిదారులసంఘం సియామ్ అంచనాలప్రకారం పివి దేశీయ విక్రయాలు 3వ త్రైమాసికంలో ఆల్‌టైమ్ గరిష్టానికి చేరి 12,76,073కి పెరిగాయి. 20.6శాతం గత ఏడాది కంటే వృద్ధిని నమోదుచేసాయి. కేలండర్ సం వత్సరంలో కార్ల విక్రయాలు ప్రత్యేకించి ప్యాసింజర్ వాహనాల్లో పెరిగాయి. 44.90లక్షల వాహనాలు పంపిణీ అయినట్లుతేలింది. యుఇటిలటీ వాహనాలు భారీగానే అమ్మ కాలు జరిగాయని చెపుతున్నారు.

# రికార్డు స్థాయి నుంచి దిగువకు సెన్సెక్స్, నిఫ్టీ
### ట్రేడింగ్‌లో డీలాపడ్డ మేజర్ కంపెనీలు





**ముంబయి, జనవరి 13:** ఇంట్రాడేలో అమ్మకాల జోరుపెరగడంతో దేశీయ స్టాక్ మార్కెట్లు దిగువస్థాయిలోనే ట్రేడింగ్‌ను ముగించాయి. రికార్డు గరిష్టంనుంచి బిఎస్‌ఇ సెన్సెక్స్ 995 పాయింట్లు క్షీణిస్తే నిఫ్టీ 50సూచీలో కూడా 296 పాయింట్లు దిగజారాయి. ట్రేడింగ్ ఆద్యంతం అమ్మకాల ఒత్తిళ్లే కనిపించాయి. ఇంట్రాడేలో ఒక దశలో నిఫ్టీ 25,899.80కి చేరినా తదనంతరం 25,750కి దిగజారింది. వినియోగరంగ ఉత్ప త్తులు, ఫార్మా రంగ స్టాక్స్ తీవ్రస్థాయిలో దెబ్బ తిన్నాయి. భారీ స్టాక్స్‌లో లాభాలస్వీకరణ ఎక్కువ కనిపించింది. ఇన్వెస్టర్లు లాభాలకే మొగ్గు చూపించారు. గ్లోబల్ ధోరణులు అనిశ్చితంగా కనిపించడం, ముడిచమురుధరలు పెరగడం కూడా ఒత్తిడికి కారణం అయింది. ద్రవ్యోల్బణం, కరెంటుఖాతాలోటు వంటివి కూడా మార్కెట్లపై ప్రభావం చూపించాయి. విదేశీ ఇన్వెస్టర్లు ఎక్కువ విత్‌డ్రాచేస్తే దేశీయ ఇన్వెస్టర్లు కొంతమేర మద్దతు పలికినట్లుగా ఉంది. డాలరుతో రూపాయి మారకం విలువలు కూడా క్షీణించాయి. దిగుమతి ఆధారిత రంగాలపై ఈ భారం పడింది. బిఎస్‌ఇ సెన్సెక్స్ 250.48 పాయింట్లు క్షీణించి 83,627 పాయింట్లవద్ద ముగిస్తే నిఫ్టీ 50సూచీ 57.95 పాయింట్లు క్షీణించి 25,732.30 పా యింట్లవద్ద నిలిచిపోయింది. ట్రెంట్ 3.39శాతం, లార్సెన్ అండ్ టూబ్రో 3.25శాతం, రిలయన్స్ 2.14 శాతం చొప్పున క్షీణించాయి. బిఎస్‌ఇలో మిడ్ క్యాప్‌సూచీ 0.16 శాతం క్షీణిస్తే స్మాల్‌క్యాప్‌సూచీ 0.46శాతం పెరిగింది. మార్కెట్లపరంగాచూస్తే బిఎస్‌ఇలో 2038 కంపెనీలు పెరిగాయి. 2099 షేర్లు దిగజారితే 201 కంపెనీలషేర్లు యధాతథంగా కొనసాగాయి. డాలరుతో రూపాయి మారకం విలువలు 90.22గా మారింది. ఎంసిఎక్స్ పసిడి ఫ్యూచర్స్ ఫిబ్రవరి ఐదునాటి సెటిల్ మెంట్లు 0.32శాతం క్షీణించి రూ.1,41,580గా మారింది. కమోడిటీ మార్కెట్లలో బ్రెంట్‌ముడి చమురు మార్చి సెటిల్ మెం ట్లకుగాను 1.05 డాలర్లుపెరిగి బ్యారెల్‌కు 64.92 డాలర్లుగా నడిచింది. ఇక షేర్లపరంగా టిసిఎస్ 0.99శాతం పెరిగింది. హెచ్‌సిఎల్ టెక్నాలజీస్ 0.19శాతం క్షీణించింది. ఎల్‌అండ్‌టి కూడా 3.25శాతం తగ్గింది. కల్పతరు 0.33శాతం, మహారాష్ట్ర స్కూటర్స్ 6.73శాతం చొప్పున పెరిగాయి. ఒమాక్సే కంపెనీ షేర్లు 12.63శాతంపెరిగితే లోటస్ చాక్లెట్ కంపెనీ 9.71శాతం క్షీణించింది. ఇక జిటిపిఎల్ హాత్‌వే 7.93శాతం, ఆనంద్‌రాఠి వెల్త్ 0.51శాతం, ఇండోథాయ్ సెక్యూరిటీస్ 2.11శాతం, పూర్వాంకారా షెడ్ 0.22శాతం చొప్పున క్షీణిం చాయి. అలాగే ఎబి ఇన్‌ఫ్రా బిల్డ్ 3.5శాతం, బిఆర్‌గోయల్ ఇన్‌ఫ్రా 1.72శాతం, ఓరియంటల్ హోటల్స్ 2.84శాతం చొప్పున పెరిగాయి.

# స్వల్పంగా తగ్గిన పసిడి, వెండి

**ముంబయి, జనవరి 13:** రికార్డు స్థాయిలకు చేరిన బంగారం, వెండి ధరలు మంగళవారం స్వల్పంగా తగ్గాయి. ఇన్వెస్టర్లు భారీ లాభాల స్వీకరణకు (ప్రాఫిట్ బుకింగ్) మొగ్గు చూపడంతో ఈ పరిణామం చోటుచేసుకుంది. మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ ఎంసిఎక్స్‌లో మధ్యాహ్నం 1:15 గంటల సమయంలో ఫిబ్రవరి గోల్డ్ ఫ్యూచర్స్ 0.44 శాతం తగ్గి 10 గ్రాములకు రూ. 1,41,400 వద్ద ట్రేడ్ అయింది. మార్చి సిల్వర్ ఫ్యూచర్స్ దాదాపు యథాతథంగా ఉంటూ కిలోకు రూ.2,68,926 వద్ద నిలిచింది. ఇండియా బులియన్ అండ్ జువెలర్స్ అసోసియేషన్ ఐబిజెఎ అంచనాల ప్రకారం, 24 క్యారెట్ల బంగారం ధర సోమవారంతో పోలిస్తే స్వల్పంగా తగ్గి 10 గ్రాములకు రూ.1,40,482గా ఉంది. అంతర్జాతీయ మార్కెట్లలో ఔన్స్ బంగారం ధర చరిత్రలో తొలిసారిగా 4,600 డాలర్ల మార్కును దాటింది. దీంతో ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు దిగారు. అమెరికా ఫెడరల్ రిజర్వ్ చైర్‌పై న్యాయ శాఖ చర్యలు తీసుకోవచ్చన్న ఆందోళనలు, ఇరాన్‌తో వాణిజ్యం చేసే దేశాలపై 25 శాతం సుంకాలు విధిస్తామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరించడం వంటి అంతర్జాతీయ పరిణామాలు పసిడి ధరల పెరుగుదలకు కారణమయ్యాయి. ఫెడ్ చైర్ జెరోమ్ పావెల్‌పై జరుగుతున్న క్రిమినల్ విచారణపై మార్కెట్లు దృష్టి సారించాయని మెహతా ఈక్విటీస్ లిమిటెడ్ వైస్ ప్రెసిడెంట్ రాహుల్ కలంత్రి అన్నారు. అమెరికాలో బలహీనంగా ఉన్న ఉద్యోగాల గణాంకాల నేపథ్యంలో ఫెడరల్ రిజర్వ్ ఈ ఏడాది రెండుసార్లు వడ్డీ రేట్లను తగ్గించవచ్చని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. రష్యాఉక్రెయిన్ యుద్ధం, ఇరాన్‌లో రాజకీయ అస్థిరత వంటి అంశాలు కూడా బంగారం ధరలకు మద్దతునిస్తున్నాయి. బంగా రానికి రూ.1,39,550 వద్ద మద్దతు, రూ.1,44,350 వద్ద నిరోధం ఉంది. ఇక వెండికి రూ.2,60,810 వద్ద మద్దతు, రూ.2,71,810 వద్ద నిరోధం కనిపిస్తోంది. పారిశ్రామిక, గ్రీన్ ఎనర్జీ రంగాల నుంచి డిమాండ్ పెరుగుతున్నందున, 2026 నాటికి వెండి ధర ఔన్సుకు 100 డాలర్లకు పైగా చేరవ చ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు.

## 10 నిమిషాల డెలివరీ క్లెయిమ్ రద్దు చేయండి
### క్విక్ కామర్స్ సంస్థలకు కేంద్రం ఆదేశాలు

**న్యూఢిల్లీ, జనవరి 13:** క్విక్‌కామర్స్ సంస్థలు ఇకపై పదినిమిషాల డెలివరీ క్లెయిమ్స్ నిలిపివేయాలని గిగ్‌వర్కర్ల భద్రతకు ఈచర్యలు తీసుకోవాల్సి ఉంటుందని కేంద్రం మంగళవారం క్విక్‌కామర్స్ సంస్థలకు ఆదేశాలు జారీచేసింది. దీనితో ఇపుడు బ్లింకిట్, జెప్టో, జొమాటో, స్విగ్గీ వంటి సంస్థలు 10 మినిట్ డెలివరీ క్లెయిమ్‌లు నిలిపివేసుకోవాల్సి వస్తోంది. కేంద్ర కార్మిక మంత్రి మన్సుక్ మాండవీయ క్విక్‌కామర్స్ కంపె నీలతో వరుసవెంబడి సమావేశాలు నిర్వహించి ఇలాంటి అల్ట్రా ఫాస్ట్ డెలివరీ వ్యవస్థలను నిలిపివేయాలని కోరారు. మేజర్ సంస్థలన్నీ కూడా ఈ పదినిమిషాల డెలివరీ వ్యవస్థలను నిలిపివేయడానికి అంగీకరించాయి. ఇదే వ్యవస్థపై ఢిల్లీ ఎంపి రాఘవ్‌చద్దా స్పందించారు. కేంద్రానికి కృతజ్ఞతలు తెలుపుతో సోషల్ మీడియాలో పోస్టుపెట్టారు. క్విక్‌కామర్స్ ప్లాట్ ఫామ్స్ 10 మినిట్స్ అన్న పదాలను రైడర్‌ల టీషర్టులు, జాకెట్లు, లేదా బ్యాగ్‌లపైనా ముద్రిం చాయని అలాగే కస్టమర్స్ స్క్రీన్‌పై ఒక టైమర్‌నున కూడా ముద్రించారని, దీన్నిబట్టి చూస్తే గిగ్‌వర్కర్లు ఎంత ఒత్తిడికి లోనవు తున్నారో తెలుస్తోందని అన్నారు. కేంద్రం స్పందించి ఈ క్లెయిమ్ రద్దు చేయడంపై ఆయన హర్షం ప్రకటించారు. వందలాదిమందితో తాను మాట్లాడానని, వారికి భద్రత లేదని, సరైన చెల్లింపులు కూడా రావడంలేదని చెప్పారన్నారు. ఎంతో ప్రమాదకరమైన వృత్తిలో ఉన్నా వారికి భద్రత లేదని అన్నారు. ఇటీవలే గిగ్‌వర్కర్లు సరైన చెల్లింపులు, ప్రోత్సాహకాలు ఇవ్వాలని కోరుతూ సమ్మెకు దిగిన సంగతి తెలిసిందే. క్విక్ కామర్స్ వ్యవస్థల్లో గిగ్‌వర్కర్ల దోపిడీ జరుగు తుందన్న వార్తలను ఈసందర్భంగా స్విగ్గీ జొమాటో మాతృసంస్థ ఎటర్నల్ వ్యవస్థాపకుడు దీపీందర్‌గోయల్ తిరస్కరించారు. అంతకుముందు కేంద్రం గిగ్‌వర్కర్ల కోసం నిబంధనలు జారీచేసింది.




Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.